www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 2-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 108 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ.7.24 తదుపరి నవమి, నక్షత్రం: విశాఖ పూర్తి, వర్జ్యం: ఉ.9.56 - 11.44, దుర్ముహూర్తం: ఉ.5.58-7.40, అమృతఘడియలు: రా.8.43-10.30, రా.8.42-10.30. రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 5.58, సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● శనివారం 2 ఆగస్టు 2025

సెమీస్‌కు తరుణ్, లక్ష్య



» సాత్విక్ జోడీ అవుట్ » మకావు ఓపెన్

మకావు: తెలుగు కుర్రాడు, వర్ధమాన షట్లర్ తరుణ్ మన్నేపల్లి మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. ప్రీక్వార్టర్స్‌లో టాప్‌సీడ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన తరుణ్, అదే జోరులో సెమీఫైనల్‌కు చేరాడు. క్వార్టర్స్‌లో తరుణ్ 21-12, 13-21, 21-18తో చైనాకు చెందిన హు ఝెను ఓడించాడు. మరో భారత షట్లర్ లక్ష్య సేన్ కూడా సెమీస్ చేరాడు. క్వార్టర్స్‌లో సేన్ 21-14, 18-21, 21-14తో గ్సువాన్ చెన్ ఝూ (చైనా)పై గెలిచాడు. కాగా, డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌కే పరిమితమైంది. సాత్విక్ ద్వయం 14-21, 21-13, 20-22తో మలేసియా జంట చూంగ్ హాన్ జియాన్/హైకల్ మహ్మద్ చేతిలో ఓటమి పాలైంది. ఫైనల్లో చోటు కోసం అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో లక్ష్య, జస్టిన్ హో (మలేసియా)తో తరుణ్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

చైనా చిన్నది..పతకం పట్టేసింది

ప్రపంచ స్విమ్మింగ్ రిలేలో జిడికి కాంస్యం



సింగపూర్: చైనాకు చెందిన 12 ఏళ్ల యు జిడి.. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం అందుకుంది. 4x200 మీటర్ల ఫ్రీస్టయిల్ టీమ్ రిలే ఈవెంట్ ఫైనల్లో జిడి లేకుండానే చైనా జట్టు బరిలోకి దిగింది. అయితే ప్రిలిమ్స్‌లో పాల్గొన్నందున జట్టు సభ్యురాలిగా జిడి కూడా పతకం అందుకుంది. ఇక ఫైనల్లో ఆస్ట్రేలియాకు స్వర్ణం, అమెరికాకు రజతం లభించాయి. ఇప్పటికే 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, మెడ్లే వ్యక్తిగత విభాగాల్లోనూ పోటీపడ్డ జిడి.. ఆ రెండు ఈవెంట్లలోనూ నాలుగో స్థానంలో నిలిచింది. జిడి... ఇంకా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో పోటీపడాల్సి ఉంది.

ఆకాంక్ష, సంచిత్‌కు స్వర్ణ పతకాలు

హైదరాబాద్: దక్షిణ కొరియాలో ఇటీవల జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఎండూరు ఆకాంక్ష, సంచిత్ చౌదరి స్వర్ణ పతకాలు సాధించారు. హైదరాబాద్‌కు చెందిన వీరు సీనియర్ షో గ్రూప్ విభాగంలో ఈ పతకాలు అందుకున్నారు.



జట్టు నుంచి బుమ్రా విడుదల

ప్రకటించిన బీసీసీఐ



లండన్/న్యూఢిల్లీ: పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రాను జాతీయ జట్టునుంచి విడుదలజేశారు. ముందు ప్రకటించినట్టుగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లను బుమ్రా ఆడేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో బుమ్రా ఆడే తదుపరి అంతర్జాతీయ సిరీస్ ఏదనే చర్చ మొదలైంది. 31 ఏళ్ల బుమ్రా ఇంగ్లండ్‌తో 3 టెస్టుల్లో 119.4 ఓవర్లు వేసి 14 వికెట్లు సాధించాడు. 'సిరీస్‌లో ఐదో టెస్టుకు జట్టు నుంచి బుమ్రాను విడుదలజేశాం' అని బీసీసీఐ ఆ ప్రకటనలో తెలిపింది. సిరీస్‌లో ఒకటి, మూడవ టెస్టులలో బుమ్రా ఐదేసి వికెట్లు తీశాడు. మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులకుపైగా సమర్పించుకున్నాడు. కెరీర్‌లో బుమ్రా ఇంత భారీగా పరుగులు ఇవ్వడం అదే మొదటిసారి కావడం గమనార్హం.

ఆసియా కప్‌లో ఆడేనా?: భారత్ ఆడే తర్వాతి సిరీస్ ఆసియా కప్. ఈ టోర్నీ సెప్టెంబరు 9 నుంచి దుబాయ్‌లో జరగనుంది. అయితే ఆసియా కప్ ముగిసిన వారానికే వెస్టిండీస్‌తో భారత్ టెస్ట్ సిరీస్ ఆడాలి. దాంతో ఆసియా కప్ నుంచి బుమ్రా వైదొలిగినా ఆశ్చర్యం లేదంటున్నారు.

జాతీయ ఫుట్‌బాల్ కోచ్ జమీల్

చాన్నాళ్ల తర్వాత ఓ భారతీయుడి నియామకం



న్యూఢిల్లీ: సుదీర్ఘకాలం తర్వాత భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రధాన కోచ్‌గా మన దేశానికే చెందిన వ్యక్తి నియమితుడయ్యాడు. 48 ఏళ్ల ఖాలిద్ జమీల్‌ను కోచ్‌గా ఎంపిక చేసినట్టు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) శుక్రవారం వెల్లడించింది. స్టీఫెన్ కాన్‌స్టాంటిన్ (ఇంగ్లండ్), స్టెపాన్ తర్కోవిచ్ (స్లొవేకియా)లను వెనక్కినెట్టి జమీల్ ఈ పదవి దక్కించుకున్నాడు. స్పెయిన్‌కు చెందిన మార్క్వెజ్ రాజీనామా చేయడంతో ఫుట్‌బాల్ కోచ్ పదవి ఖాళీ అయ్యింది. కువైట్‌లో జన్మించిన జమీల్ గల్ఫ్ యుద్ధం (1990-91) సమయంలో కుటుంబంతో ముంబై వచ్చి స్థిరపడ్డాడు. దిగ్గజ ఫుట్‌బాలర్ బైచుంగ్ భూటియా సమకాలికుడైన జమీల్ 1997లో బంగ్లాదేశ్‌పై శాఫ్ కప్ మ్యాచ్ ద్వారా జాతీయ జట్టుకు అరంగేట్రం చేశాడు.

పేసర్ వోక్స్ అవుట్



లండన్: భారత్‌తో జరుగుతున్న ఐదో టెస్టుకు ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ గాయంతో దూరమయ్యాడు. తొలి రోజు లాంగ్ ఆఫ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న వోక్స్.. కరుణ్ నాయర్ కొట్టిన బంతిని ఆపే ప్రయత్నంలో డైవ్ చేశాడు. అయితే ఈ క్రమంలో తన శరీర బరువంతా ఎడమ భుజంపై పడడంతో గాయమైంది. స్కానింగ్‌లో భుజం ఎముక స్థానభ్రంశం అయినట్టు తేలింది. దీంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కూ దూరమయ్యాడు. బౌలింగ్‌లోనూ జట్టుకు టంగ్, ఓవర్టన్, అట్కిన్సన్‌లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పసిడి పోరుకు భారత రెజ్లర్

అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్

ఏథెన్స్ (గ్రీస్): భారత యువ రెజ్లర్ ల్యాకీ అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరాడు. 110 కిలోల విభాగం సెమీఫైనల్లో ల్యాకీ 15-7తో అమీర్‌హుస్సేన్ (ఇరాన్)ను చిత్తుచేసి పసిడి పోరులో ప్రవేశించాడు.

3 రోజుల్లోనే ముగించారు

తొలి టెస్టులో జింబాబ్వేపై కివీస్ ఘన విజయం

బులవాయో: జింబాబ్వేతో తొలి టెస్టును మూడు రోజుల్లోనే ముగించేసిన న్యూజిలాండ్ 9 వికెట్లతో ఘన విజయం అందుకుంది. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. 8 పరుగుల లక్ష్యాన్ని కివీస్ ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 31/2తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 165 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 149, కివీస్ 307 పరుగులు చేశాయి.

ఇక.. బ్యాటర్లదే భారం

భారత్ రెండో ఇన్నింగ్స్ 75/2
ప్రస్తుత ఆధిక్యం 52
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 247
ప్రసిద్ధ్, సిరాజ్‌లకు నాలుగేసి వికెట్లు


జైస్వాల్ (51 బ్యాటింగ్)


సిరాజ్ (4/86)కు గిల్ అభినందన

లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఆఖరి టెస్టు సైతం రసవత్తరంగా సాగుతోంది. బౌలర్లు హవా చూపిన రెండో రోజు ఆటలో ఏకంగా 15 వికెట్లు నేలకూలడం విశేషం. మరోవైపు ఇంగ్లండ్ బాజ్‌బాల్ ఆటకు భారత పేసర్లు ప్రసిద్ధ్ క్రిష్ణ (4/62), సిరాజ్ (4/86) ముకుతాడు వేయగా.. వారికి దక్కిన ఆధిక్యం కేవలం 23 పరుగులు మాత్రమే. ఇక చివరి సెషన్‌లో భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా, ఓపెనర్ యశస్వి జైస్వాల్ (51 బ్యాటింగ్) ఎదురుదాడికి దిగాడు. దీంతో శుక్రవారం వెలుతురులేమితో ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 75/2 స్కోరుతో నిలిచింది. ప్రస్తుతం 52 పరుగుల ఆధిక్యంలో ఉన్న భారత్‌కు మూడో రోజు ఆట అత్యంత కీలకం కానుంది. తొలి సెషన్‌లో ఇంగ్లండ్ పేసర్లను దీటుగా ఎదుర్కోవడంపైనే భారీ ఆధిక్యం ఆధారపడి ఉంటుంది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేయగా కరుణ్ నాయర్ (57), సుందర్ (26) రాణించారు. అట్కిన్సన్‌కు 5, టంగ్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేసింది. క్రాలే (64), బ్రూక్ (53), డకెట్ (43) ఆకట్టుకున్నారు.

ఓపెనర్ల దంచుడు: భారత బ్యాటర్లు తడబడిన చోట ఇంగ్లండ్ ఓపెనర్లు క్రాలే, డకెట్ బ్యాట్లు ఝళిపించారు. ప్రతీ బౌలర్‌ను బాదేస్తూ ఈ సెషన్‌లో ఆడిన 16 ఓవర్లలోనే 109 పరుగులు సాధించారు. ఈ జోడీ ధాటికి పేసర్లు ఆకాశ్, సిరాజ్, ప్రసిద్ధ్ బౌండరీల రూపంలో ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. ముఖ్యంగా డకెట్ టీ20 శైలిలో చెలరేగడంతో తొలి ఏడు ఓవర్లలోనే జట్టు 51 పరుగులతో నిలిచింది. చివరికి ఆకాశ్ ఓవర్‌లో రివర్స్ స్కూప్‌నకు యత్నించి కీపర్ జురెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ అప్పటికే తొలి వికెట్‌కు 77 బంతుల్లోనే 92 పరుగులు జత చేరాయి. ఆ తర్వాత లంచ్‌కు ముందు క్రాలే ఓ ఫోర్‌తో 42 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు.

వికెట్ల వేట: రెండో సెషన్‌లో భారత పేసర్లు ఒక్కసారిగా జూలు విదిల్చారు. ముఖ్యంగా సిరాజ్, ప్రసిద్ధ్ చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేసి ఆరు వికెట్లను పడగొట్టారు. జోరుమీదున్న క్రాలేను ఆరంభంలోనే ప్రసిద్ధ్ దెబ్బతీశాడు. అనంతరం పోప్‌నకు రూట్ జత కలవడంతో ఇక బౌలర్లకు కష్టాలు తప్పవనిపించింది. కానీ కెప్టెన్ గిల్ బంతిని సిరాజ్‌కు ఇవ్వగా తను ఏకబిగిన ఏడు ఓవర్లపాటు బౌలింగ్ చేసి వికెట్ల వేట సాగించాడు. కట్టుదిట్టమైన బంతులతో ఇంగ్లండ్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఈక్రమంలో ముందుగా అతడు పోప్ (22), రూట్ (29), బెథెల్ (6)లను ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ 43వ ఓవర్‌లో స్మిత్ (8), ఓవర్టన్ (0)లను అవుట్ చేశాడు. ఈ దెబ్బకు టీ బ్రేక్ సమయానికి ఇంగ్లండ్ 215/7 స్కోరుతో ఉంది. చివరి సెషన్‌లో అట్కిన్సన్ (11)ను ప్రసిద్ధ్ అవుట్ చేశాక వర్షంతో ఆట దాదాపు గంటపాటు ఆగింది. కాసేపటికే బ్రూక్‌ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ 23 రన్స్ ఆధిక్యంతో ఇన్నింగ్స్ ముగిసింది. గాయం కారణంగా వోక్స్ బ్యాటింగ్ చేయలేదు.

జైస్వాల్ దూకుడు: ప్రత్యర్థికి స్వల్ప ఆధిక్యమే దక్కేలా చేసిన జోష్‌లో భారత్ రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగింది. ఓపెనర్ జైస్వాల్ ఆది నుంచే వేగం చూపాడు. అటు డిఫెన్స్‌కు పరిమితమైన రాహుల్ (7)ను పదో ఓవర్‌లో టంగ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అతడి ఓవర్‌లోనే జైస్వాల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను డీప్ ఫైన్ లెగ్‌లో డాసన్ వదిలేశాడు. అయితే సుదర్శన్ (11)కు కూడా ఓసారి లైఫ్ లభించినా అట్కిన్సన్‌కు దొరికిపోయాడు. కాసేపటికి సరైన వెలుతురు లేకపోవడంతో 15 నిమిషాల ముందుగానే ఆటను ఆపేశారు.

స్కోరుబోర్డు


అట్కిన్సన్ (5/33)

భారత్

తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) అట్కిన్సన్ 2, రాహుల్ (బి) వోక్స్ 14, సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38, గిల్ (రనౌట్) 21, నాయర్ (ఎల్బీ) టంగ్ 57, జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9, జురెల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19, సుందర్ (సి) ఓవర్టన్ (బి) అట్కిన్సన్ 26, ఆకాశ్‌దీప్ (నాటౌట్) 0, సిరాజ్ (బి) అట్కిన్సన్ 0, ప్రసిద్ధ్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 0, **ఎక్స్‌ట్రాలు: 38; మొత్తం: 69.4 ఓవర్లలో 224 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-10, 2-38, 3-83, 4-101, 5-123, 6-153, 7-218, 8-220, 9-224, 10-224; **బౌలింగ్:** వోక్స్ 14-1-46-1, అట్కిన్సన్ 21.4-8-33-5, టంగ్ 16-4-57-3, ఓవర్టన్ 16-0-66-0, బెథెల్ 2-1-4-0.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) జడేజా (బి) ప్రసిద్ధ్ 64, డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ 43, పోప్ (ఎల్బీ) సిరాజ్ 22, రూట్ (ఎల్బీ) సిరాజ్ 29, బ్రూక్ (బి) సిరాజ్ 53, బెథెల్ (ఎల్బీ) 6, స్మిత్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 8, ఓవర్టన్ (ఎల్బీ) ప్రసిద్ధ్ 0, అట్కిన్సన్ (సి) ఆకాశ్ (బి) ప్రసిద్ధ్ 11, టంగ్ (నాటౌట్) 0, వోక్స్ (ఆబ్సెంట్ హర్ట్), **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 51.2 ఓవర్లలో 247; వికెట్ల పతనం:** 1-92, 2-129, 3-142, 4-175, 5-195, 6-215, 7-215, 8-235, 9-247; **బౌలింగ్:** సిరాజ్ 16.2-1-86-4, ఆకాశ్ 17-0-80-1, ప్రసిద్ధ్ 16-1-62-4, జడేజా 2-0-11-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 51, రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7, సుదర్శన్ (ఎల్బీ) అట్కిన్సన్ 11, ఆకాశ్‌దీప్ (బ్యాటింగ్) 4, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 18 ఓవర్లలో 75/2; వికెట్ల పతనం:** 1-46, 2-70; **బౌలింగ్:** అట్కిన్సన్ 6-2-26-1, టంగ్ 7-1-25-1, ఓవర్టన్ 5-1-22-0.

1 టెస్టుల్లో భారత్‌పై ఎక్కువ (8) 50+ భాగస్వామ్యాలు నమోదు చేసిన ఓపెనింగ్ జోడీగా క్రాలే-డకెట్. గ్రీనిడ్జ్-హేన్స్ (విండీస్)తో సమంగా నిలిచారు.

2 స్వదేశంలో జరిగిన టెస్టుల్లో ఎక్కువ పరుగులు (ఇంగ్లండ్‌లో 7220) సాధించిన రెండో బ్యాటర్‌గా రూట్. పాంటింగ్ (ఆసీస్‌లో 7578) ముందున్నాడు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

గతనెలలో 67% పెరిగిన రిఫండ్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలైలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వృద్ధితో రూ.1.96 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది జూలైలో జీఎస్‌టీ స్థూల ఆదాయం రూ.1.82 లక్షల కోట్లుగా నమోదు కాగా.. ఈ జూన్‌లో వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో దేశీయంగా జీఎస్‌టీ ఆదాయం 6.7% వృద్ధితో రూ.1.43 కోట్లకు చేరగా.. దిగుమతులపై పన్ను వసూళ్లు 9.5% పెరిగి రూ.52,712 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, గత నెలలో రిఫండ్లు 66.8% పెరిగి రూ.27,147 కోట్లకు చేరాయి. రిఫండ్లను మినహాయించగా, గత నెలకు జీఎస్‌టీ నికర వసూళ్లు 1.7% వృద్ధితో రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ప్రతికూలతలు, తాత్కాలిక మందగమనం నేపథ్యంలోనూ దేశీయంగా వినియోగంతో పాటు ఆర్థిక వృద్ధి స్థిరంగానే ఉందని తాజా జీఎస్‌టీ గణాంకాలు సూచిస్తున్నాయని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు. అలాగే, సకాలంలో పన్ను రిఫండ్లు వ్యాపారులకు నిర్వహణ మూలధనం కొరత రాకుండా తోడ్పడగలవని ఆయన తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో..

గత నెల తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10% వృద్ధితో రూ.5,417 కోట్లకు పెరిగింది. గత ఏడాది జూలైలో ఇది రూ.4,940 కోట్లుగా ఉంది. ఈ జూలైలో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌టీ రెవెన్యూ 14% పెరిగి రూ.3,803 కోట్లకు పెరిగింది. 2024 జూలైలో వసూళ్లు రూ.3,346 కోట్లుగా నమోదయ్యాయి.

బిజినెస్

మార్కెట్లకు ట్రం‘పోటు’!

సెన్సెక్స్ 586 పాయింట్లు డౌన్

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: ట్రంప్ సుంకాల పోటుతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ భారీగా నష్టపోయాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 690 పాయింట్లు పతనమై 80,500 దిగువ స్థాయికి జారుకుంది. చివర్లో కాస్త కోలుకున్న సూచీ 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయి 24,565.35 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.5 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి రూ.444.52 లక్షల కోట్లకు జారుకుంది. గురువారం ట్రేడింగ్‌లోనూ సెన్సెక్స్ 296 పాయింట్లు, నిఫ్టీ 86 పాయింట్లకు పైగా కోల్పోయాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. సన్‌ఫార్మా 4.49% క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 47 పైసలు పెరిగి రూ.87.18 వద్ద ముగిసింది.

ఐదు వారాలుగా నెగిటివ్ జోన్‌లోనే..

ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 863.18 పాయింట్లు (1.05 శాతం), నిఫ్టీ 271.65 పాయింట్లు (1.09 శాతం) నష్టపోయాయి. నిఫ్టీ గడిచిన ఐదు వారాలుగా నష్టాల్లో కొనసాగుతోంది. సూచీ ఇన్ని వారాలుగా నష్టాల్లో కొనసాగడం 2023 ఆగస్టు తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి.

సూచీల పతనానికి కారణాలివి..

భారత్‌పై 25 శాతం సహా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ పరిణామం తమ ఎగుమతి వాణిజ్యంపై ప్రభావం చూపనుందన్న ఆందోళనలతో గ్లోబల్ మార్కెట్లతో పాటు దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లూ పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు అధిక ఒత్తిడికి లోనయ్యాయి. మన మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, అంతర్జాతీయంగా డాలర్ బలోపేతం, కంపెనీల జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేకపోవడం, టెక్నికల్ చార్టుల్లో సూచీలు కీలక మద్దతు స్థాయిలను కోల్పోవడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు 41 రెట్ల స్పందన

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) రూ.4,011 కోట్ల ఐపీఓకు భారీ స్పందన లభించింది. శుక్రవారంతో ముగిసిన ఈ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 41.01 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. క్యూఐబీలకు కేటాయించిన వాటా షేర్లకు ఏకంగా 103.97 రెట్ల బిడ్లు రాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల వాటా షేర్లకు 34.98 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 7.73 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఎస్‌డీఎల్.. ఈ నెల 6న షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుంది.

ఎజిలెంట్, టీఐఎఫ్ఆర్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అంతర్జాతీయ అనలిటికల్, క్లినికల్ లేబొరేటరీ టెక్నాలజీ సంస్థ ఎజిలెంట్ టెక్నాలజీస్.. హైదరాబాద్‌లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)తో జట్టు కట్టింది. ఇందులో భాగంగా ఆర్మడా (అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ యూనిట్ ఆన్ మెటబాలిజం, డెవలప్‌మెంట్, ఏజింగ్)కు సంబంధించి ఇరు సంస్థలు పరిశోధనలు చేపట్టనున్నాయి. ఇందు కోసం హైదరాబాద్‌లో ఎజిలెంట్-టీఐఎఫ్ఆర్ సెంటర్ ఫర్ ట్రాన్సిషనల్ రీసెర్చ్‌ను ఏర్పాటు చేయనున్నాయి. దేశంలో పెరుగుతున్న పోషకాహార లోపం, అసంక్రమిత వ్యాధులను కట్టడి చేయటంలో ఈ సెంటర్ కీలకంగా ఉండనుంది.

బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్!

రూపాయికే నెల రోజుల 4జీ ప్లాన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఫ్రీడమ్ ప్లాన్ పేరుతో కేవలం రూపాయికే నెల రోజుల గడువుతో కూడిన 4జీ సేవల ప్లాన్‌ను శుక్రవారం ప్రవేశపెట్టింది. ఈ ఆఫర్ పరిమితకాలం పాటే అందుబాటులో ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా తన 4జీ సేవలను ఈ మధ్యనే అందుబాటులోకి తీసుకువచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా సంస్థ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ సేవలను రూపాయికే నెల రోజులపాటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. బీఎస్ఎన్ఎల్ పోటీదారులైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఇదే తరహా ప్రీ-పెయిడ్ ప్లాన్‌ను నెలకు రూ.349-399 స్థాయిలో అందిస్తున్నాయి.

ఫ్రీడమ్ ప్లాన్ వివరాలు

- అపరిమిత వాయిస్ కాల్స్ (లోకల్/ఎస్‌టీడీ)
- రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటా
- రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు
- ఉచిత బీఎస్ఎన్ఎల్ సిమ్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	475
వరంగల్	432	గోదావరి	465
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	99
వరంగల్	95	గుంటూరు	104
కరీంనగర్	95	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	92
కర్నూలు	95	నెల్లూరు	97
విశాఖపట్నం	92	అనంతపురం	97
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,820 ▼	91,500 ▼	1,23,000 ▼
విజయవాడ	1,01,300 ▼	95,500 ▼	1,13,000 ▼
విశాఖపట్నం	1,01,830 ▲	91,500 ▼	1,23,000 ▼
రాజమండ్రి	99,820 ▼	91,500 ▼	1,13,200 ▼
ప్రొద్దుటూరు	99,250 ▼	91,310 ▼	1,13,200 ▼
ముంబై	98,253 ▼	90,000 ▼	1,09,646 ▼

హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఇన్‌చార్జి సీఎండీగా గిరిదీప్ సింగ్



మల్కాపురం, విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఇన్‌చార్జి సీఎండీగా గిరిదీప్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు హెచ్ఎస్ఎల్ సీఎండీగా ఉన్న హేమంత్ ఖత్రీ పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో సింగ్ ఈ బాధ్యతలను చేపట్టారు. ప్రస్తుతం సింగ్ షిప్‌యార్డ్ స్ట్రాటజిక్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. పుణె నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన గిరిదీప్‌సింగ్ షిప్‌యార్డులో చేరడానికి ముందు భారత నౌకాదళంలో 35 ఏళ్ల పాటు సేవలందించారు. ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకల ఇంజనీరింగ్ ఆఫీసర్ (ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ గోదావరి, ఐఎన్ఎస్ బెట్వా)గా పనిచేశారు. యుద్ధనౌకల మరమ్మతుల ప్రాజెక్టు నిర్వహణ, వ్యూహాత్మక జలాంతర్గామి నిర్మాణ ప్రాజెక్టు ప్రణాళిక, ఉత్పత్తి కార్యకలాపాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది.

వేగం తగ్గిన వాహనం

జూలైలో నెమ్మదించిన విక్రయాలు

న్యూఢిల్లీ: జూలై నెలలో ప్యాసింజర్ వాహన టోకు విక్రయాలు మందగించాయి. దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీ ఇండియా విక్రయాల్లో వార్షిక ప్రాతిపదికన స్వల్ప పెరుగుదల నమోదు కాగా.. టాటా మోటార్స్, హ్యుండయ్ మోటార్ అమ్మకాలు మాత్రం తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, కియా ఇండియా సేల్స్ మాత్రం వరుసగా రెండంకెల, ఏక అంకె వృద్ధిని నమోదు చేయగలిగాయి. గత ఏడాది జూలైలో మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు 1,37,463 యూనిట్లుగా ఉండగా.. ఈ ఏడాది జూలైలో అమ్మకాలు 1,37,776 యూనిట్లకు పెరిగాయి. ఈ జూలైలో హ్యుండయ్ మోటార్ సేల్స్ 10% తగ్గి 43,973 యూనిట్లకు జారుకోగా.. టాటా మోటార్స్ మొత్తం అమ్మకాలు 12% క్షీణించి 39,521 యూనిట్లకు పడిపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ విక్రయాలు 20 శాతం వృద్ధితో 49,871 యూనిట్లకు పెరిగాయి. కంపెనీ యుటిలిటీ వాహనాలకు మార్కెట్లో అధిక డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడింది. కియా ఇండియా మొత్తం అమ్మకాలు 8 శాతం పెరిగి 22,135 యూనిట్లకు చేరుకోగా, టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాలు 3 శాతం పెరుగుదలతో 32,575 యూనిట్లకు, హోండా కార్ల మొత్తం విక్రయాలు 3% వృద్ధితో 7,524 యూనిట్లుగా నమోదయ్యాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ అమ్మకాలు మాత్రం ఏకంగా 46% పెరిగి 6,678 యూనిట్లకు చేరాయి.

టూవీలర్ ఓకే..

ద్విచక్ర వాహన విభాగంలో చాలా కంపెనీల అమ్మకాలు ఆశాజనకంగానే ఉన్నాయి. గత నెలలో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) దేశీయ విక్రయాలు 4,66,331 యూనిట్లుగా నమోదుకాగా.. హీరో మోటోకార్ప్ సేల్స్ 4,12,397 యూనిట్లకు ఎగబాకాయి. టీవీఎస్ మోటార్ దేశీయ విక్రయాలు 21% వృద్ధితో 3,08,720 యూనిట్లకు చేరగా.. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 25 శాతం పెరిగి 76,254 యూనిట్లుగా నమోదయ్యాయి. దేశీయంగా బజాజ్ ఆటో టూవీలర్ సేల్స్ 18 శాతం తగ్గి 1,39,279 యూనిట్లకు పడిపోగా.. సుజుకీ మోటార్‌సైకిల్ అమ్మకాలు 96,029 యూనిట్లకు పరిమితమయ్యాయి.

రూ.44 కోట్లతో హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ

ఏకేఎస్ఐ ఏరోస్పేస్

ముంబై: అంతర్జాతీయ డ్రోన్ తయారీదారు ఫిక్సర్ నుంచి రూ.85 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ఏకేఎస్ఐ ఏరోస్పేస్ గ్రూప్ వెల్లడించింది. కంపెనీ హైదరాబాద్‌లోని ప్లాంట్‌లో డ్రోన్ డిజైన్, డ్రోన్ సబ్‌సిస్టమ్స్ తయారీ సహా ఆటోపైలెట్స్, లిథియం బ్యాటరీలు, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (బీఎంఎస్), నావిగేషన్ యూనిట్స్, కాంపోజిట్ ఎయిర్‌ఫ్రేమ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది. కాగా వచ్చే రెండేళ్లలో రూ.44 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ, అప్‌గ్రేడేషన్ చేపట్టనున్నట్లు ఏకేఎస్ఐ ఏరోస్పేస్ ఎండీ పంకజ్ ఆకుల చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కంపెనీ దేశీయంగా తయారు చేసిన డ్రోన్ కాంపోనెంట్స్‌కు మంచి గుర్తింపు లభించిందన్నారు. కంపెనీ తయారు చేసిన డ్రోన్స్‌ను భారత సైనిక దళాలు పూర్తి స్థాయిలో వినియోగించుకున్నాయని ఆయన వివరించారు. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కంపెనీ టర్నోవర్ రూ.35 కోట్ల నుంచి రూ.70 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పంకజ్ చెప్పారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 2-8-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**


త్వరలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ!


పలువురు మంత్రులకు ఉద్వాసన?.. కూర్పుపై ఆరెస్సెస్ ప్రభావం

ఆగస్టు 15 తర్వాత బీజేపీ అధ్యక్షుడి ఎంపిక

దక్షిణాది నుంచి బీసీకి ఉపరాష్ట్రపతి పదవి లభించే అవకాశం?

10





బ్రో.. ఏడు అవార్డులు

71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తెలుగు సినిమా మెరుపులు

ఉత్తమ తెలుగు చిత్రంగా 'భగవంత్ కేసరి'

ఉత్తమ గేయ రచయిత కాసర్ల శ్యామ్.. 'ఊరూ.. పల్లెటూరు' పాట

ఉత్తమ బాలనటిగా 'గాంధీ తాత చెట్టు' నటి సుకృతి వేణి

హను-మాన్, బేబీ సినిమాలకు వేర్వేరు విభాగాల్లో రెండేసి అవార్డులు

జాతీయ ఉత్తమ చిత్రం ట్వల్త్ ఫెయిల్

ఉత్తమ నటులు షారుక్‌ఖాన్, విక్రాంత్.. ఉత్తమ నటి రాణీ ముఖర్జీ




కాసర్ల శ్యామ్



రోహిత్

తెలుగు చలన చిత్ర సీమ మరోసారి తెలుగు వారంతా గర్వపడేలా చేసింది. సినీ ప్రపంచంలో తెలుగోడి సత్తాను చాటి చెబుతూ 71వ జాతీయ సినిమా అవార్డుల్లో ఏడు పురస్కారాలతో అదరగొట్టింది. 2023 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం జాతీయ అవార్డులు ప్రకటించింది. ఇందులో 'ఊరూ.. పల్లెటూరు..' అంటూ తెలంగాణ గ్రామీణ సంస్కృతిని వివరిస్తూ 'బలగం' సినిమా కోసం పాట రాసిన కాసర్ల శ్యామ్‌ను ఉత్తమ గేయ రచయిత అవార్డు వరించింది. అలాగే, ఉత్తమ తెలుగు చిత్రంగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'భగవంత్ కేసరి' అవార్డు దక్కించుకోగా, హనుమాన్ సినిమా ఉత్తమ యానిమేషన్- విజువల్ ఎఫెక్ట్స్ ఫైట్స్ కొరియోగ్రఫీ విభాగాల్లో రెండు అవార్డులు సాధించింది. 'బేబీ' చిత్రం.. ఉత్తమ స్క్రీన్ ప్లే (సాయి రాజేశ్), ఉత్తమ గాయకుడి (పీవీఎన్ఎస్ రోహిత్) విభాగాల్లో రెండు పురస్కారాలు సాధించగా, 'గాంధీతాత చెట్టు' చిత్రంలో నటించిన దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ఉత్తమ బాలనటి పురస్కారానికి ఎంపికయ్యారు. ఇక, 2023కి గాను 'ట్వల్త్ ఫెయిల్' జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు దక్కించుకోగా.. షారుక్ ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సె(ట్వల్త్ ఫెయిల్) సంయుక్తంగా ఉత్తమ కథానాయకుడి అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే, మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే చిత్రానికి గాను రాణీ ముఖర్జీకి ఉత్తమ నటి అవార్డు దక్కింది.


8



షారుక్‌ఖాన్



రాణీ ముఖర్జీ



విక్రాంత్ మస్సె

జగన్‌కు తెలిసింది విధ్వంసమే



కడప జిల్లాలో గండికోట పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ఐదేళ్లూ ఆయన చేసింది ఇదే

పడగొట్టడం తేలిక.. నిలబెట్టడమే కష్టం

నేను సంపద సృష్టిస్తా.. పేదలకు పంచుతా

2014-19లో సీమ ఇరిగేషన్‌పై 12 వేల కోట్ల ఖర్చు

2019-24లో జగన్ చేసిన ఖర్చు కేవలం 2 వేల కోట్లు

మేం చెప్పినట్లే సీమకు స్టీల్ ప్లాంట్.. తల్లికి వందనం..

7 నుంచి చేనేతకు ఉచిత విద్యుత్.. 15 నుంచి ఉచిత బస్

బంగారు కుటుంబాలు ప్రపంచానికి రోల్‌మోడల్: సీఎం

జమ్మలమడుగులో 'ప్రజావేదిక'.. పింఛన్ల పంపిణీ

గండికోట పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన

రూ.500 కోట్ల మేర ఒప్పందాలు

డిసెంబరు 26, 27 తేదీల్లో ఉత్సవాలు

కడప, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 64 లక్షలమందికి ఏటా రూ.33 వేల కోట్ల విలువైన పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీ మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేరుగా ఇంటికి వెళ్లి నిద్రలేపి పింఛన్ అందిస్తున్నామని, రూ.2,751 కోట్లు లబ్ధిదారుల చేతికి ఇస్తున్నామని తెలిపారు. జగన్ హయాంలో సాగిన విధ్వంసం, పింఛన్లలో గందరగోళం మొదలు, తాజాగా నెల్లూరు పర్యటనలో రెచ్చగొట్టే ప్రసంగాలపై చంద్రబాబు విరుచుకుపడ్డారు. శుక్రవారం కడప జిల్లా జమ్మలమడుగు మండలం గూడెంచెరువులో జరిగిన 'పేదల సేవలో ప్రజావేదిక' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. లబ్ధిదారులకు గ్రామంలో పింఛన్లు స్వయంగా అందించారు. సంపద సృష్టిస్తాం.. పేదలకు పంచుతాం అని ఈ సందర్భంగా చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఈ రోజు బంగారు కుటుంబం

మిగతా 11వ పేజీలో...

ప్రతి రైతు కుటుంబానికీ 20 వేలు

కనీసం 10 సెంట్లు.. గరిష్ఠ భూ పరిమితి లేదు

సొంత భూమి లేని కౌలు రైతులకూ వర్తింపు

'అన్నదాత'-పీఎం కిసాన్ మార్గదర్శకాలు జారీ

రైతు సంక్షేమమే టీడీపీ ఎజెండా

అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం: సీఎం

ప్రతి రైతు కళ్లలో ఆనందమే లక్ష్యం

ఇదే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం

నేడు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ

తొలి విడతగా రూ.7 వేలు ఇస్తున్నాం

ఇందులో కేంద్రం వాటా రూ.2 వేలు 7

46.85 లక్షల మంది రైతులకు లబ్ధి

వైసీపీ 7,500 ఇస్తే మనం 20 వేలిస్తున్నాం

చేస్తున్న మంచిని జనంలోకి తీసుకెళ్లండి

టెలికాన్ఫరెన్స్‌లో శ్రేణులకు బాబు పిలుపు



ఆయన రాష్ట్రానికి చెందిన బడా పారిశ్రామికవేత్త! వందలకోట్ల ఆస్తిపరుడు! ఒకసారి ఎమ్మెల్యేగా పని చేశారు. మరోసారి ఎంపీ అయ్యారు. ప్రస్తుతం 'మాజీ' మాత్రమే! కానీ... ఆయనకు మాజీ ఎమ్మెల్యేగా ఒక పింఛను, మాజీ ఎంపీ హోదాలో మరో పింఛనూ ఇస్తున్నారు. ఈ 'డబుల్ ధమాకా' ఎందుకు?

ఒకప్పుడు అత్యంత సాధారణ జీవితం గడుపుతూ, ఆర్టీసీ బస్సుల్లోనే తిరిగే నేతలు ఎమ్మెల్యేలయ్యే వారు. ఇప్పుడు... ఎన్నికల్లో రూ.30 కోట్ల ఖర్చుకూ వెనుకాడకుండా ఎమ్మెల్యేలు అవుతున్న వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. మాజీలు అయ్యాక రూ.30వేల పింఛను తీసుకుంటేగానీ వీరికి రోజు గడవదా?

... ఇవి సామాన్యులు సంధిస్తున్న ప్రశ్నలు!

వీళ్లకేం తక్కువని!?

అనేకమంది నేతలకు డబుల్ పెన్షన్లు

ఒకే నేత ఎమ్మెల్యే, ఎంపీగా చేసి మాజీ అయితే

జీవితాంతం రెండేసి పెన్షన్‌లు

విడివిడిగా ఇస్తున్న కేంద్ర, రాష్ట్రాలు

ఒక్కరోజు ఎమ్మెల్యేగా చేసి మాజీ అయినా పెన్షన్

పదవిలో ఉండగా లక్షల్లో జీత భత్యాలు

ఉద్యోగులకు లేని వెసులుబాటు వీరికెందుకు?

మాజీల పింఛన్ పద్ధతిపై జనంలో చర్చ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక వ్యక్తి తన ఉద్యోగ జీవితంలో ఎన్ని హోదాల్లో పనిచేసినా... రిటైరైన తర్వాత ఒకటే పెన్షన్!

ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాతే పెన్షన్ వస్తుంది. అయితే... నిర్దిష్ట సర్వీసు పూర్తి చేసుకోకుండా రాజీనామా చేస్తే పూర్తి పెన్షన్ రాదు. అందులో కోత పడుతుంది!

సామాజిక పింఛను దగ్గరికే వద్దాం! దంపతులిద్దరూ వృద్ధులే అయినా... వారిలో ఒకరికి మాత్రమే వృద్ధాప్య పింఛను వస్తుంది!

అలాగే ఇవ్వాలని ప్రజాప్రతినిధులు చట్టాలు చేశారు! కానీ... ఘనత వహించిన మన నేతల విషయంలో ఏం జరుగుతోందో తెలుసా?

ఒకేఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి... ఏదైనా కారణాలవల్ల నెలకో, రెండు నెలలకో 'మాజీ' అయినా జీవితాంతం పింఛను పొందవచ్చు. అదే నేత... ఎంపీగా గెలిస్తే, మాజీ అయిన తర్వాత ఆ హోదాలో మరో పింఛను ఇస్తారు. మాజీ ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు పింఛను ఇస్తే...

మిగతా 10వ పేజీలో...

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్

నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర 12

జీతం 15 వేలు.. ఆస్తి వంద కోట్లు!

కర్ణాటకలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి భారీ అవినీతి

లోకాయుక్త దాడులతో వెలుగులోకి 9

24 ఇళ్లు, 40 ఎకరాల భూమి, 5 ఇంటి స్థలాలు, కార్లు, బంగారం గుర్తింపు

బెట్టింగ్ యాప్‌ల విషయంలో కేంద్రంపై సుప్రీం సీరియస్

కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం

మరోసారి కేంద్రంతోపాటు రాష్ట్రాలు, యాప్‌ల నిర్వహణ సంస్థలకు నోటీసులు 9

ట్రంప్ సుంకాలు.. అమెరికా కుటుంబాలపై ఆర్థిక భారం!

9

సగటు వ్యయం 2,400 డాలర్లు పెరిగే అవకాశం

భారత్ కంటే అమెరికాపైనే ఎక్కువ ప్రభావం

ధరల సెగ.. జీడీపీ తగ్గుదల: ఎస్‌బీఐ నివేదిక

'షక్సగాం'లో చైనా చొరబాటు 9

పోలీసు ఉద్యోగాల్లో మహిళల సత్తా



6,100 పోస్టుల్లో 1,063 పోస్టులు కైవసం

సెప్టెంబరు నుంచి శిక్షణ, తర్వాత విధుల్లోకి

పోలీసు కానిస్టేబుల్ ఫలితాలు విడుదల


త్వరలో మరో నోటిఫికేషన్: మంత్రి అనిత

మాజీ సీఎం జగన్‌పై కేసు పెడతామని వెల్లడి

మమ్మల్ని రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు: డీజీపీ

అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుదీర్ఘ ప్రక్రియ అనంతరం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల తుది ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో మహిళా అభ్యర్థులు సత్తా చాటారు. మొత్తం 6,100 పోస్టుల్లో 1,063 ఉద్యోగాలను మహిళలు కైవసం చేసుకున్నారు. మంగళగిరిలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం కానిస్టేబుల్ పోస్టుల తుది ఫలితాలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క పోలీసు ఉద్యోగ నియామకం కూడా చేపట్టలేదన్నారు. 2022 చివర్లో నోటిఫికేషన్ ఇచ్చినా.. ప్రభుత్వం దిగిపోయే దాకా పోస్టులను భర్తీ చేయకుండా ఆపేసిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం వచ్చాక న్యాయపరమైన చిక్కులు అధిగమించి ఫలితాలు విడుదల చేశామని, అటు యువతకు ఉద్యోగాలు, ఇటు పోలీసు శాఖ బలోపేతం

మిగతా 10వ పేజీలో...



రహదారుల పనుల జోరు

రాష్ట్రంలో పలు కొత్త ప్రాజెక్టులు

185 కి.మీ. పరిధిలో నిర్మాణం

రూ.2,381 కోట్ల పనులకు 12

నేడు గడ్కరీ, సీఎం శంకుస్థాపన

జూలైలో జీఎస్టీ వసూళ్లు 2930 కోట్లు



గతేడాది జూలై కంటే 12.12% ఎక్కువ

2017 నుంచీ నెలవారీగా ఇదే అత్యధికం

ఎస్‌జీఎస్‌టీ, ఐజీఎస్టీలోనూ వృద్ధి 10

లిక్కర్ కంటే.. ఇసుక స్కామే పెద్దది!

నెలకు రూ.260 కోట్లు లాగేశారు.. వసూళ్ల డెన్ బెజవాడే

'బియాండ్ కాఫీ హౌస్' సుధీర్‌కు డబ్బులు కట్టేవారు

కేసుల్లేకుండా విజయసాయిరెడ్డి చూసుకునేవారు

సిట్ పిలిస్తే వాస్తవాలన్నీ చెబుతా: వసంత 11





ప్రభుత్వ పథకాలకు బతికున్న నేతల పేర్లు పెట్టొద్దు

ప్రభుత్వ ప్రకటనల్లో మాజీ సీఎంలు, పార్టీల నేతల ఫొటోలు వద్దు.. ఇది సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధం

సంక్షేమ స్కీముల అమలును మేం అడ్డుకోవడం లేదు

ప్రచారం తీరుపైనే అభ్యంతరం: మద్రాస్ హైకోర్టు

విచారణ ఈ నెల 13వ తేదీకి వాయిదా

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు బతికున్న రాజకీయ నేతల పేర్లు పెట్టకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టంచేసింది. అలాగే ప్రభుత్వ ప్రకటనల్లో మాజీ ముఖ్యమంత్రులు, పార్టీ సిద్ధాంతకర్తల పేర్లు, ఫొటోలు ఉండకూడదని స్పష్టం చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు షాక్ ఇచ్చింది. 'ఉంగళుడన్ స్టాలిన్ (మీతోనే స్టాలిన్)' అనే పథకంలో స్టాలిన్ పేరు, ఆ స్కీం ప్రకటనలో దివంగత మాజీ సీఎం కరుణానిధి ఫొటో వాడకుండా అడ్డుకోవాలని

మిగతా 9వ పేజీలో...

అనిల్ అంబానీపై లుక్‌అవుట్ నోటీసులు

రూ.3 వేల కోట్ల రుణం దారి మళ్లింపు కేసులో జారీ చేసిన ఈడీ

5న విచారణకు రావాలని ఇప్పటికే నోటీస్

దేశం విడిచి వెళ్లకుండా లుక్‌అవుట్



9

బీజేపీ కోసం ఈసీ ఓట్ల చోరీ

ఆటంబాంబు వంటి ఆధారం ఉంది

పేల్చితే దాక్కోవడానికి ఈసీకి చోటుండదు

ఇది విద్రోహ చర్య... బాధ్యులు రిటైరైనా కూడా వదిలిపెట్టబోం: రాహుల్‌గాంధీ



9

ప్రజ్వల్ రేవణ్ణ దోషి

అత్యాచార కేసులో నేరం రుజువు

తీర్పు వెలువరించిన బెంగళూరు కోర్టు

నేడు శిక్ష ఖరారు

తీర్పు విని కోర్టు హాల్లో ఏడ్చిన ప్రజ్వల్

జేడీఎస్ మాజీ ఎంపీపై నమోదైన నాలుగు అత్యాచార కేసుల్లో ఇదొకటి



9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చెడిన స్నేహం..!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు భారతప్రధాని నరేంద్రమోదీని మించిన స్నేహితుడు, ఆత్మీయుడు ఈ భూప్రపంచంమీద ఇంకెవ్వరూ లేరనీ, ఉండబోరనీ బీజేపీ నాయకులే కాదు, దేశప్రజల్లో అత్యధికులు కూడా ఎంతోకాలంగా నమ్ముతున్నారు. భౌగోళిక సరిహద్దులు, వాణిజ్యబంధాలు, అయుధలావాదేవీలను దాటిన మోదీ–ట్రంప్ ఆలింగనాల స్థాయి స్నేహం వల్ల దేశానికి ఎంతో ప్రయోజనం చేకూరిందనీ, భారత్ ఖండాంతరఖ్యాతికి ఈ సాన్నిహిత్యం పునాదిగా ఉపకరించిందన్న విశ్లేషణలనూ జనం విశ్వసించారు. హౌడీ మోడీ, అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ చరిత్రలో కనీవినీ ఎరుగనిరీతిలో వీరిద్దరూ పరస్పరం ఎన్నికల్లో సహకరించుకున్నారు. మిత్రుడి మనసు అంతగా ఎరిగిన మోదీ ఇప్పుడు ఆయనతో ఎందుకు సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారో అర్థంకావడం లేదు.

భారతదేశాన్ని దారికి తేవడానికీ, అన్ని అడ్డుగోడలూ కూలిన ఇక్కడి మార్కెట్లోకి అమెరికన్ ఉత్పత్తులను కుమ్మరించడానికీ ట్రంప్ పట్టుదలగా ప్రయత్నిస్తున్నారన్నది వాస్తవం. అన్ని దేశాలతోనూ సుంకాల యుద్ధం చేస్తున్న ట్రంప్ ఒత్తిడి వ్యూహాలనూ అర్థంచేసుకోవచ్చు. భారతదేశంతో వాణిజ్య వ్యవహారంలో కాఠిన్యం ఉండవచ్చును గానీ, మోదీ విషయంలో మాత్రం కాస్తంత ప్రేమ, కాసిన్ని మినహాయింపులూ ఉంటాయనుకోవడం భ్రమ అని ఇప్పుడు తేలిపోయింది. వీళ్ళిద్దరికీ ఎక్కడో చెడిందన్న అనుమానాలూ మొదలైనాయి. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ కోల్పోయిన మోదీని, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘనంగా గెలిచివచ్చిన గర్వంతోనే ట్రంప్ నిర్లక్ష్యం చేస్తున్నారని కొందరి అనుమానం.

ట్రంప్‌తో మోదీ అతివేగంగా కాల్పుల విరమణ ఒప్పందం, అంటే, వాణిజ్య ఒప్పందం చేసుకుంటే కొంతమేరకు శాంతింపచేయవచ్చునని విశ్లేషకుల సలహా. భారీ సుంకాలతో భారత్‌ను బాధించేప్రయత్నం చేస్తున్న ట్రంప్ ఆ మేరకు సంతృప్తిపడితే దాడి తగ్గవచ్చును. కానీ, 'డెడ్ ఎకానమీ' వంటి వ్యాఖ్యలు భారత్ పైన కాక, మోదీ ఏలుబడిమీద దాడి అని ఆయనకు తెలియకపోదు. భారతఆర్థికవ్యవస్థ రేపోమాపో మూడోస్థానానికి చేరుకోబోతున్నదని ఉధృత ప్రచారం జరుగుతున్నప్పుడు ఈ వ్యాఖ్య ప్రభావం చిన్నదేమీ కాదు. మోదీ యుద్ధాలు చేస్తున్న పొరుగుదేశంతోనే ట్రంప్ చమురు వెలికితీత ఒప్పందాలవంటివి చేసుకోవడం ద్వారా ప్రపంచానికి ఏ సందేశం వెడుతుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అమెరికా అధ్యక్షుడితో అత్యంత సాన్నిహిత్యం ఉన్న ఒక అంతర్జాతీయస్థాయి నాయకుడుగా నరేంద్రమోదీకి ఉన్న ఖ్యాతిని ట్రంప్ తన వరుసచర్యలతో, వ్యాఖ్యలతో బలహీనపరుస్తున్నారు. భారత్–పాక్ యుద్ధం తానే ఆపానని ముప్పైసార్లు ప్రకటించి, మోదీని నిత్యం ఆత్మరక్షణలోకి నెట్టేశారు ఆయన. యుద్ధం ఆపమని తనకు ఎవరూ చెప్పలేదని నిండుసభలో మోదీ ప్రకటించిన వెనువెంటనే ట్రంప్ మళ్ళీ అదే ప్రకటన చేసి ఇంటాబయటా ఇరకాటంలో పడేశారు. ఇక, పాక్ సైనికాధికారి మునీర్‌కు ఘనస్వాగతం, కడుపునిండా భోజనం, మోదీతో సమం చేస్తున్న ఆ ప్రశంసల జల్లుల ప్రభావం కాదనలేనిది. ట్రంప్ ఇక ఏమాత్రం మోదీపక్షాన లేరని, ఆయన పూర్తిగా పాక్‌తో అంటకాగుతున్నారని తేలిపోవడం వల్ల వచ్చే నష్టమేమీ లేదు. ఏకైక అగ్రరాజ్యానికి ఏ దేశం దగ్గరదో వేగంగా స్పష్టత రావడం మంచిదే. కానీ, ట్రంప్‌ను పూర్తిగా నమ్మి, తనతోపాటు దేశాన్ని కూడా అటుగా మోహరించిన మోదీ ఇప్పుడు నాలుగురోడ్ల కూడలిలో వదిలేశారన్న విమర్శలు తప్పవు. పరాధీనతనుంచి స్వతంత్రతకు మళ్ళడం, కనీసం అలా కనిపించడం అంత సులభమేమీ కాదు.

స్వార్థం, స్వలాభం తప్ప, రాజనీతిజ్ఞతలేని ట్రంప్ నమ్మదగ్గవ్యక్తి కాదన్నది సుస్పష్టం. అమెరికా అధ్యక్షుడిని గట్టిగా ఓ మాట అనలేని, వ్యాఖ్యలకు దీటుగా జవాబు ఇవ్వలేని, నిలదీయలేని స్థాయిలో మనం ఉన్నాం. యుద్ధం ఆపింది ఆయనేనని పొరుగుదేశం మాదిరిగా ఒప్పుకోలేక, ఆయన చెబుతున్నది పచ్చిఅబద్ధమని అనలేక, అంతవేగంగా ఎందుకు వెనక్కుతగ్గామో చెప్పలేక మన పాలకులు విపరీతంగా నలిగిపోవడం కనిపిస్తూనే ఉంది. ట్రంప్ అధికారంలోకి రాగానే వేలకోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకూ, భారీ చమురు దిగుమతులకు సంతకాలు చేసినా అమెరికా సంతృప్తిచెందడం లేదు. ఇప్పుడు మనకంటే ఓ తొమ్మిదిశాతం తక్కువ సుంకంతో తన పాక్‌ప్రేమను ట్రంప్ స్పష్టంచేశారు. నాయకుల అతిశయాలూ అహంకారాలూ దేశాల మధ్య సంబంధాలను, ద్వైపాక్షిక ప్రయోజనాలను ప్రమాదంలోకి నెట్టివేయడం సరికాదు.

అనుసంధానభాషగా హిందీని కాదనలేం!

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఉనికిలోకి వచ్చిన తర్వాత, మన దేశంలో ఆయా భాషల చరిత్ర–వికాసం తదితర అంశాల పట్ల ఆసక్తి పెరిగింది. వివిధ భాషల పరస్పర అనువాదాలతో భారతీయ సాహిత్యం విస్తరించింది. కాలక్రమంలో పాలనా సౌలభ్యం దృష్ట్యా ఉత్తరాది, తదితర రాష్ట్రాల విభజన మరోమారు జరిగింది. అయినా ఉమ్మడిగా ఉండి విడిపోయిన రాష్ట్రాల భాష మాత్రం ఒకటిగానే ఉంది. ఇక కొన్ని రాష్ట్రాలలో అక్కడి భాషాభిమానం రాజకీయాల మూలాన దురభిమానానికి దారితీసింది (ఉదాహరణకు తమిళనాడు). కేరళ, కర్ణాటక రాష్ట్రాలు తమ భాషాభిమానాన్ని రాజకీయంగా చాటుకుంటున్నాయి. తెలుగునాట మాత్రమే ఉదారవాద చరిత్ర వల్ల ఇంగ్లీష్ మోజులో మాతృభాష ఉనికికి ప్రమాదం ఏర్పడింది.

ప్రస్తుతం దేశంలో త్రిభాషా సూత్రం అమలులో ఉన్నందువల్ల రెండో భాషగా హిందీ బోధన పట్ల వివాదం చోటుచేసుకొంది. ఇంగ్లీషుతో పాటు హిందీ ఒక అనుసంధాన భాషగా ఆరు, ఏడు దశాబ్దాలుగా దేశమంతా వ్యాపించిన తరువాత, ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు తమ విద్యాలయాల్లో హిందీని రెండో భాషగా వ్యతిరేకిస్తున్నాయి.

రాజ్యాంగరీత్యా హిందీ 'రాజ్యభాష'గా అమల్లోకి వచ్చిన తర్వాత కూడా, ఇంగ్లీషుతో పాటు మిగతా 22 భారతీయ భాషలను సమానస్థాయిగా జాతీయ భాషలుగా ఆమోదిస్తున్నారు. అయితే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల అత్యుత్సాహ ప్రకటనల వల్ల ఇతర భాషలపై హిందీ పెత్తనం వహిస్తున్నదనే భావన బలపడుతున్నది. అధికార రాజకీయాల వివాదాల మధ్య హిందీ బోధన మరోసారి చర్చనీయాంశంగా మారిపోయింది. హిందీ భాషా రాష్ట్రాలు త్రిభాషా బోధన విషయంలో మాతృభాష హిందీతో పాటు ఇంగ్లీషు, సంస్కృతం తప్ప దక్షిణాది భాషలను బోధించడం లేదు. ఆచరణలో హిందీ భాషీయులకు ఇతర భారతీయ భాషలను నేర్చుకోవాలనే ఉత్సాహం లేదు. పైగా దక్షిణాది భాషల పట్ల ఒక అంతర్గత చులకన భావం హిందీని వ్యతిరేకించే వాతావరణాన్ని రాజకీయంగా పెంచి పోషించింది.



భాషాపరమైన రాజకీయాలు, ఇష్టాయిష్టాలను పక్కన పెడితే, జనబాహుళ్యంలో హిందీకి ఉన్న వాడుకను తక్కువగా అంచనా వేయలేము. దేశవ్యాప్తంగా వ్యాపార వాణిజ్య రంగాలలో పర్యాటక క్షేత్రంలో, ముంబై సినీరంగం వల్ల, హిందీ గీతాలు, వెబ్ సిరీస్‌లతో హిందీ భాష ఎంతగానో విస్తరించింది. తమిళనాడు, మహారాష్ట్రలకు అక్కడి రాజకీయ పార్టీల, గ్రూపుల అధికార రాజకీయ ప్రయోజనాల రీత్యా హిందీ పట్ల అభ్యంతరం ఉండొచ్చు. కాని ఆచరణలో ఒక ఆధునికభాషగా హిందీని ఎవరైనా సులువుగా నేర్చుకోగలరనే వాస్తవాన్ని నిరాకరించలేం.

మరోవైపు ఉత్తరాది హిందీ రాష్ట్రాలలో భోజ్‌పురి, మైథిలి, మాగధి, బొందిలి తదితర ప్రాంతీయ (స్థానీయ) భాషలను హిందీ మింగివేసిందనే వాదనలో బలం లేదు. అక్కడి ప్రాంతీయ మాండలికాలకు హిందీ పాలనా భాషగా ఒక చారిత్రక అవసరంగా పరిణమించింది. ఎలాగైతే గోండి, సవర, బంజారా తదితర భాషలకు పరిమితులున్నాయో వాటికీ అంతే!

జాతీయోద్యమ కాలం నుంచి, ఈ దేశంలోని వివిధ భాషల మధ్య ఖడిబోల్ హిందీ ఒక అనుసంధాన భాషగా రూపొందింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ ఈ రోజు దేశ ప్రజలను ఏకం చేసే వాహికగా ఉన్నది. బోధన, శిక్షణ పరంగా కేంద్రీయ హిందీ సంస్థాన్, నిదేశాలయ్ తదితర హిందీ విభాగాల ద్వారా కేంద్ర ప్రభుత్వం గత 50 సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. దక్షిణ భారత హిందీ ప్రచారసభతో పాటు ఇతర ప్రాంతాల హిందీ ప్రచార సంస్థలు ఆ భాషా వ్యాప్తికి కృషి చేస్తున్నాయి.

ప్రస్తుతం హిందీ కేవలం ఉత్తరాది భాషగా కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాకుండా, ఇతర భారతీయ భాషలతో పాటు జాతీయ స్వభావాన్ని సంతరించుకొంది. ఒక లంకెగా, అనుసంధాన భాషగా అభివృద్ధి చెందింది. అయితే ఉర్దూ పదాలను తొలగించి సంస్కృత పదభూయిష్ఠంగా మారిన మాట వాస్తవం.

ఇతరత్రా మణిపురి, సంతాలీ భాషలు తప్ప, ఆయా తెగలకు, గిరిజనులకు చెందిన భాషలు విస్తరించే అవకాశం లేదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల నిమిత్తం ఇంగ్లీషు, ప్రాంతీయ భాషలను నేర్చుకోవలసిందే! మన దేశ కాల పరిస్థితుల్లో జాతీయ–అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకుంటే ఇంగ్లీషు–హిందీ తప్ప ప్రత్యామ్నాయాలున్నాయా? విదేశాల్లో ఉద్యోగాల కోసం జర్మనీ, ఫ్రెంచి మొదలైన భాషలను నేర్చుకోవడం అతి కొద్దిమందికే సాధ్యం.

• నిఖిలేశ్వర్

సిందూర్ విజయాలు, పాలకుల వైఫల్యాలు!

పార్లమెంటు ఉభయ సభలలో గత వారం ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగింది. ఆ సైనిక చర్య లక్ష్యాలు నెరవేరాయని, తత్కారణంగా దాన్ని తుదకు (తాత్కాలికంగా) విరమించడం జరిగిందని, మన సైనిక కార్యకలాపాలు సాధారణమైన క్రమ పద్ధతికి వచ్చాయనే అభిప్రాయాన్ని ప్రభుత్వం కలిగించింది. పరిస్థితి నిజంగా అలా ఉన్నదా? లేదు. ప్రభుత్వం కలిగించిన అభిప్రాయం తప్పు. నిజమేమిటంటే మన సైన్యం ఒక కఠినమైన ఆట ఆడుతుండగా ప్రభుత్వం బలవంతంగా బంతిని లాక్కోవడం జరిగింది! మన సైనిక దళాల ధైర్య సాహసాలకు జేజేలు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆపరేషన్ సిందూర్ కొన్ని కట్టుకథలను బద్దలుగొట్టింది. అపోహాలు, తప్పుడు నమ్మకాలను తొలగించింది. పాకిస్థాన్‌పై యుద్ధం, విజయ సాధన చాలా సులభం; సంప్రదాయ యుద్ధంలో భారత్ ఆధిక్యత చెక్కు చెదరకుండా కొనసాగుతుంది; భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మిత్ర దేశాలు ఉన్నాయి, పాకిస్థాన్‌కు శ్రేయోభిలాషులు ఎవరూ లేరు మొదలైనవే ఆ కట్టుకథలు.

మన సైనిక దళాల నాయకత్వం విలక్షణ రీతిలో వ్యవహరించింది. సైనిక చర్యలకు ఉదాహరణప్రాయంగా ఆపరేషన్ సిందూర్‌ను అవి నిర్వహించాయి. సైనిక కార్యాచరణ విషయంలో స్వేచ్ఛనివ్వాలని ప్రభుత్వాన్ని సైన్యం కోరింది. సైన్యం అభ్యర్థనను సర్కార్ అంగీకరించింది. సైనిక చర్యకు సంకల్పించింది, తొట్ట తొలుత రంగంలోకి దిగింది భారత సైన్యమే గనుక దానికి సహజంగానే ప్రారంభ సానుకూల ప్రయోజనాలు దక్కాయి: పాకిస్థాన్ భూభాగాలలోను, ఆక్రమిత కశ్మీర్‌లోను ఉన్న తొమ్మిది వేర్వేరు ఉగ్రవాద స్థావరాలపై కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలో చేసిన దాడులు సంపూర్ణంగా విజయవంతమయ్యాయి. ఉగ్రవాద కార్యకలాపాల సదుపాయాలు, సాధనాలు సమస్తమూ ధ్వంసమైపోవడంతో పాటు పలువురు ఉగ్రవాదులు హతులయ్యారు. అయితే పాకిస్థాన్ సైనిక దళాలు త్వరితగతిన కోలుకున్నాయి. చైనాలో తయారైన యుద్ధ విమానాలు (జె–10), చైనా ఉత్పత్తి చేసిన మిస్సైల్స్ (పి–15), తుర్కియే సరఫరా చేసిన డ్రోన్‌లతో మే 7–8 రాత్రి, పాకిస్థాన్ ప్రతిదాడులు నిర్వహించింది.

తమ వ్యూహ సంబంధిత లోపాలు, లొసుగులను మన సైనిక దళాల నాయకత్వం వెన్వెంటనే గుర్తించి, కొత్త యుద్ధ తంత్రంతో పాకిస్థాన్‌ను ఎదుర్కొన్నది. అదీ సరైన, సమర్థ నాయకత్వం. పునః ప్రారంభమైన సైనిక చర్యలు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని 11 సైనిక వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సహజంగానే భారత సైన్యానికి కొన్ని నష్టాలు వాటిల్లాయి. అత్యున్నతస్థాయి సైనికాధికారులు ఈ వాస్తవాన్ని అంగీకరించారు. ఇది, సమర్థ నాయకత్వానికి మరొక ఉదాహరణ.

మరి మన రాజకీయ నాయకత్వం కూడా సైనిక నాయకత్వం మాదిరిగా వ్యవహరించిందా? లేదు. తన తప్పులను అంగీకరించలేదు. నష్టాలు వాటిల్లినట్టు ఒప్పుకోలేదు (తలను ఇసుకలో దూర్చి తననెవరూ చూడటం లేదని భావించే) ఉష్ట్రపక్షిలా మన రాజకీయ నాయకత్వం వ్యవహరించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఒక 'నిర్ణయాత్మక విజయం' సమకూరిందని పదే పదే ప్రకటించింది. నిజమేనా? నిర్ణయాత్మక విజయం సమకూరి ఉన్నట్టయితే తనకు సానుకూలంగా ఉన్న పరిస్థితులను మరిన్ని సైనిక విజయాల సాధనకు ఎందుకు ఉపయోగించుకోలేదు? పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి రాజకీయ రాయితీలను డిమాండ్ చేసి ఎందుకు పొందలేదు? పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ఫోన్ చేసీ చేయగానే ఎందుకు సానుకూలంగా ప్రతిస్పందించారు? కాల్పుల విరమణకు షరతులు ఎందుకు విధించలేదు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు లేవు (యుద్ధంలో ఒక నిర్ణయాత్మక విజయానికి తిరుగులేని ఉదాహరణ డిసెంబర్ 16, 1971న పాకిస్థాన్ సైనికాధికారి జనరల్ నియాజీ భారత సైనికాధికారి జనరల్ అరోరాకు లొంగిపోవడం).

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నెలకొన్న ఒక వాస్తవాన్ని మన రాజకీయ నాయకత్వం అంగీకరించలేదు: పాకిస్థాన్, చైనాలు తమ సైనిక, రాజకీయ సంబంధాలను మరింతగా పటిష్ఠం చేసుకున్నాయి. పాకిస్థాన్‌కు కొత్త తరం యుద్ధ విమానాలు, మిస్సైల్స్‌ను చైనా సరఫరా చేస్తోంది. తాము ఉత్పత్తి చేసిన సైనిక సామగ్రి మన్నికను ఆపరేషన్ సిందూర్ సందర్భంగా చైనా పరీక్షించుకున్నది. బీజింగ్–ఇస్లామాబాద్ సైనిక బంధం ఆపరేషన్ సిందూర్‌లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ రంగంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి 'ఉగ్రవాదంపై పాకిస్థాన్ నిశ్చయాత్మక చర్య'ను ప్రశంసించారు. పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు చైనా సంపూర్ణ మద్దతునిచ్చింది.

అమెరికాతో పాకిస్థాన్ (కనీసం పాకిస్థాన్ సైన్యం) బంధం మరింతగా ధృఢతరమవడం మరొక వాస్తవం. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌ను అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో విందుకు ఆహ్వానించారు. దేశ సార్వభౌమాధినేత లేదా ప్రభుత్వాధినేత కాని వ్యక్తులకు మున్నెన్నడూ ఇటువంటి గౌరవం లభించలేదు. 'యుద్ధాన్ని కొనసాగించకుండా, ముగించినందుకు జనరల్ మునీర్‌కు ట్రంప్ కృతజ్ఞతలు చెప్పారు. తన విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్‌లు అంగీకరించాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు.

ఆపరేషన్ సిందూర్ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలను ప్రధానమంత్రి, హోం మంత్రి ఘాటుగా విమర్శించారే గానీ అమెరికా, చైనా అధ్యక్షులు, వారి విదేశాంగ మంత్రుల ప్రకటనలను ఖండించే సాహసం చేయలేకపోయారు. ప్రతిపక్షాల విమర్శలు నిరాధారమైనవని ఎందుకు నిరూపించలేకపోయారు? అంతర్జాతీయ వాణిజ్యంలో ఆధిక్యతకు పోటీపడుతున్న అమెరికా, చైనాలు పాకిస్థాన్‌ను సైనికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకోవడంలో ఒకే విధంగా వ్యవహరించాయన్నది మరొక విస్మరించలేని వాస్తవం. ఈ రెండు దేశాలు తమ విభేదాలు విస్మరించి పాకిస్థాన్‌కు మద్దతునిచ్చేందుకు, ప్రోత్సహించేందుకు అంగీకరించాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే పహల్గాం దాడిలో పాకిస్థాన్ ప్రమేయాన్ని చాటి చెప్పేందుకు ప్రపంచ దేశాలకు భారత ప్రభుత్వం పంపిన దౌత్య ప్రతి



> పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయాలు దుస్సాహసాలకు పాల్పడకుండా పాకిస్థాన్‌ను నిరోధించవచ్చు. అయితే మన ప్రత్యర్థి దేశానికి అమెరికా, చైనాల కుటిల మద్దతును ఎండగట్టడంలో భారత రాజకీయ నాయకత్వం పిరికితనం ప్రదర్శించింది. దీనివల్ల మన సైనిక విజయాలు వ్యర్థమైపోయి పాకిస్థాన్ మరోసారి మనపై కాలుదువ్వేందుకు సాహసించవచ్చు.

నిధుల బృందాలు తమ లక్ష్యాన్ని సంపూర్ణంగా సాధించలేకపోయాయి. ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని, భారత్‌కు సానుభూతిని వ్యక్తం చేశాయేగానీ ఆ దుర్మార్గానికి పాకిస్థాన్‌దే బాధ్యత అని ఏ ఒక్క దేశమూ ఖండించనేలేదు. ఈ వాస్తవాలను అంగీకరించేందుకు భారతదేశ రాజకీయ నాయకత్వం తిరస్కరిస్తోంది. పాకిస్థాన్‌కు మిత్ర దేశాలు లేవని, భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మిత్రులు ఉన్నారనే భ్రమలోనే ఇప్పటికీ ఉన్నది!

జమ్మూ–కశ్మీర్‌లో ఉగ్ర ఆవరణం (టెర్రర్ ఎకోసిస్టమ్ – ఉగ్రవాద ఆవిర్భావం, వ్యాప్తి, నిలకడకు దోహదం చేసే పరస్పర అనుసంధానిత కారకాల సంక్లిష్ట వ్యవస్థ) ధ్వంసమైపోయిందనే భ్రమలో కూడా దేశ రాజకీయ నాయకత్వం ఉన్నది. సత్యం భిన్నంగా ఉన్నది, సందేహం లేదు. పహల్గాం ఉగ్రదాడి (ఏప్రిల్ 22, 2025) సంభవించిన రెండు రోజుల అనంతరం (ఏప్రిల్ 24) ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ ఈ క్రింది వివరాలు వెల్లడించింది: జూన్ 2014– మే 2024 మధ్య కశ్మీర్‌లో 1643 ఉగ్రవాద సంఘటనలు, 1925 చొరబాటు ప్రయత్నాలు, 726 సఫల చొరబాట్లు సంభవించాయి; 576 మంది భద్రతా సిబ్బంది హతమయ్యారు. అటల్ బిహారీ వాజపేయి (1998–2004), మన్మోహన్‌సింగ్ (2004–2014) ప్రధాన మంత్రిత్వాల కాలంలో కూడా ఉగ్రవాద దాడులు సంభవించాయి, హతులు, క్షతగాత్రులు గణనీయంగా ఉన్నారు.

ఉగ్ర ఆవరణంలో ఉన్నదెవరు? పాకిస్థాన్ నుంచి భారత భూభాగాల్లోకి చొరబడినవారు, భారత్‌లో, ముఖ్యంగా కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నవారు. ఈ రెండు వర్గాలవారు తరచు కలిసికట్టుగా పనిచేస్తున్నారు, కలిసికట్టుగా ఉగ్ర చర్యలకు పాల్పడుతున్నారు, పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. ఏప్రిల్ 26, 2025న ప్రభుత్వం కశ్మీర్ లోయలో పలు గృహాలను కూల్చివేసింది. 'పహల్గాం ఊచకోతతో సంబంధమున్న ఉగ్రవాదులు' అని అనుమానించిన వారి గృహాలను కూల్చివేసినట్టు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. కూల్చివేతకు గురైన గృహాల యజమానులు భారతదేశానికి చెందిన ఉగ్రవాదులే. జూన్ 2025లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారికి ఆశ్రయమిచ్చినందుకు ఇద్దరు భారతీయులను అరెస్ట్ చేసింది. జూలై 27–28న ఉగ్రవాదులు అని శంకిస్తున్న వ్యక్తులను నిరాయుధులను చేసి, వారు చొరబాటుదారులు అని గుర్తించారు.

భారతదేశానికి చెందిన ఉగ్రవాదులు గతంలో ఉగ్రవాద హింసాకాండకు పాల్పడ్డారు. 2006లో ముంబై సబర్బన్ రైలులో బాంబు పేలుళ్ళు, 2008లో తాజ్‌మహల్ హోటల్‌పై దాడి, 2011లో జావేరీ బజార్ ఘటన సదరు ఉగ్రవాద హింసాకాండకు ఉదాహరణలు. 2006 ఉగ్రవాద దుర్మార్గానికి పాల్పడింది భారత్‌కు చెందిన ఉగ్రవాదులే. 2008 ఘటనకు పాల్పడినవారు కసబ్‌తో సహా పది మంది పాకిస్థానీ చొరబాటుదారులు. 2011 ఘటన భారత్‌కు చెందిన ఉగ్రవాదుల క్రూర కృత్యమే. భారత్‌లో ఉగ్ర ఆవరణాన్ని (టెర్రర్ ఎకో సిస్టమ్) నిర్మూలించినట్టు ప్రభుత్వం చేస్తున్న వాదన నిస్సందేహంగా తప్పు. ప్రభుత్వ వాదన నిజమే అయితే పహల్గాం దాడి ఎలా సంభవించింది? గూఢచార వర్గాల వైఫల్యం, పహల్గాంలో భద్రతా దళాలు లేకపోవడం వల్లే ఏప్రిల్ 22న ఆసేతు హిమాచలం ప్రతి ఒక్కరినీ కలచివేసిన బీభత్స విషాదం చోటుచేసుకున్నది. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ఏ ఒక్కరూ ఆ అమానుష హింసాకాండకు బాధ్యత తీసుకోలేదు. ఇది గర్హనీయం కాదా? పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయాలు దుస్సాహసాలకు పాల్పడకుండా పాకిస్థాన్‌ను నిరోధించవచ్చు. అయితే మన ప్రత్యర్థి దేశానికి అమెరికా, చైనాల కుటిల మద్దతును ఎండగట్టడంలో భారత్ రాజకీయ నాయకత్వం పిరికితనం ప్రదర్శించింది. దీనివల్ల మన సైనిక విజయాలు వ్యర్థమైపోయి పాకిస్థాన్ మరోసారి మనపై కాలుదువ్వేందుకు సాహసించవచ్చు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

టాటా ఉదంతం ఓ హెచ్చరిక!

ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒకేసారి 12,200 మంది ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించడం అందరినీ షాక్‌కి గురిచేసింది. సంస్థ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో ఇది రెండు శాతం. ఈ స్థాయిలో ఉద్యోగాలకు ఉద్వాసన పలకడం భవిష్యత్‌లో జాబ్ మార్కెట్‌లో జరగబోతున్న పరిణామాలకు తొలి సంకేతం. ప్రమాద హెచ్చరిక కూడా. ఉద్యోగాల తొలగింపు అన్నది ఒక ఐటీ రంగానికి లేదా భారత్‌కి మాత్రమే సంబంధించిన కుదుపు కాదు. ప్రపంచవ్యాప్తంగా, అన్ని రంగాల్లో ఎదురవబోయే కీలక మార్పులకు అద్దం పడుతుంది. ఐటీ రంగంలో ఇప్పటికే కృత్రిమ మేధ ప్రభావం వేగం అందుకుంది. కోడింగ్‌లో ముప్పై శాతం మేరకు కృత్రిమ మేధ ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. మిగతా రంగాల్లో కూడా దాని ప్రభావం విస్తృతమవుతోంది. ఫలితంగా లక్షలాది ఉద్యోగాలకు ఎసరు తప్పదు. అయితే పాత తరహా ఉద్యోగాలకు కాలం చెల్లినా, కొత్త అవకాశాలు, నూతన నైపుణ్యాల అవసరం ఉన్నవి ఆ వాక్యూమ్‌ని భర్తీ చేస్తాయి. కంప్యూటర్లు వచ్చిన మొదట్లో జరిగింది ఇదే.

ప్రభుత్వం కానీ, ప్రైవేట్ రంగ విద్యాసంస్థలు కానీ భవిష్యత్‌కి సరిపడే రీతిలో విద్యావకాశాల్ని పెంచాలి. శిక్షణా కేంద్రాలు నెలకొల్పి ప్రపంచ స్థాయి అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం మన దేశంలో యువ శక్తి గణనీయంగా ఉంది. ఆ వనరుల్ని బలంగా మార్చుకోవాలంటే అందుకు తగ్గట్టుగా సమాయత్తం కావాలి. ప్రస్తుత ఉద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రణాళికలు ఉండాలి. ఒక్క కృత్రిమ మేధ వల్లనే ఈ సంక్షోభం ఎదురవడం లేదు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల వాణిజ్య నిర్ణయాలు, యుద్ధాలు, రాజకీయాలు... కరోనా అనంతర ప్రపంచాన్ని సమూలంగా మార్చివేశాయి. దేశం ముందున్న దారి ఒక్కటే. ఆర్థికంగా, సామాజికంగా, విజ్ఞాన పరంగా బలోపేతం కావడం. అందులో భాగంగా వ్యవసాయం, పరిశ్రమలు లాభసాటిగా మార్చడం, ఉత్తమ క్వాలిటీ విద్యను అందించడం ద్వారా యువశక్తిని బలోపేతం చెయ్యడం. నిరుద్యోగిత తగ్గించడంతో బాటు ప్రపంచ స్థాయి ఉద్యోగాలకు అర్హులుగా విద్యార్థి దశలోనే తీర్చిదిద్దడం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో జరుగుతున్న భారీ స్థాయి ఉద్వాసనను భారత్ ఓ హెచ్చరికగా భావించాల్సిన తరుణం ఇది.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

దార్శనికులైన నాయకులు లీ క్వాన్ యూ, చంద్రబాబు

మూడో ప్రపంచ వర్ధమాన దేశంగా ఉన్న సింగపూర్‌ను అతి తక్కువ కాలంలో మొదటి ప్రపంచ అగ్ర దేశాల సరసన నిలిపిన దార్శనికుడైన నాయకుడు లీ క్వాన్ యూ. అలాగే విభజన గాయంతో విలవిలలాడిన అవశేష ఆంధ్రప్రదేశ్‌ని అచిరకాలంలోనే ప్రతికూలతలకు ఎదురీది, పునర్నిర్మించి శిఖరాగ్రాన నిలబెట్టారు నారా చంద్రబాబు నాయుడు. శక్తిమంతమైన నాయకులైన వీరిద్దరికీ దగ్గరి పోలికలు ఉన్నాయని, ప్రపంచ నగరాల సదస్సులో పాల్గొనేందుకు చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్ళిన సందర్భంగా అప్పటి ఆ దేశ ఆర్థికమంత్రి క్వేట్ ప్రశంసించారు. అక్కడి ప్రముఖులు కూడా దార్శనికుడు లీ క్వాన్ యూతో చంద్రబాబును సరిపోల్చారు. 2014–19 మధ్య ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతిపథంలో చంద్రబాబు నడిపిస్తున్న తీరు, రాష్ట్ర బంగారు భవితవ్యాన్ని ఆవిష్కరించిన అద్భుత సందర్భం అది. చంద్రబాబు సమర్థ నాయకత్వం, దార్శనికత, వినూత్న విధానాలతో మెరుగైన పాలన అందిస్తున్న విషయం సింగపూర్ ప్రజలకు తెలుసు అని క్వేట్ అన్నారు. 'దార్శనికుడు లీ క్వాన్ యూ–చంద్రబాబు ఇద్దరు భారీ లక్ష్యాలను ముందు పెట్టుకొంటారు. వాటిని సాధించేందుకు ఎంతో శ్రమిస్తారు. వారి పట్టుదల, దీక్షా దక్షతలే ఉభయ ప్రాంతాలను పతనం అంచుకి చేరకుండా సురక్షితంగా నిలిపాయి' అన్నారు క్వేట్. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడానికి చంద్రబాబు చేస్తున్న కృషి నిరుపమానమని, అందుకే ఈ ఇద్దరి సారథ్యాలు, సారూప్యాలు ఒక్కటే అన్నారు క్వేట్.

రాష్ట్రంలో పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఇటీవల సీఎం చంద్రబాబు నాలుగు రోజుల పర్యటనకు సింగపూర్ చేరుకున్నప్పుడు, అక్కడున్న తెలుగు ప్రజలు ఘనస్వాగతం పలికారు. సింగపూర్‌లో నాలుగు రోజులు పర్యటించి విరామం లేకుండా వివిధ సంస్థల ప్రతినిధులతో వరుసగా సమావేశమై ఏపీలో ఉన్న సానుకూల అంశాలను వివరిస్తూ... పెట్టుబడులు పెట్టాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్. అక్కడ జరిగిన దాదాపు 26 కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. అక్కడున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సందర్శించి, వాటిని మన రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. సీఎం చంద్రబాబు బృందానికి సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే సహకరించారు. చంద్రబాబు బ్రాండ్‌తోనే పెట్టుబడుల వరద రాష్ట్రాన్ని ముంచెత్తబోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు వివరించి, భారీ పెట్టుబడులతో పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలు రాష్ట్రానికి రావడానికి గట్టి ప్రయత్నం చేశారు. రానున్న రోజుల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయి. పెట్టుబడులను ఆకర్షించి, పారిశ్రామికాభివృద్ధి సాధించి, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి యువతకు బంగారు బాటలు వెయ్యడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు.

> రాష్ట్రాన్ని ఆర్థికంగా పరిపుష్టం చెయ్యడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వీలైనన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తెచ్చిన నూతన పాలసీల ఫలితంగా పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా నిలవనుంది. నూతన పాలసీలు పారిశ్రామిక వికాసంపై విశ్వాసం కలిగిస్తున్నాయి. విదేశీ కంపెనీలు సైతం పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రానున్నాయి.

పెట్టుబడిదారులకు రాష్ట్రంలో ప్రాంతాల వారీగా వర్తక, వాణిజ్య, పరిశ్రమల ఏర్పాటు అవకాశాలు, అందుబాటులో ఉన్న వనరుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెట్టుబడుల రంగంలో దిగ్గజ కంపెనీగా ఉన్న టెమాసెక్ హోల్డింగ్స్‌కు చెందిన పోర్ట్‌ఫోలియో డెవలప్‌మెంట్, కార్పొరేట్ స్ట్రాటజీ విభాగం జాయింట్ హెడ్ దినేశ్ ఖన్నాతో కీలక చర్చలు జరిపారు. అనేక దిగ్గజ కంపెనీలైన క్యాపిటా ల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్, టెమ్‌సెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు వేర్వేరుగా చర్చలు జరిపారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల ద్వారా అభివృద్ధికి రూపొందించుకున్న ప్రణాళికలను వారికి వివరించారు. సింగపూర్ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరుగు పయనమైన సీఎం చంద్రబాబుకు అక్కడి తెలుగు ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు.

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బతిన్న పరిస్థితుల్లో మళ్లీ ఏపీ బ్రాండ్‌ను నిలబెట్టేందుకు సీఎం చంద్రబాబు, విద్యామంత్రి నారా లోకేశ్ సింగపూర్ పర్యటనలో అలుపెరుగకుండా శ్రమించారు.




ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు వారు చేసిన ప్రయత్నాలు ఫలించబోతున్నాయి. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తెచ్చిన నూతన పాలసీల ఫలితంగా పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా నిలవనుంది. నూతన పాలసీలు పారిశ్రామిక వికాసంపై విశ్వాసం కలిగిస్తున్నాయి. విదేశీ కంపెనీలు సైతం పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రానున్నాయి. 15 శాతానికి పైగా వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా నూతన పారిశ్రామిక పాలసీలు రూపొందించింది ఏపీ ప్రభుత్వం. రాష్ట్రంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ప్రకటించిన నేపథ్యంలో ఆ దిశగా పెట్టుబడులు బారులు తీరే అవకాశం ఉంది.

స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాలను చేరుకునే క్రమంలో రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సర్కారు చర్యలు తీసుకుంటున్నది. ఈ క్రమంలోనే విశాఖపట్నం వేదికగా నవంబరు 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు–2025ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దేశం యావత్తూ ఇప్పుడు ఏపీ వైపు చూస్తోంది. అయిదేళ్ల విధ్వంసం తర్వాత పడి లేచిన కెరటంలా రాష్ట్ర అభివృద్ధికి బాటలు పడనున్నాయి. రాష్ట్రాన్ని ఆర్థికంగా పరిపుష్టం చెయ్యడానికి చంద్రబాబు వీలైనన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. పోర్టులు, సుదీర్ఘ తీరప్రాంతం ఏపీ సొంతం. డీప్ పోర్టులు కలిగివున్న ఏపీని లాజిస్టిక్ హబ్‌గా మలచాలన్న ఆశయంతో చంద్రబాబు శతవిధాలా కృషి చేస్తున్నారు. ఏపీ వ్యాపార వాణిజ్య అభివృద్ధిలో దేశానికి తూర్పుతీర ముఖద్వారంగా ఆవిర్భవించనున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో ఓడరేవుల అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కి 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉండటం అత్యంత ప్రాధాన్యతాంశం. ప్రస్తుతం 6 పోర్టులు ఉన్నాయి. కొత్తగా మరో 4 రానున్నాయి. ఈ పోర్టులను అనుసంధానం చేస్తూ రైలు, రోడ్డు మార్గాలు ఏర్పాటు చేయాలని, అంతర్గత జల రవాణా వ్యవస్థ ద్వారా సరకు రవాణాకు ఉపయోగించి, తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసి, పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించినట్లు సింగపూర్ పర్యటనలో వివిధ కంపెనీల సీఈవోలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తామని, పెట్టుబడులతో వచ్చే వారికి సహకరిస్తామని, తీరప్రాంతంలో పెట్టుబడులకు ఇది సరైన సమయం అన్నారు.

ఏది ఏమైనా జగన్ నిర్వాకంతో దెబ్బతిన్న రాష్ట్ర ఇమేజ్‌ను సరిచేయడంతో పాటు సింగపూర్ ప్రభుత్వంతో సంబంధాలను పునరుద్ధరించే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అక్కడ నాలుగు రోజుల పాటు విస్తృతంగా పర్యటించి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానించడం హర్షించదగిన విషయం.

▪ కలిశెట్టి అప్పలనాయుడు
పార్లమెంట్ సభ్యులు, విజయనగరం



మరో నెలా 20 రోజుల్లో ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు మొదలవుతాయి. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు, అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. 'సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యత' అనే నినాదాన్ని చెబుతున్న జిల్లా యంత్రాంగం ఏటా ఆ లక్ష్యాన్ని చేరుకుంటుందా లేదా అనేదే అనుమానం. అంతరాలయ దర్శనాల్లో ఆంక్షలు, ప్రొటోకాల్ వీఐపీల రాకలో పరిమితులు, తిరుమల బ్రహ్మోత్సవాల తరహా విధానాల అమలుతోనే ఈసారైనా సామాన్య భక్తులు అమ్మను కనులారా దర్శించుకుని ఆనందంతో బయటకు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఆ దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికలు వేయాల్సిన అవసరం ఉంది.

మినీ బ్యారేజీలేవీ?

సముద్రంలోకి వృథాగా పోతున్న కృష్ణానది నీరు

- రోజూ వందల టీఎంసీల నీరు విడుదల
- ఈ ఏడాది ఇప్పటివరకు 42 టీఎంసీలు
- కాగితాలకే పరిమితమైన మినీ బ్యారేజీలు
- నాడు హడావిడి చేసిన వైసీపీ సర్కార్
- 'కూటమి' నిర్ణయం కోసం ఎదురుచూపులు

18-19 టీఎంసీలు.. ప్రకాశం బ్యారేజీ నుంచి రోజూ సముద్రంలోకి వృథాగా పోతున్న నీటి లెక్క ఇది. ఎగువ నుంచి ఉరకలేసుకుంటూ వస్తున్న కృష్ణమ్మ అదే వేగంతో కడలిలో కలిసిపోతోంది. బ్యారేజీకి దిగువన నిర్మించాల్సిన మినీ బ్యారేజీలు కాగితాలకే పరిమితం కాగా, వరదలు వచ్చిన ప్రతిసారీ వందలాది టీఎంసీల నీరు సముద్రంపాలవుతోంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రస్తుతం బ్యారేజీ వద్ద 2లక్షల35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇక్కడ పూర్తిస్థాయి నీటిమట్టం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండటంతో ఎగువ నుంచి వస్తున్న నీటిని కిందకు వదిలేస్తున్నారు. ఈ ఏడాది బ్యారేజీకి ఇన్‌ఫ్లో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 42 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోయింది. ఇన్‌ఫ్లో ఆగే వరకు ఈ వృథా కొనసాగుతూనే ఉంటుంది. రోజుకు సరాసరిన 18-19 టీఎంసీలు సముద్రంలో కలుస్తోంది. గత ఏడాది వచ్చిన వరదలకు ఏకంగా 840 టీఎంసీల నీరు సముద్రం పాలైంది. ఇలా ఏటా వందలకొద్దీ టీఎంసీల నీరు వృథాగా పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2002లో బ్యారేజీ నుంచి అత్యధికంగా 1,200 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసింది.

కాగితాలకే పరిమితమా?

ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిసినా, వాగులు, వంకలు పొంగినా, ఎగువ ప్రాజెక్టులు నిండినా ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద వస్తుంది. ఇలా వచ్చిన వరద నీటిని ఒడిసి పట్టడానికి, దిగువన నీటి నిల్వలు పెంచడానికి



పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద నుంచి సముద్రంవైపు వెళ్తున్న కృష్ణానది వరద నీరు

మినీ బ్యారేజీలు నిర్మించాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రకాశం బ్యారేజీకి దిగువన, పెనమలూరు మండలం చోడవరం వద్ద బెలూన్ బ్యారేజీ నిర్మించాలని సంకల్పించింది. దీనికి ప్రతిపాదనలను తయారుచేసి అంచనాలను రూపొందించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ ఆ సంకల్పానికి సమాధి కట్టేసింది. బెలూన్ బ్యారేజీ ప్రతిపాదనను పక్కన పెట్టేసి కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. బ్యారేజీకి 12 కిలోమీటర్ల దిగువన చోడవరం దగ్గర, 60 కిలోమీటర్ల దూరంలో శ్రీకాకుళం వద్ద రెండు మినీ బ్యారేజీలు నిర్మించాలని తలపెట్టింది. ఈ రెండింటికీ మంత్రివర్గంలో ఆమోదం కూడా తెలిపింది. తర్వాత చోడవరం వద్ద నిర్మించే మినీ బ్యారేజీకి మాత్రమే పాలనాపరమైన మిగతా 4లో..



నిర్లక్ష్యమే నిదర్శనం

బ్రహ్మోత్సవాల తీరుగా సాగాలి

ఉభయదాతలు కుంకుమ పూజ నిర్వహిస్తారు. పూజ అనంతరం వారిని అంతరాలయ దర్శనానికి పంపిస్తారు. సాధారణ సమయంలో ఇది సరిగ్గానే ఉంటుంది కానీ, దసరా ఉత్సవాల్లో మాత్రం ఇబ్బందికర పరిణామంగా మారింది. ఉభయదాతలతో కుంకుమ పూజలు చేయించినా.. దర్శనాల విషయంలో ఒకే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరముంది. అలాగే, ప్రొటోకాల్ దర్శనాల పేరుతో అంతరాలయ దర్శనాలకు అనుమతిస్తున్నారు. ఈ దర్శనాల కోసం ఎవరుపడితే వారు ఎగబడటం వల్ల అసలు ఉద్దేశం గాడి తప్పుతోంది. ఈ రెండింటి విషయాల్లో తిరుమల బ్రహ్మోత్సవాల తరహా విధానాన్నే దసరాలో ఇంద్రకీలాద్రిపై అమలుచేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు.

ఏటా ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో జరుగుతుంది అదే..

- అంతరాలయ దర్శనాలను కట్టడి చేయడంలో అడ్డంకులు
- అధికారిక, అనధికారిక అంతరాలయ దర్శనాలతోనే అవస్థలు
- సామాన్య భక్తులకు త్వరగా దర్శనం కాని పరిస్థితి
- ఈసారైనా కట్టడి చేయాలని కోరుతున్న సామాన్య భక్తులు
- తిరుమల బ్రహ్మోత్సవాల విధానాన్ని ఎందుకు అవలంబించరు?
- దశాబ్దాలుగా సాగుతున్న సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి రెండు దశాబ్దాలుగా జరుగుతున్న తీరుతెన్నులు చూస్తే.. సామాన్య భక్తులకు తలెత్తుతున్న ఇబ్బందులే ప్రధానంగా కనిపిస్తున్నాయి. అంతరాలయ దర్శనాల వల్లే ఇలా జరుగుతుందనేది అందరికీ తెలిసిన విషయమే. అధికార, అనధికార అంతరాలయ దర్శనాలతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడటమే కాకుండా నిర్వహణ తీరుపై తిరగబడే పరిస్థితులు వస్తున్నాయి. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద దేవస్థానమైన ప్పటికీ ఈ అంతరాలయ దర్శనాలను కట్టడి చేయలేని పరిస్థితి ఏర్పడింది. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో మాదిరిగా.. ఇంద్రకీలాద్రిపై కూడా ఎలాంటి సిఫార్సులు, వీఐపీల సేవలో తరించకుండా సామాన్య భక్తులే మిగతా 4లో..



సిఫార్సులు దరిచేరనీయొద్దు

ఉత్సవాల్లో కొండపై డ్యూటీలు చేసే పోలీసులు, రెవెన్యూ, దేవస్థాన, ఎమ్మెల్యేలు, వారి కార్యాలయాల సిబ్బంది, నామినేటెడ్ పదవులు కలిగినవారు ప్రొటోకాల్ ముసుగులో అనధికారికంగా దర్శనానికి వస్తున్నారు. వీరికి అడ్డు చెప్పేవారే లేరు. ఇక ఉత్సవ కమిటీ సభ్యులు కూడా అంతే. వీరిని నియంత్రించే సాహసం ఎవరూ చేయలేకపోతున్నారు.

ఘాట్‌రోడ్డులో క్రమబద్ధీకరణ ఏదీ?

ఏటా వీఐపీలు, ఉభయ దాతలకు ప్రొటోకాల్ పేరుతో ప్రత్యేక వాహనాలను ఘాట్‌రోడ్డులో నడుపుతున్నారు. ఉచిత బస్సులు కూడా నడుస్తాయి. వీటిని వేటికోసం ఏర్పాటుచేశారో ఆ విషయం నెరవేరదు. ఎవరుపడితే వారు ఈ వాహనాల్లో వచ్చేస్తూ చినరాజగోపురం వద్దకు చేరుకుంటున్నారు. ఇక్కడ ఒక్కసారిగా రద్దీ పెరిగిపోతుండటంతో అధికారులు కూడా దర్శనానికి అనుమతిచ్చేస్తున్నారు. వీరంతా అంతరాలయ దర్శనాలకు వెళ్లడం వల్ల ఇతర క్యూలపై ప్రభావం పడుతోంది.

నిలకడగా వరద

ప్రకాశం బ్యారేజీ వద్ద హెచ్చుతగ్గుల మధ్య నీటిమట్టం

విజయవాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్ట్, ప్రకాశం బ్యారేజీలకు కృష్ణా వరద నిలకడగా కొనసాగుతోంది. శుక్రవారం నాగార్జున సాగర్ నుంచి 2.38 లక్షల క్యూసెక్కుల నీరు పులిచింతలకు చేరుకుంది. దీంతో పులిచింతల నుంచి విడుదల చేసిన 2.05 లక్షల క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజీని తాకాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 65 గేట్లను నాలుగు అడుగులు, ఐదు గేట్లను ఐదు అడుగులు ఎత్తి 2.06 లక్షల క్యూసెక్కుల వరదను సముద్రంలోకి పంపారు. బ్యారేజీలో 12 అడుగుల మేర నీటిమట్టం ఉందని కృష్ణా రివర్ కన్జర్వేటివ్ ఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. కృష్ణానదిలో వరద ప్రవాహం శనివారం ఇలాగే హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతుందన్నారు. పులిచింతల ప్రాజెక్టులో 40.5 టీఎంసీల నీటి నిల్వ ఉందని తెలిపారు.

ఉత్తుత్తి తనిఖీలు

ఫెర్టిలిటీల జోలికే వెళ్లని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ఏదైనా సంఘటనలు జరిగితేనే స్పందించటం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అలవాటైపోయింది. ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, మెడికల్ ల్యాబ్‌ల వంటి వాటిని క్రమంగా తనిఖీలు చేస్తుంటే, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వంటి మోసాలు ముందే వెలుగులోకి వచ్చేవి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా సృష్టి ఉదంతం తర్వాత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పుడు స్పందించడం, అది కూడా ల్యాబ్‌లు, చిన్నచిన్న క్లినిక్‌లలోనే తనిఖీ చేస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

- సృష్టి వ్యవహారం నేపథ్యంలో కేవలం హడావిడే..
- చిన్నచిన్న ల్యాబ్‌లు, క్లినిక్‌లకే పరిమితం
- నగరంలోని ఫెర్టిలిటీ సెంటర్లపై పెట్టని దృష్టి
- తనిఖీలు నిర్వహిస్తేనే అక్రమాలు బయటపడేది



విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అడ్డగోలు వ్యవహారాలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారానికి కేంద్రం హైదరాబాద్ అయినప్పటికీ దానికి సంబంధించిన మూలాలు విజయవాడ, విశాఖపట్నంలో ఉన్నట్టు తెలంగాణ పోలీసులు గుర్తించారు. నగరంలో ఇలాంటివి 17 వరకు ఉన్నాయి. ఇవి అధికారికంగా నిర్వహిస్తున్నారా? అనధికారికంగా నిర్వహిస్తున్నారా? అనే అనుమానాలు లేకపోలేదు. అయినా ఇలాంటి వాటిని వదిలేసి, కేవలం ల్యాబ్‌లు, ఏఆర్‌టీ క్లినిక్‌లనే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేయడం విస్మయానికి గురిచేస్తోంది. సృష్టి వ్యవహారం వెలుగులోకి వచ్చాక రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఐవీఎఫ్ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారుల్లో మాత్రం స్పందన లేదు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలపై అనేక ఆరోపణలు ఉన్నాయి. వీటిపై పూర్తిస్థాయిలో దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

సృష్టి మూలాలు ఇక్కడ ఉన్నాయా?

సృష్టి ఫెర్టిలిటీ వ్యవహారంపై హైదరాబాద్ పోలీసులు లోతుగానే విచారణ జరుపుతున్నారు. దీనికి మిగతా 4లో..

సంచలనమైనా స్పందన లేదు

సృష్టి ఫెర్టిలిటీ వ్యవహారం సంచలనమైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుమారు వారం అవుతున్నా ఇప్పటికీ జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలపై తనిఖీలు చేసింది లేదు.

రైతుల మోముల్లో ఆనందం

నేడే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమ

విజయవాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లక్షా18వేల629 మంది రైతుల ఖాతాల్లో రూ.8.77 కోట్ల అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదును రాష్ట్ర ప్రభుత్వం శనివారం జమ చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు రూ.5 వేలను రాష్ట్ర ప్రభుత్వం, పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.2 వేలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ఎ.కొండూరు మండలంలోని 8,108 మంది రైతులకు రూ.5.51 కోట్లు, గంపలగూడెం మండలంలో 10,229 మంది రైతులకు రూ.6.94 కోట్లు, తిరువూరు మండలంలో 7,851 మంది రైతులకు రూ.5.36 కోట్లు, విస్సన్నపేట మండలంలో 7,470 మంది రైతులకు రూ.4.98 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 3,237 మందికి రూ.2.08 కోట్లు, జి.కొండూరులో 7,558 మందికి రూ.5.14 కోట్లు, మైలవరంలో 7,389 మందికి రూ.5.06 కోట్లు, రెడ్డిగూడెంలో 8,395 మందికి రూ.5.49 కోట్లు, విజయవాడ రూరల్‌లో 3,662 మందికి రూ.2.42 కోట్లు, కంచికచర్లలో 6,498 మందికి రూ.4.45 కోట్లు, చందర్లపాడులో 10,671 మందికి రూ.7.25 కోట్లు, వీరులపాడులో 7,126 మందికి రూ.4.93 కోట్లు, నందిగామలో 5,921 మందికి రూ.4.09 కోట్లను ప్రభుత్వం జమ చేయనుందని వెల్లడించారు.



ఆటో మ్యుటేషన్ విప్లవాత్మకం
- పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలు
- సమయం, డబ్బు ఆదా : కలెక్టర్ లక్ష్మీశ


6

రైల్వేస్టేషన్ పరిశుభ్రంగా ఉండాలి
- స్వచ్ఛతా అభియాన్‌లో డీఆర్ఎం మోహిత్ సోనాకియా

6

ఊరు దాటిన సేవలు!
- తుమ్మలపాలెం సచివాలయానికి ఈలప్రోలు గ్రామస్థులు

4



ప్రకాశం బ్యారేజీ వద్ద సముద్రంలోకి వృథాగా పోతున్న నీరు

ఓవైపు లక్షల క్యూసెక్కుల కృష్ణానది నీరు కడలిపాలవుతోంది. మరోవైపు చుక్కనీరు లేక ఎకరాలకు ఎకరాలు నెర్రలిస్తున్నాయి. చెంతనే నిండుకుండలా నీరు ఉబికి వస్తున్నా.. వరి పైరుకు చుక్కనీరు చిక్కలేని విచిత్ర పరిస్థితులు జిల్లా అన్నదాతలను కన్నీటిలో ముంచేశాయి. కొద్దిరోజులుగా వరుణుడు ముఖం చాటేయడం, ఎండలు మండిపోతుండటం, ఎగువ ప్రాంత రైతులు సాగునీటిని దిగువకు రానీయకపోవడం వంటి కారణాల వల్ల పామర్రు, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. నీటిపారుదల శాఖ అధికారుల అనాలోచితన నిర్ణయాల వల్లే ఇలా జరుగుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మచిలీపట్నం/కూచిపూడి, ఆంధ్రజ్యోతి



మొవ్వ మండలంలోని యద్దనపూడి, పెదసనగల్లు గ్రామాల్లో నెర్రలిచ్చిన వరి పొలాలు

నీరంతా వృథా.. ఊరంతా వ్యథ..

కృష్ణాజిల్లాలో కొనసాగుతున్న నీటి ఎద్దడి

బ్యారేజీ నుంచి రోజూ లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి..

- కృష్ణమ్మ చెంతే ఉన్నా వరిపైరుకు చుక్కనీరు అందని దుస్థితి
- కాల్వల్లో తూడు పేరుకుపోవడంతో నీరు పారని దీనావస్థ
- కంకిపాడు వద్ద ఇప్పుడు తూడు, నాచు తొలగింపు పనులు
- వరద నీరు వస్తున్న సమయంలో అధికారుల హడావిడి తంతు
- నీరందక నెర్రలిచ్చిన మొవ్వ మండలంలోని పంట పొలాలు
- పెడన నియోజకవర్గంలోని రైతుల పరిస్థితి కూడా ఇంతే..
- పంటలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే కాగిత వద్ద ఆవేదన

మొవ్వ మండలంలో నెర్రలిచ్చిన పొలాలు

మొవ్వ మండలంలోని కూచిపూడి, యద్దనపూడి, మొవ్వ, పెదముత్తేవి, ఐనంపూడి, కారకంపాడు తదితర గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు అందట్లేదు. వీరంకిలాకు సెక్షన్ నుంచి ఈ గ్రామాల్లోని పొలాలకు బీమనది, మిగతా 4లో..

పెడన నియోజకవర్గంలోనూ నీటి ఎద్దడి

పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో రైతులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులతో కలిసి ఎమ్మెల్యే కాగిత శుక్రవారం కౌతవరం లాకుల వద్దకు వెళ్లారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బంటుమిల్లి కెనాల్‌కు 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, కేవలం 450 క్యూసెక్కులే విడుదల చేస్తుండటంపై నీటిపారుదల శాఖ డీఈ ఎస్.శ్రీనును ఆయన నిలదీశారు. పెడన నియోజకవర్గంలోని భూముల్లో చౌడుశాతం అధికంగా ఉంటోందని, సాగునీటిని సక్రమంగా విడుదల చేయకపోవడంతో ఎండల తీవ్రతకు వెదజల్లే పద్ధతిన సాగుచేసిన వరిపైరు ఎండిపోతోందని ఎమ్మెల్యే అధికారులతో అన్నారు. బంటుమిల్లి కెనాల్‌కు సక్రమంగా సాగునీటిని అందజేయాలని అధికారులను ఆదేశించారు. కైకలూరు తదితర ప్రాంతాల్లోని చేపల చెరువులకు నీటిని విడుదల చేసి, పెడన నియోజకవర్గంలోని పొలాలకు విడుదల చేయకపోవడం ఏమిటని నిలదీశారు.



వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఆలయ ముఖద్వారం

వైభవంగా దుర్గామల్లేశ్వరుల నిత్య పూజలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరులకు శ్రావణ శుక్రవారం నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కనకదుర్గమ్మకు ప్రీతిపాత్రమైన శుక్రవారం పురస్కరించుకుని భక్తులు లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కళ్యాణం పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రావణ రెండో శుక్రవారం సందర్భంగా ఆలయం లోపల, ప్రధాన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పుష్పాలంకరణలు చేశారు. వివిధ రకాల పూలతో అలంకరణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కుంకుమార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందారు. ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణ నెలకొంది. ఈనెల 8న వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని ప్రధానాలయంలో అమ్మవారిని శ్రీవరలక్ష్మీదేవిగా అలంకరణ చేస్తారు.



కొండపై భక్తుల రద్దీ

పవిత్ర శ్రావణ మాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. రద్దీని నియంత్రించడానికి ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. పలువురు భక్తులు పొంగళ్లు సమర్పించారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను అధికారులు పర్యవేక్షించారు.



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

అన్నదాన పథకానికి విరాళాలు

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు శుక్రవారం విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. రాజమండ్రికి చెందిన ఎం.ప్రేమ్ కుమార్ రూ.1,00,116లు, విజయవాడ పటమటకు చెందిన ఎం.వెంకటలక్ష్మి వారి కుమారుడు ఎం.శ్రీనివాస్, కోడలు లలిత పేరున రూ.1,00,116లు విరాళంగా అందజేశారు.

వైసీపీ పాలనలో మాఫియా రాజ్యం

» భారీగా ఇసుక, మద్యం దోపిడీ
» దేవినేని ఉమామహేశ్వరరావు



ఆంధ్రజ్యోతి కథనాలను చూపుతున్న దేవినేని ఉమా

వన్‌టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో మాఫియా రాజ్యం కొనసాగింది, భారీగా ఇసుక, మద్యం దోపిడీ జరిగిందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో స్కామ్‌లు దాపరికం లేకుండా జరిగాయని ఆరోపించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సిట్ ఉన్నగ్రహ చిత్రాల ఆధారంగా వెల్లడించిందన్నారు. ఇప్పటి వరకు 1.22 కోట్ల టన్నుల ఇసుక అక్రమ తవ్వకాలు బహిర్గతమయ్యాయని, ఇంకా 2.69 కోట్ల టన్నుల వివరాలు తేల్చవలసి ఉందన్నారు. మొత్తం విలువ రూ.4వేల కోట్లకు పైగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇసుక దోపిడీకి వైసీపీ బ్యాచ్, ఆతడి కుమారుడు, ముఠా కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. వీటిపై సిట్ విచారణ జరపాలని, అమెరికాలో ప్రారంభించిన రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లాలోనే నెలకు రూ.22కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పం కట్టారని విమర్శించారు. పెట్టెలు పెట్టెలుగా డబ్బులు తరలించారని, ఆ డబ్బులు కంటైనర్‌లో ఎక్కడకు వెళ్లాయో తేల్చాలని, బెంగుళూరు ప్యాలెస్‌లో ఎంతెంత నల్లధనం దాచారో తేల్చాలని డిమాండ్ చేశారు.

సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి

» జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరి



వన్‌టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు పక్షపాతి అని ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న నీటి పన్ను బకాయిలపై 85 కోట్ల వడ్డీని కూటమి ప్రభుత్వం మాఫీ చేయడంపై రైతాంగం హర్షం వ్యక్తం చేసిందన్నారు. చంద్రబాబు రైతు పక్షపాతి అన్నారు. అన్నదాత సుఖీభవ రేపటి నుంచి రైతుల ఖాతాల్లో జమవుతుందని, కేంద్రం ఇచ్చే రూ.2వేలతో కలిపి రూ.7వేలు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తుందని తెలిపారు. వేల్పూరి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 450 కోట్లు విడుదల చేయడంపై రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారన్నారు. జగన్ రెడ్డి పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రైతులకు అందవలసిన బీమా సొమ్మును కూడా వక్రమార్గంలో పట్టించారని, రైతులు పండించిన మామిడికాయలను పరామర్శించ పేరుతో రోడ్లపై పోయించి, ట్రాక్టర్లతో తొక్కించి అవమానించారన్నారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి కానిస్టేబుల్ జాబ్స్



శ్రావణి, సరస్వతి

విస్సన్నపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పుట్రేల గ్రామంలో ఒకే కుటుంబం నుంచి ఐదుగురు పోలీసు ఉద్యోగాలు సాధించారు. శుక్రవారం విడుదలైన ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఎన్టీఆర్‌జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన అంగటి శ్రావణి, అంగటి సరస్వతిలు కానిస్టేబుల్ (సివిల్) ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2014లో వీరి సోదరి అంగటి మాధవి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అంగటి వెంకట కృష్ణారావు 2013లో, మొగిలి మురళీకృష్ణ 2018లో సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. ఒకే కుటుంబం నుంచి ఐదుగురు పోలీస్ విభాగంలో విధులు నిర్వహించడం గర్వంగా ఉందని గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఊరు దాటిన సేవలు!

» తుమ్మలపాలెం సచివాలయానికి ఈలప్రోలు గ్రామస్తులు
» అధికారుల అనాలోచిత నిర్ణయంతో అవస్థలు

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ఈలప్రోలు గ్రామస్తులకు ఇబ్బందికరంగా మారింది. ఆరేళ్లుగా సచివాలయ సేవలు పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామాన్ని తుమ్మలపాలెంలో కలిపి అధికారులు చేతులు దులుపుకున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయం ఈలప్రోలు గ్రామస్తులకు తలనొప్పిగా తయారైంది. రెండుగ్రామాల మధ్య సుమారుగా ఏనిమిది కిలోమీటర్ల దూరం ఉంది. పైగా ఈలప్రోలు నుంచి తుమ్మలపాలెం రావాలంటే మధ్యలో రైల్వే గేటు, విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి దాటాలి. ఈలప్రోలు పక్కనే ఉన్న గుంటుపల్లిలోగాని, పక్కనే ఉన్న కొండపల్లి సచివాలయంలోగాని కలిపితే ప్రజలకు ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు చెబుతున్నారు.

ఇబ్బందులు తప్పడంలేదు..

సచివాలయం ద్వారా సేవలు పొందేందుకు ఈలప్రోలు గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంత దూరాన ఉన్న సచివాలయానికి వెళ్లి పనులు చేయించుకోవాలంటే రోజంతా పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది సైతం ఈలప్రోలు గ్రామం వెళ్లాలంటే దూరాభారం కారణంగా గ్రామస్తులే ఆక్కడికి వెళ్లక తప్పని పరిస్థితి. ఈలప్రోలు గ్రామానికి సమీపంలో ఉన్న కొండపల్లి, గుంటుపల్లిలో కలపాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

ప్రత్యేక సచివాలయం చేయాలి

ఈలప్రోలు గ్రామానికి ప్రత్యేక సచివాలయం ఏర్పాటు చేయాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. గ్రామంలో జనాభా సుమారు 2,500 మంది. పక్కనే కొత్తగా ఏర్పడిన కాలనీలలో మరో 1,000 మంది వరకు ఉంటుంటే సచివాలయంగా చేస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



తుమ్మలపాలెం గ్రామంలోని సచివాలయం

ఎవరూ పట్టించుకోవడం లేదు



– వల్లూరి కిషోర్ కుమార్ (ఈలప్రోలు)

ఎక్కడో దూరంగా ఉన్న తుమ్మలపాలెంలో సచివాలయానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. సచివాలయాల వ్యవస్థ ప్రారంభమైనప్పుడే గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదు. అనేక మార్లు అర్జీలు పెట్టినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తుల ఇబ్బందులను తొలగించాలి.

వృద్ధులు, పిల్లలకు మరింత ఇబ్బంది



దామా హనుమంతరావు (ఈలప్రోలు)

తుమ్మలపాలెం వెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. పైగా రైల్వే ట్రాక్, నేషనల్ హైవే దాటి సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి. ప్రజలకు మేలు చేయాలంటే సచివాలయం దగ్గరలో ఉండాలి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సచివాలయాన్ని సమీప గ్రామాల్లో కలపాలి.



సభలో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు ఏం తెచ్చారు!

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం

జగ్గయ్యపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గతంలో దేశ ప్రధానులుగా చేసిన నెహ్రూ నుంచి మన్మోహన్ వరకు ఎవరూ అమెరికాకు ఇంతలా భయపడలేదని, ప్రధాని మోదీ పిరికితనం వల్ల దేశానికి నగుబాటు తప్పడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ప్రపంచ వేదికలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తానే భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ఆపానని చెబుతుంటే.. రష్యాతో వ్యాపారం చేస్తున్నందుకు 25శాతం సుంకం విధిస్తే ఉండలేదని, నోరు మెదపని ప్రధానిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌లతో పోటీగా ప్రశంసిస్తున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం జగ్గయ్యపేటలో జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభల సందర్భంగా పొట్టి శ్రీరాములు చౌక్‌లో జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 2014లో అధికారం చేపట్టిన మోదీ 11 సంవత్సరాల్లో ఒక్క హామీనైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. విదేశాల నుంచి ఎంత నల్లధనం వెలికితీశారు, 2కోట్ల మందికి ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారు, ధరలు తగ్గించారా.. ఏం చేశారని నిలదీశారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

» సీపీ రాజశేఖరబాబు



దసరా బందోబస్తుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. గత ఏడాది జరిగిన చిన్నచిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు బందోబస్తు చర్యలపై శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ఏడాది జరిగిన ఉత్సవాల తీరు, హాజరైన భక్తుల సంఖ్య, భక్తులకు ఏర్పాటు చేసిన వసతులు, ఏఏ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు.. అనే అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమావేశానికి హాజరైన డీసీపీలు, ఏడీసీలు, ఆలయ అధికారులు పరిశీలించారు. ప్రధానంగా గత ఏడాది మూలా నక్షత్రం, దసరా రోజు ఊహించని రీతిలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చినట్టు గుర్తించారు. భక్తులు ఏఏ ప్రాంతాల నుంచి ఏ మార్గం ద్వారా ఆలయానికి చేరుకున్నారు.. ఆలయానికి చేరుకునేందుకు భక్తులు పడిన ఇబ్బందులను అధికారులు గ్రహించారు. ఈ ఏడాది ట్రాఫిక్ పరంగా భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 3,635 మంది పోలీసులు ఉన్నారని, వీరిలో రెండు వేల మందిని దసరా ఉత్సవాలకు కేటాయిస్తామన్నారు. అదనంగా కృష్ణా జిల్లా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి పోలీసులను తీసుకొచ్చి, గత ఏడాది మాదిరిగానే ఐదు వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దసరా డ్యూటీ చేసే పోలీసులకు ఈ-డిప్లాయిమెంట్ యాప్‌లో డ్యూటీ వేయడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది 11 రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా సాధారణ భక్తులు సైతం అమ్మవారిని సజావుగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. క్యూలైన్లు, స్నానపు ఘాట్లు, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఆలయ ఈవో శీనానాయక్, డీసీపీలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ప్రసాద్, ఏడీసీపీలు రామకృష్ణ, ప్రసన్నకుమార్, కోటేశ్వరరావు, ఏసీపీలు దుర్గారావు పాల్గొన్నారు.

మినీ బ్యారేజీలేవీ?

(3వ పేజీ తరువాయి)

అనుమతి ఇచ్చింది. ఒక్కో బ్యారేజీలో 4.5 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేలా సామర్థ్యాన్ని నిర్దేశించింది. ఇక్కడ మినీ బ్యారేజీ నిర్మిస్తున్నామని కేంద్ర జలవనరుల శాఖకు, కృష్ణానది నీటి యాజమాన్య బోర్డుకు లేఖలు రాసి హడావిడి చేసింది. అంతకుమించి ఒక్క అడుగును ముందుకు వేయలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా మినీ బ్యారేజీలకు మోక్షం కలిగిస్తుందా, లేదా.. అని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

ఇదీ 'మినీ' ప్రయోజనం

మినీ బ్యారేజీల నిర్మాణంతో ఆటు మోపిదేవి, ఇటు చోడవరం వద్ద పరిస్థితులు పూర్తిగా మారతాయని భావిస్తున్నారు. చోడవరం, మోపిదేవి వద్ద బ్యారేజీలో ఒక్కోదాంట్లో 4.5 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా నిర్మించాలని నాడు వైసీపీ నిర్ణయించింది. పెనమలూరు మండలంలోని గ్రామాలను ఆనుకుని కృష్ణానది.. సముద్రం నరిహద్దు వరకు ప్రవహిస్తుంది. అయినా.. చోడవరం, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బోర్లు తవ్వినప్పుడు వచ్చే జలాల్లో స్వచ్ఛత ఉండట్లేదు. మోపిదేవి, అవనిగడ్డ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి మరోలా ఉంది. పోటు సమయంలో సముద్రపు నీరు నదిలోకి వచ్చి చేరుతోంది. ఇక అల్పపీడనాల సమయంలోనూ సముద్రపు నీరు రోజుల తరబడి నదిలో ఉంటోంది. ఈ కారణంగా ఆ పరిసర ప్రాంతాల్లోని భూములు చౌడు బారుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ-చోడవరం బ్యారేజీ-మోపిదేవి బ్యారేజీల మధ్య ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చేస్తే ఈ పరిస్థితులు మారతాయని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు. వరదల వల్ల వృథాగా పోయే నీటిని నిల్వ చేయడానికి కూడా ఉపయోగపడతాయని అంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం బెజవాడ వైపు చూస్తుందా, ప్రత్యామ్నాయం చూస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాణం మీదకు తెచ్చిన ఫేస్‌బుక్ స్నేహం

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్ స్నేహం ఒక యువకుడి ప్రాణం మీదకు తెచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. గుడివాడ మండలం తటివర్రు గ్రామానికి చెందిన కొల్లూరి సంపత్‌కుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఫేస్‌బుక్ ద్వారా మచిలీపట్నానికి చెందిన యువతితో పరిచయం ఏర్పడి నిత్యం చాటింగ్ చేసేవాడు. ఇటీవల రాజు అమెను పెళ్లి చేసుకుంటానని చెప్పటంతో సదరు యువతి ముఖం చాటేసింది. దీంతో మనస్తాపానికి గురైన సంపత్ కుమార్ గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న స్నేహితుడు యువరాజ్ సంపత్‌ను గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రభుత్వాసుపత్రి వైద్యుల సూచన మేరకు విజయవాడ తరలించారు.

నీరంతా వృథా.. ఊరంతా వ్యథ

(3వ పేజీ తరువాయి)

ఐనంపూడి కాల్వల ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. కంకిపాడు వద్ద ప్రధాన కాల్వలో తూడు, నాచు పేరిపోయాయని, వాటిని తొలగించే పనులు కొద్దిరోజులుగా చేస్తుండటంతో ఈ ప్రాంతాలకు నీటి విడుదలను తగ్గించామని అధికారులు చెబుతున్నారు. పదిహేను రోజులుగా బీమవరం, ఐనంపూడి పంటకాల్వలకు నీటి విడుదలను నిలిపివేయడంతో పంట పొలాలు నెర్రెలిచ్చి వెక్కిరిస్తున్నాయి. పొలాలు నెర్రెలిచ్చాయని, పైరు ఎండిపోయే పరిస్థితికి దగ్గరకు చేరిందని నీటిపారుదల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని చెప్పడమే తప్ప.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుచేసి పరిసాగు చేశామని, పొలాలు నెర్రెలు ఇచ్చేంతగా ఎండిపోయినా నీటిపారుదల శాఖ అధికారులు తమగోడును వినడం లేదని పెదనగిరు నీటిసంఘం అధ్యక్షుడు యద్దనపూడి రాజశేఖర్‌తో పాటు పలు గ్రామాల రైతులు వాపోతున్నారు.

సముద్రంలోకి 189 లక్షల క్యూసెక్కులు

ప్రకాశం బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 1.89 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన కాల్వలకు పూర్తిస్థాయిలో 17 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని అంటున్నారు. పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ, కూచిపూడి, పెదముత్తేవి తదితర ప్రాంతాలకు బీమవరం, ఐనంపూడి కాల్వ ద్వారా సాగునీరు అందించాల్సి ఉందని, ఒకటి, రెండు రోజుల్లో నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని చెబుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

» ఎస్‌డబ్ల్యూఫ్

బస్‌స్టేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ప్రారంభించనున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలులో భాగంగా ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, టి.పద్మాబిరామ్ దౌర ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ కమిషనర్‌ను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని నిర్ణయించడం సంతోషకరమని, ఈ పథకం అమలు ద్వారా మహిళా స్వయం నిర్ణయాలు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి గడ్కరీ దుర్గగుడికి రాక

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన నగరానికి విచ్చేసి దుర్గగుడిలో అమ్మవారిని దర్శించుకోనున్నారు. దేవస్థానం అధికారులు, వన్‌టౌన్ పోలీసులు దేవాలయ ప్రాంగణంలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రోలర్ స్కేటర్ల ప్రతిభ

లబ్బీపేట(స్పోర్ట్స్)ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొరియాలోని జెయిచోన్‌లో జరుగుతున్న 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో వివిధ వయసుల, ఈవెంట్లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రోలర్ స్కేటర్లు అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాల జాబితాలో 8వ స్థానంలో నిలిచారని ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి. దామస్ తెలిపారు. క్యాడెట్ కాటగిరీలో 1 స్వర్ణం, 3 రజతం, సీనియర్ కాటగిరీలో 1 స్వర్ణం, 1 రజతం, 3 కాంస్య పతకాలు సాధించారని, పతకాలు సాధించిన క్రీడాకారులు రవీల్, దినేష్, దినేష్, క్షేత్ర, జెస్సి రాజ్, హరికమల్, అన్విష, సైసహిత్, గ్రీష్మ, చేమోయిని అభ్యని, సాయి కార్తిక్‌లను ఆర్.ఎస్.ఎ.ఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీరోడ్, ఏపీ.ఆర్.ఎస్.ఏ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బి. మురళీకృష్ణ లు అభినందించారు.

ఏపీలో 16 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులు

» లోక్‌సభలో ఎంపీ కేశినేని అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సమాధానం

వన్‌టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా అత్యాచారాలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసులను వేగంగా పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు (ఎఫ్‌టీఎస్‌సీఎస్) ఇప్పటి వరకు లక్షలాది కేసులను పరిష్కరించాయని.. దేశవ్యాప్తంగా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు 725 ఉన్నాయి. వీటిలో 392 ప్రత్యేక పోక్సో కోర్టులు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాల్లో 5.38 లక్షలకు పైగా కేసులు దాఖలవగా 3.34 లక్షలకు పైగా పరిష్కరించామని శుక్రవారం లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ శాఖ, న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలవుతున్న ఈ పథకం 31 మార్చి 2026 వరకు కొనసాగుతుందని, దేశ వ్యాప్తంగా 790 కోర్టులు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో రూ.1,952.23 కోట్లు ఖర్చు చేయనున్నట్టు, ఇందులో రూ.1207.24 కోట్లు కేంద్ర భాగంగా నిర్భయ నిధి నుంచి వెచ్చించనున్నట్టు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు ఆంధ్రప్రదేశ్‌లో 16 ఉన్నాయని, 2019 నుంచి ఇప్పటి వరకు ఏపీకి రూ.1.88కోట్లు మాత్రమే విడుదల చేసినట్టు వివరించారు. దేశవ్యాప్తంగా 2019నుంచి ఇప్పటి వరకు రూ.1034.55 కోట్లు విడుదల చేసిందని, ఇక ఏపీలో ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు పోక్సో కేసులు పరిష్కరించడానికి సగటున 257 రోజుల సమయం పట్టిందన్నారు. మౌలిక వసతుల పెంపుకోసం కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. 2014లో దేశ వ్యాప్తంగా 15,818 కోర్టు హాల్స్ ఉండగా, ప్రస్తుతం అవి 22,372కి, నివాస యూనిట్లు 19,851కి పెరిగాయన్నారు. అదనంగా 3,128 కోర్టు హాల్స్, 2,772 నివాస యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఎఫ్‌టీఎస్‌సీల పనితీరును పర్యవేక్షించడానికి రాష్ట్రాలు, హైకోర్టులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు కేసుల సమయపూర్వక పరిష్కారం కోసం కేంద్రం లేఖలు పంపిందని ఆయన పేర్కొన్నారు. న్యాయమూర్తుల, సిబ్బంది నియామకం రాష్ట్ర ప్రభుత్వాలు, హైకోర్టుల బాధ్యతేనని, సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ఉత్తుత్తి తనిఖీలు

(3వ పేజీ తరువాయి)

సంబంధించిన మూలాలు నగరంలోనూ ఉన్నట్టు గుర్తించారు. నగరంలోని యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్, డాక్టర్ నమ్రతకు చెందినదిగా పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ కేంద్రాన్ని సుమారు 27 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్టు తేలింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేసి ఉంటే యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ బాగోతాలు బయటపడేవి. పోలీసులు విచారణ చేసే వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. అసలు జిల్లాలో ఎన్ని ఫెర్టిలిటీ సెంటర్లు ఉన్నాయి, వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు, అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాలను తనిఖీ చేయాల్సిన అధికారులు కనీసం ఆయా సెంటర్లలోకి వెళ్లి లోతుగా దర్యాప్తు చేసిన దాఖలాలు లేవు. సృష్టి వ్యవహారం వెలుగులోకి వచ్చాక కేవలం నమ్రతకు చెందిన యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్‌ను తప్ప మిగిలిన సెంటర్లపై తనిఖీలు చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి. నిరుపేద మహిళలే లక్ష్యంగా సరోగసీ నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యమే నిదర్శనం

(3వ పేజీ తరువాయి)

లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఉంది.

అధికార, అనధికార దర్శనాలు ఎందుకు అనుమతించాలి?

కొండరు దర్గా అంతరాలయ దర్శనాలు చేసుకుంటుంటే, ఎందరో సామాన్య భక్తులు క్యూలైన్లలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉత్సవాల్లో చాలామంది నేరుగా వినరాజగోపురం వద్దకు వచ్చేస్తున్నారు. లోపలికి పంపించే వారికి పట్టుబడుతున్నారు. ఈ అంతరాలయ దర్శనానికి రూ.500 టికెట్ కొనుగోలు చేసిన వారి క్యూ కూడా ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఉత్సవాల్లోనూ రూ.500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు, అనధికార అంతరాలయ దర్శనాలు చేసుకునే వారి మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

గుణదల శ్రీ మద్దిరావమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

భారతీనగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా గుణదల శ్రీ మద్దిరావమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు ఉచిత శిక్షణ

భారతీనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల ఐటీఐ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు, నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన చదివిన అభ్యర్థులు శిక్షణకు అర్హులని, ఈ నెల 14లోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రం అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్, ఫోన్ నెంబరుతో ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.



నలందలో శ్రావణలక్ష్మీ పోటీలు

లబ్బీపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థినులకు శ్రావణలక్ష్మీ పోటీలను నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్స్‌పాల్ అనురాధ శ్రావణలక్ష్మీ పోటీలు నిర్వహించి ఎంపికైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వై. శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న విమల భాను

ఉదయభాను పుట్టినరోజు వేడుకలు

గుణదల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పుట్టిన రోజును పురస్కరించుకుని ఉదయభాను సతీమణి సామినేని విమలభాను శుక్రవారం గుణదలలోని విజయమేరీ అంధుల పాఠశాలను సందర్శించారు. పిల్లల సమక్షంలోనే కేక్‌కట్ చేయించి అందరికీ పంచారు. చిన్నారులతో గడిపారు. మ్యూజిక్ సిస్టంను విమలభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలలకు అందజేశారు. బెస్ట్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ తేజ, నందిగామ జనసేన ఇన్‌చార్జి తంబపల్లి రమాదేవి, జ్యోతిక తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతా: ఎమ్మెల్యే గద్దె

లబ్బీపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న లబ్బీపేటలోని సమస్యలపై తాను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం 19వ డివిజన్‌లోని ఫైడయ్య వీధి చివర సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తొలి అడుగు కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. డివిజన్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మించాలని స్థానికులు కోరారని దానిని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భాగం సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





చెత్తమయం ...

- ఆటోనగర్‌లోని అన్ని వీధుల్లో పేరుకున్న చెత్తకుప్పలు
- పారిశుధ్య సిబ్బంది కొరత
- రోజూ అరకొర పనులే
- దృష్టిపెట్టని ఐలా అధికారులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

ఆటోనగర్,ఆంధ్రజ్యోతి: ఎంతో పేరుప్రతిష్ఠలు ఉన్న విజయవాడ ఆటోనగర్‌లో అడుగడుక్కి చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆటోనగర్ చెత్తమయంగా మారింది. గాలికి చెత్తకుప్పల నుంచి వ్యర్థాలు దుకాణాలు, ఇళ్లు, కార్ఖానాల్లోకి వెళ్లి స్థానికుల అనారోగ్యాలకు కారణమవుతోంది. దుమ్ము వాహనచోదకుల కళ్లల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆటోనగర్‌లో చెత్తకుప్పల సమస్య పరిష్కారం కావడం లేదు.





ఆటోనగర్ ఫైర్‌స్టేషన్, ఆర్టీసీ బస్ టర్మినల్ చెంతనే చెత్తకుప్పలు

పారిశుధ్య సిబ్బంది కొరత

ఆటోనగర్ ఐలా పరిధిలో పారిశుధ్య సిబ్బంది కొరత అధికంగా ఉంది. సుమారు 325 ఎకరాల్లో 20కిలో మీటర్లు పొడవును రోడ్లు ఉన్న జవహర్ ఆటోనగర్‌లో చెత్తను తీసేందుకు కేవలం 48 మంది అవుట్‌సోర్స్ పారిశుధ్య కార్మికులే ఉన్నారు. వీరు ఆటోనగర్‌లో చెత్తను తొలగించడంతోపాటు మైనర్ డ్రెయినేజీల్లో ఉన్న పూడికలను కూడా తొలగించాలి. ఉన్న కొద్దిపాటి పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ అన్ని పనులు చేయలేకపోవడం వల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం 150 మంది వరకు పారిశుధ్య కార్మికులు ఉండేవారు. నేడు వారి సంఖ్య 48కి పడిపోయింది. రోజురోజుకూ పారిశుధ్య సమస్య జటిలం అవుతున్నా సిబ్బంది సంఖ్య మాత్రం పెరగకపోవడం శోచనీయం. ఐలా కమిషనర్ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పదవి కూడా నిర్వర్తిస్తూ ఉండటంతో ఆటోనగర్‌లోని పారిశుధ్య సమస్యపై దృష్టిపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు గత మూడేళ్లగా ఐలా పాలకవర్గం లేకపోవడంతో సమస్యలు పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆటోనగర్‌లో పారిశుధ్య సమస్య తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు

స్పౌజ్ పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



13వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న గద్దె రామ్మోహన్



లబ్ధిదారులకు పెన్షన్‌లు అందజేస్తున్న కొక్కెర తిరుపతయ్య తదితరులు

పటమట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు రూ.వెయ్యి పెంచారని, ఇప్పుడు జీవిత భాగస్వామి చనిపోయిన వారి భార్యలకు (స్పౌజ్ పింఛన్లు) పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. శుక్రవారం 13వ డివిజన్ తోట వారి వీధి సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నూతి శ్రీను, అడ్డకట్ల రామారావు పాల్గొన్నారు.

283 సచివాలయం పరిధిలో..

14వ డివిజన్ పటమట ఎస్ఎస్ఎం స్కూల్ వెనుక 283 సచివాలయం పరిధిలో స్పౌజ్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గద్దె క్రాంతికుమార్ పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షులు నర్రా కిషోర్, గరికపాటి శ్రీనివాస్, కర్నా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట: సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కూటమిప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుందని టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య యాదవ్ అన్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లోని 83వ సచివాలయ పరిధిలో కొత్త పెన్షన్లను(స్పౌజ్ పెన్షన్లు) శుక్రవారం పంపిణీ చేశారు. గండ్ర రాజు, మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

చెన్నుపాటి రామకోటయ్య స్టేడియాన్ని

షూటింగ్ కోసం సిద్ధం చేయండి

కమిషనర్ ధ్యానచంద్ర



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో షూటింగ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయమని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. శుక్రవారం తన పర్యటనలో భాగంగా బందరు రోడ్డులోని డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలోని స్టేడియం అన్నింట్లో అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని, అన్ని రకాల సదుపాయాలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో ఈఈ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు తెలపండి

బెంజిసర్కిల్: నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులున్నా తమకు నేరుగా తెలపాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఎంజీ రోడ్డు, బెంజిసర్కిల్, పటమట, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. వ్యర్థాలు సేకరించే సమయంలో తలెత్తే ఇబ్బందులు, పనిముట్లు, తోపుడు బండ్లు ఉన్నాయా తదితర విషయాలపై పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా తాము వెనుకాడమని కమిషనర్ తెలిపారు.

లయోలాలో దృష్టిలోపం ఉన్న

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న ఆర్.సుందర్ కుమార్, రెక్స్ ఏంజెలో, ఫాదర్ మెల్చియోర్,తదితరులు

భారతీనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాలలో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు శుక్రవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. సశ్విత హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్(హెచ్‌టీబీఎఫ్), ప్రత్యేక అవసరాలు గల వ్యక్తుల కోసం ఉన్నత విద్య (హెచ్‌ఈపీఎస్ఎన్) ఆధ్వర్యంలో కళాశాలలో హెచ్‌ఈపీఎస్ఎన్ రిసోర్స్ సెంటర్‌లో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నైలోని హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ ట్రస్ట్ అధినేత ఆర్.సుందర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడంలో ల్యాప్‌టాప్‌లు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఎ.రెక్స్ ఏంజెలో, హెచ్‌ఈపీఎస్ఎన్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సహాయభాస్కరన్ మాట్లాడారు. అనంతరం దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు 12 ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ప్రిన్సిపల్ ఫాదర్ ఎస్.మెల్చియోర్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థి నాగబాబు, దృష్టి లోపం ఉన్న విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ తిరుపతమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం,ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ తిరుపతమ్మ ఆశీస్సులు అందరికి ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాస రెండో శుక్రవారం ఉత్సవాలను తొలుత అఖండ దీపారాధనతో జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతులు ప్రారంభించారు. ఎన్నారై కొమ్మ రామ్మోహనరావు, శేషగిరి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు మాను పూజ చేశారు. పాలు పొంగళ్లు, సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, తహసీల్దార్ కేవీ శివయ్య దంపతులు విశేష పూజలు చేశారు. వారికి శేష వస్త్రాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అందజేశారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, గూడపాటి తులసీమోహన్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ప్రభల ఊరేగింపు

లక్ష్మీ తిరుపతమ్మ వార్షిక సంబరం శుక్రవారం వైభవంగా జరిగింది. యాదవుల రామాలయంలో యాదవుల సంఘాల నాయకుడు చిమట గంగాధర్, జనసేన జిల్లా జాయింట్‌సెక్రటరీ చిమట రవివర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి ప్రభ బండిని ప్రారంభించారు. భక్తుల రద్దీతో జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సీఐలు శివప్రసాద్, పెద్దిరాజులు చర్యలు చేపట్టారు. అనంతరం ప్రభ బండ్లు ప్రదర్శనగా పాత గన్నవరంలోని ఆలయానికి చేరుకున్నాయి. రాత్రికి గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గ్రామోత్సవాన్ని ప్రారంభిం చారు.

ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు

చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్



వైసీపీ నేత నిర్మించిన షాపులు

లబ్బీపేట,ఆంధ్ర జ్యోతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంకా వైసీపీ నాయకులకు జీ హుజూర్ అంటూ వ్యవహరించడంపై స్థానిక కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 17వ డివిజన్‌లో వైసీపీ చోటా నేత తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా షాపులు నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణానికి తోడు సమీపంలో మరొకరు వైసీపీ నాయకుల అండతో కమర్షియల్ ప్లాన్ తీసుకోకుండా షాపులు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు

- 908 కేజీల ప్లాస్టిక్ సీజ్
- రూ.3.45 లక్షల జరిమానా

కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని హోల్‌సేల్ షాపుల్లో నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం తనిఖీలు చేసి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 908 కేజీల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానుల నుంచి రూ.3,45,700 జరిమానా వసూలు చేశారు. మూడు సర్కిల్స్‌లో 10 బృందాలు దాడులు నిర్వహించాయి.

పూడుకుపోయిన డ్రెయినేజీ ...దుర్వాసనతో అవస్థలు

పటమట, ఆంధ్రజ్యోతి: దర్శిపేట ఐదురోడ్ల జంక్షన్ నుంచి రాజరాజేశ్వరీ కళ్యాణ మండపం వెనుకవైపు నుంచి మాబూసుభానీ జెండా చెట్టు వద్దకు వచ్చే సరికి వ్యర్థాలతో డ్రెయినేజీ నిండి మురుగు ముందుకు వెళ్లలేని పరిస్థితి. మురుగునీరు స్తంభించడంతో ఆప్రాంతం అంతా దుర్గంధభరితంగా మారింది. పటమట సరోజిని ఆసుపత్రి వద్ద ఉన్న డ్రెయినేజీ ఐదారు గజాల మేర పూర్తిగా పూడిపోయింది. దీంతో పై నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సరోజిని దేవి ఆసుపత్రి పక్కన పూడుకుపోయిన డ్రెయినేజీ



జెండా చెట్టు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

సమాచార హక్కు చట్టంపై పోటీలు

మాచవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం 2005కు సంబంధించి నోడల్ రిసోర్స్ సెంటర్(ఎన్ఆర్సీ) స్థాయి పోటీలలో భాగంగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. కళాశాల స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. అన్ని పోటీల్లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఎన్ఆర్సీ స్థాయి పోటీల కన్వీనర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



నలంద విద్యార్థికి హాకీలో కాంస్య పతకం

గవర్నర్‌పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో రోలర్ స్కేటింగ్ ఇన్‌లైన్ హాకీలో కాంస్య పతకాన్ని సాధించి శుక్రవారం విజయవాడ చేరుకున్న నలంద విద్యానికేతన్ విద్యార్థి కామినేని శ్రీకార్తీక్‌ను స్కూల్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఆసియా క్రీడలకు శ్రీకార్తీక్ ఎంపిక కావడం పట్ల సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్ పి. రమేష్ ప్రశంసించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ తమ విద్యార్థి కామినేని శ్రీకార్తీక్(12వ తరగతి) రానున్న ఆసియా క్రీడలకు భారతజట్టులో స్థానాన్ని సంపాదించుకున్నాడని తెలిపారు. శ్రీకార్తీక్‌ను నలంద విద్యాసంస్థల ఛైర్మన్ అట్లూరి విజయబాబు అభినందించారు.

ఆధునిక వైద్య సేవలను అందించాలి

● మూడు రోజుల నెఫ్రాలజీ సదస్సు ప్రారంభోత్సవంలో ఎన్టీఆర్ వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్



నెఫ్రాలజీ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్

లబ్బీపేట,అగస్టు 1 ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రజలకు మరింత సేవలందించాలని ఎన్టీఆర్ యునివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఇండియన్ నెఫ్రాలజీ సొ సైటీ సదరన్ చాప్టర్ 44వ వార్షిక సదస్సు నగరంలోని ఎస్.ఎస్ కన్వెన్షన్‌లో శుక్రవా రం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే సదస్సును ఎన్టీఆర్ హెల్త్ యునివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరి రావు, ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక వైద్య చికిత్సా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఔషధాలపై అవగాహన పెంపొందించుకునేందుకు సదస్సు చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. డాక్టర్ శ్రీహరిరావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన సదస్సును నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ నెఫ్రాలజిస్టు సొసైటీకి అభినందనలు తెలిపారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో నెఫ్రాలజీ చికిత్సను అందించేందుకు, ఆధునిక వైద్య చికిత్సలకు సంబంధించి వైద్యులు నైపుణ్యం పెంపొందించుకునేందుకు సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. ఐఎస్ఎన్ సదరన్ చాప్టర్ వార్షిక సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న డీఈవో యూవీ సుబ్బారావు

డీఈవో ఎస్‌కేఆర్‌ఎంఆర్‌ఎంసీ హైస్కూల్ తనిఖీ

విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సూర్యరావుపేట ఎస్‌కేఆర్‌ఎంఆర్‌ఎంసీ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతికి సంబంధించిన సిలబస్ ఎంత వరకు అయింది, విద్యార్థుల నోట్‌బుక్స్, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ప్రతి ఇంటి నుంచి వ్యాపారవేత్త లక్ష్యంగా ర్యాంప్

విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార అభివృద్ధికి సేవా సంస్థలు/వ్యకుల ఎంపిక కోసం ర్యాంప్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆర్.వెంకటరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త రావాలన్న ముఖ్యమంత్రి నినాదంతో ర్యాంప్ విజయవంతంగా నిర్వహించామన్నారు. రుణాలు తీసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్న వారికి లాభాలు రావాలని ఆశిస్తున్నామన్నారు. విజయవాడ, ఏఎల్ఈఏపీ ఛైర్‌పర్సన్ కె.కనకదుర్గ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా సంస్థ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తుందన్నారు. అందరి సహకారంతో సంస్థ విజ యం సాధించాలని, ప్రతి మహిళ కృషి చేస్తేనే సాధ్యమవుతుందని కనకదుర్గ పేర్కొన్నారు. అజయ్‌బాబు మాట్లాడుతూ, ఎంపికైన బీడీఎస్ ప్రొవైడర్లను రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు వ్యాపార అభివృద్ధి సేవలు అందించేందుకు సిద్ధం చేస్తామన్నారు.

రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు మృతి



రామకృష్ణారావు (ఫైల్)

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు, మచిలీపట్నం బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు (80) శుక్రవారం బందరులో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫెడరేషన్ స్టేట్ సెక్రటరీగా పనిచేశారు. ప్రముఖ సినీ నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్‌బాబు వంటి వారితో వ్యక్తిగత పరిచయాలున్నాయి. రామకృష్ణారావు మృతికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, బ్రాహ్మణ సంఘ నాయకులు ఏఆర్‌కె మూర్తి, పి.వి. ఫణికుమార్, ఆడిటర్ కేతవరపు శివకుమార్, గొర్రెపాటి గోపీచంద్, లోగిశెట్టి వెంకట స్వామి, బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు గడువు పెంపు

- ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ శ్రీనువాసరావు

విజయవాడ సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ గడువు డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. జూలై 31వ తేదీతో ముగిసిన గడువును వినియోగదారుల విజ్ఞప్తుల మేరకు పొడిగించినట్లు వివరించారు. గడువులోగా లోడు క్రమబద్ధీకరణ చేసుకునే వినియోగదారులకు ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించారు. అధిక లోడు వినిగించే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోడు క్రమబద్ధీకరణ చేసుకోకుండా నిర్దేశిత లోడు కంటే అధిక మొత్తంలో విద్యుత్‌ను వినియోగించడం నేరమని, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీల్లో అధిక లోడు వినియోగిస్తున్నట్లు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భ్రమరాంబపురంలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, లబ్ధిదారులను ఆత్మీయంగా పలుకరించి పెన్షన్లు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గౌరవప్రద జీవితానికి భరోసా.. ఎన్టీఆర్ పెన్షన్లు

● ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి

కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వీలుకల్పిస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి అన్నారు. 22వ డివిజన్ భ్రమరాంబపురంలో సీసీఎల్ఏ జయలక్ష్మి అధికారులతో కలిసి లబ్ధిదారులకు సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. పటమట లంకలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకొన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆటో మ్యుటేషన్ విప్లవాత్మకం

● పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలు
● సమయం, డబ్బు ఆదా : కలెక్టర్ లక్ష్మీశ



గాంధీనగర్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆటో మ్యుటేషన్‌ను ప్రారంభించి ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటో మ్యుటేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకమయ్యాయని, ఇదో విప్లవాత్మకమైన మార్పు అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో శుక్రవారం ఆటో మ్యుటేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ ప్రక్రియను పరిశీలించారు. నగరంలోని చిట్టినగర్‌కు చెందిన నంబూరు సామ్రాజ్యలక్ష్మి కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ ఆస్తి రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్ ప్రక్రియను పరిశీలించారు. అరగంటలోపే ఆటో మ్యుటేషన్ ప్రక్రియ పూర్తికావడంతో ఇరు పార్టీలు ప్రభుత్వ సేవల్లో వేగంపై ఆనందం వ్యక్తం చేశాయి. కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర లబ్దిదారుకు మ్యుటేషన్ సర్టిఫికెట్ అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. కొత్త విధానంలో ఒకేరోజు ఒకేచోట చాలా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణం మ్యుటేషన్ జరుగుతుందన్నారు. ఆటో మ్యుటేషన్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే మ్యుటేషన్ జరిగిపోతుందన్నారు. డాక్యుమెంటేషన్ వర్క్ తగ్గడమే కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల డేటాబేస్ అనుసంధానంతో సరళీకృత సేవలు లభిస్తాయన్నారు. సేవలపై ప్రజలకు విశ్వాసాన్ని, సంతృప్తి స్థాయిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆటో మ్యుటేషన్ మంచి ఉదాహరణ అన్నారు. ఈ విధానాన్ని అందుబాటులో తెచ్చిన గౌరవ ముఖ్యమంత్రికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఆటో మ్యుటేషన్ డిజిటల్ పాలనలో కీలక మైలురాయి అని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. 64 డివిజన్ల ప్రజలు అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని ధ్యానచంద్ర కోరారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరల్ ఎ.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ వీవీవీ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు ఎండీ ఆరిఫ్, కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీ-4లో రోజ్ సొసైటీ సైతం..

● బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన ప్రతినిధులు



కలెక్టర్ లక్ష్మీశను కలిసి పీ-4లో భాగస్వాములవుతామని తెలియజేస్తున్న రోజ్ సొసైటీ ప్రతినిధులు

కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వ పేదరిక నిర్మూలన మహాయజ్ఞ పీ-4లో తామూ భాగస్వాములమవుతామని, తమ బాధ్యతగా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని అండగా వుంటామంటూ రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు ముందుకొచ్చారు. సొసైటీ ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశతో క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ పీ-4 విధానం విశిష్టతను వివరించారు. స్వర్ణాంధ్ర సాకారం దిశగా వేస్తున్న అడుగుల్లో భాగంగా రాష్ట్రప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ-4 విధానంతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయని, 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రం లక్ష్యంగా ఈ విధానాన్ని అత్యంత పారదర్శకంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు పీ-4 విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. సమాజం అండతో ఎదిగిన వారు సామాజిక బాధ్యతగా తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయాలనే గొప్ప ఆలోచనతో బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ముందుకొస్తున్నారన్నారు. జిల్లాలో 86,398 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఇప్పటికే 4,279 మంది మార్గదర్శులుగా ముందుకొచ్చి 33,505 కుటుంబాలను దత్తత తీసుకొన్నారని వివరించారు. పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు రెడ్‌క్రాస్, రోటరీ, ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) తదితర సంస్థలూ ముందుకొచ్చాయన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వ పిలుపునకు స్పందించి పీ-4లో భాగమయ్యేందుకు ముందుకొచ్చిన రోజ్ సొసైటీకి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సొసైటీ అడ్వైజరీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అడుసుమిల్లి సీతామహాలక్ష్మి, ప్రెసిడెంట్ సూరపనేని ఉషారాణి, సెక్రటరీ ఘంటసాల లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎ.రత్నలక్ష్మి, కంచర్ల శుభ, అట్లూరి సుమబిందు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

● డీఈవో యూవీ సుబ్బారావు



విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పది సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఈవో, అడిషనల్ ఎంఈవో, ఉర్దూ రేంజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలోని ఉపాధ్యాయులకు సంబంధించిన దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, అమరావతి జారీ చేసిన ఆర్సీ నెంబర్ ఈఎస్ఈ-02-39036/5/2025-టీఆర్ఎన్‌జీ-సీఎస్ఈ కు ఈనెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా పంపించాలన్నారు.

ప్రొ-కబడ్డీ లీగ్ విశాఖలో 29న

లబ్బీపేట(స్పోర్ట్స్), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల తరువాత ఏపీకి ప్రొ-కబడ్డీ లీగ్ (పీకేఎల్) తిరిగి రావడం సంతోషదాయకమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైజాగ్ వేదికగా పీకేఎల్ 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్, తమిళ తలైవాస్ జట్ల మధ్య ఈ నెల 29న తొలి మ్యాచ్ జరగనుండడం శుభపరిణామమన్నారు. 2018లో ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా జరిగిన ఆరో సీజన్‌లో క్రీడాభిమానులు, వీక్షకులు అత్యంత అనుభూతి పొందారని, విశాఖలో జరగబోయే 12వ సీజన్ కూడా ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందన్నారు. సరికొత్త అధ్యయంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సహకరిస్తాయన్నారు. ప్రొ- కబడ్డీ లీగ్‌ను ఏపీలో నిర్వహిస్తున్న నిర్వాహకులకు, అసోసియేట్ పార్టనర్స్, స్పాన్సర్లకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో ఆంజనేయులుకు మూడో ర్యాంకు



కోడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో కోడూరు మండల పరిధిలోని జరుగువారిపాలెం గ్రామానికి చెందిన జరుగు ఆంజనేయులు అనే యువకుడు జిల్లాలో తృతీయ ర్యాంకును సాధించాడు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలోని మూడో ర్యాంకు సాధించిన ఆంజనేయులుకు పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

వేగంగా వార్షిక కౌలు అర్జీల పరిష్కారం



రాజధాని రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వార్షిక కౌలు అర్జీలను వేగంగా పరిష్కరిస్తున్నామని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే శుక్రవారం నిర్వహించారు. 2024-25వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించి రైతులు, భూ యజమానులు తమ అర్జీలను సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అర్జీదారులకు తెలియజేశారు. సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో రైతులకు కౌలు ననగదు జమ కానట్లయితే, సాధ్యమైనంత వేగంగా కౌలు నగదు జమయ్యేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఫేజ్-1 కింద రైతులకు ఇప్పటికే కౌలు నగదు జమ చేశామన్నారు. ఫేజ్-2 కింద జమ చేయాల్సిన కౌలు నగదు సాధ్యమైనంత వేగంగా జమ చేస్తామన్నారు. కౌలు అర్జీలకు సంబంధించిన సాంకేతిక సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు సీఆర్‌డీఏ ఐటీ విభాగ సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారని తెలిపారు. సీఆర్‌డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియజేసిన ఫిర్యాదులను పరిష్కరించారు. . గ్రీవెన్స్ డేలో 78 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బిసాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, జి.రవీందర్, జి.భీమారావు, ఏజీ చిన్నికృష్ణ, కె.ఎస్.భాగ్యరేఖ, గ్రీవెన్స్ రిడ్రస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎన్ఎస్‌వీబి వసంతరాయుడు, సీఆర్‌డీఏ సర్వే విభాగ అసిస్టెంట్ డైరక్టర్ జి.పాండురంగారావు రామకృష్ణన్, డెవలప్‌మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరక్టర్ సిహెచ్.మధుసూధనరావు, తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులను పరిశీలిస్తాం : ఏబీ

గాంధీనగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కేవలం రాజకీయం కోసమే కృష్ణానదీ జలాల పంపకం, వాడకం, రిజర్వాయర్ల నిర్మాణాలు తదితర అంశాలను వాడుకుంటున్నారని విశ్రాంత పోలీసు అధికారి, ఆలోచనాపరుల వేదిక నేత ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. నీటి వాటా పంపకాల విషయమై రాజకీయ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకోవద్దని ప్రజలను కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 4 నుంచి 6 వరకు రాయలసీమ ప్రాంతంలో పర్యటించి, అక్కడ ఇరిగేషన్ ప్రాజెక్టుల స్థితిగతులు, ప్రాజెక్టులకు ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారు, ఇంకా ఎంత ఖర్చు చేయాలి, ఆయా ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలకు ఎంత ఉపయోగం తదితర అంశాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ పర్యటనకు తెలంగాణకు చెందిన నీటిపారుదల రంగ నిపుణులు, రాజకీయ నేతలు రావాలని ఆహ్వానించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టుల నిర్మాణాలు మాత్రమే చేపట్టాలని , కేవలం కాంట్రాక్టర్‌లకు మేలు చేసేందుకు ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టేందుకు పూనుకోవడం మంచిది కాదన్నారు. ఓట్ల కోసం, కాంట్రాక్టర్ల కోసమో ప్రజల డబ్బును దుర్వినియోగం చేయడం దుర్మార్గమన్నారు. రాయలసీమలో కృష్ణానది నీటిని నిల్వ చేసుకునేందుకు రిజర్వాయర్లను నిర్మించుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ప్రముఖ సామాజికకార్యకర్త, సంఘం ప్రతినిధి టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ నెల 4న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన జలాశయం, నల్లమలసాగర్, రెండు సొరంగాల నిర్మాణ ప్రస్తుత పరిస్థితిని సందర్శించడం జరుగుతుందన్నారు. 5న శ్రీశైలం జలాశయం ఆధారంగా నిర్మించిన, నిర్మాణంలో ఉన్న రాయలసీమ ప్రాజెక్టులను, 6న శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ (ఎస్సార్బీసీ) ప్రధాన రిజర్వయర్లు, గోరకల్లు, అలగనూరు రిజర్వాయర్, సుంకేశుల ఆనకట్టలను సందర్శించి అనంతరం కర్నూలులో రైతులు, పౌర సంఘాల ప్రతినిధులతో ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం సమావేశం అవుతుందన్నారు. రైతు నేత అక్కినేని భవానీప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ పరిశుభ్రంగా ఉండాలి

● స్వచ్ఛతా అభియాన్‌లో డీఆర్ఎం మోహిత్ సోనాకియా



రైల్వే స్టేషన్ ప్రాగంణంలో మొక్క నాటి నీరు పోస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా అన్నారు.విజయవాడ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పరిశుభ్రతపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అసౌకర్యం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. . స్వచ్ఛభారత్ మిషన్ అమలు చేయటంలో విజయవాడ డివిజన్ ఏకీకృత ఫ్రంట్‌ను మరింత ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం డీఆర్ఎం స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. పరిశుభ్రతపై కళాబృందం ప్రదర్శన అలరించింది. స్టేషన్ ప్రాంగణంలో ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం (మౌలికసదుపాయాలు) పి.ఇ.ఎడ్విన్, సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.


విజయవాడ రైల్వే డీసీఎంగా బి.ప్రశాంత కుమార్



రైల్వేస్టేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ (కమర్షియల్)గా శుక్రవారం బి.ప్రశాంత కుమా ర్ బాధ్యతలు చేపట్టారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ అయిన ప్రశాంత కుమార్ భారతీయ రైల్వే శాఖలో అనేక కీలక పదవులు నిర్వహించారు. గతంలో విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆ సమయంలో భద్రతా అవగాహన, సంస్థను బలోపేతం చేయటంలో కీలక పాత్ర పోషించారు. ఫీల్డ్ తనిఖీలు, భద్రతా విధానాలను విజయవంతంగా అమలు చేశారు.

పాత ఎడ్లంకకు తెగిపోయిన సంబంధాలు

అవనిగడ్డ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరదల కారణంగా అవనిగడ్డ మండలంలోని దీవి గ్రామమైన పాత ఎడ్లంక గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఐదేళ్లుగా వరదల కారణంగా గ్రామానికి వెళ్లే రహదారి కొట్టుకుపోవటంతో అనునిత్యం నది దాటి అవతలి ఒడ్డుకు చేరేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎన్ఆర్ఐ, నియోజకవర్గ టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్ రూ.2.50 లక్షలతో మట్టి కాజ్‌వేను నిర్మించారు. ఆ కాజ్‌వేపై నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, శనివారం ఉద యం వరద నీటి తాకిడికి కాజ్‌వే కొట్టుకుపోవటంతో గ్రా మానికి ఉన్న రహదారి మార్గం పోయింది. దీంతో ప్రజలు నాటు పడవల్లోనే ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఎడ్లంక గ్రామంలో వరద తీవ్రత కారణంగా ప్రజలు నదిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ గ్రామంలో ప్రత్యేకంగా పికెట్ ఏర్పాటు చేశారు.



హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి.. ఫొటోలో లేని వ్యక్తికి పంపిన చలానా

ట్రాఫిక్ పోలీసుల తకరారు

● కారు ఇంటి వద్ద ఉంటే బైక్ చలానా కట్టాలంటూ ఇబ్రహీంపట్నం వాసికి నోటీసు

విజయవాడ లీగల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నేరం ఒకరు చేస్తే... ట్రాఫిక్ పోలీసులు శిక్ష మరొకరికి వేసిన సంఘటన ఇది వెలుగుచూసింది. ఇబ్రహీంపట్నంకు చెందిన వ్యక్తికి ఏపీ 16 ఈఎఫ్ 3360 అనే మారుతీ స్విఫ్ట్ డిజైర్ కారు వుంది. ఈ కారు ఎప్పుడూ ఆయన ఇంటిలోనే వుంటుంది. ఎక్కువగా ఆయన బైక్‌నే ఉపయోగిస్తారు. అయితే ట్రాఫిక్ పోలీసులు జూన్ 20న ఆయనకు బైక్‌పై వెళ్తూ హెల్మెట్ పెట్టుకోలేదంటూ చలానా పంపారు. దీనికి రూ.1035 జరిమానా చెల్లించాలని అందులో పేర్కొన్నారు. చలానాలో వున్న ఫొటోలో ఈయనది కాకపోవడం గమనార్హం.

బైక్‌పై వున్న వ్యక్తికి హెల్మెట్ లేదు. పోలీసులు మాత్రం ఆయన కారు నెంబరును ఉదహరిస్తూ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసినందున జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. బైక్ వున్న వ్యక్తి ఏపీ 16 ఎఫ్ఈ 3360 నెంబరుపై వెళ్తున్నాడు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఏ మాత్రం సరిచూసుకోకుండా సీరియల్ నెంబరును మా ర్చేసి బైక్‌కు వేయాల్సిన ఫైన్‌ను ఇంటిలో పెట్టిన కారుకు వేయడంతో రాజేష్ కుంగుతిన్నారు. ఇదేమిటని కంట్రోల్ రూం పోలీసులను కలవగా వారు ఓ లెటర్ ఇమ్మని అడిగారు. తప్పు మీరు పోలీసులు చేస్తే తాను లెటర్ ఎందుకు ఇవ్వాలంటూ ఆయన లెటర్ ఇవ్వకుండా వచ్చేశారు. నాలుగు రోజుల క్రితం 'మీరు త్వరగా చలానా మొత్తాన్ని కట్టకుంటే బండి సీజ్ చేస్తామంటూ పోలీసులు మెసేజ్ పంపారు. పోలీసులు తలచుకొంటే ఇలాగే వుంటుంది మరి.

రైతు సంక్షేమమే టీడీపీ ఎజెండా

అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం: సీఎం

- ప్రతి రైతు కళ్లలో ఆనందమే లక్ష్యం
- ఇదే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం
- నేడు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ
- 46.85 లక్షల మంది రైతులకు లబ్ధి
- చేస్తున్న మంచిని జనంలోకి తీసుకెళ్లండి
- పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు

ప్రజలు ఓట్లేస్తేనే మనం అధికారంలో ఉన్నామనే విషయాన్ని ఎప్పటికీ మరవొద్దు. గత ఎన్నికల్లో మనకు ఓటేసినవారు ఎప్పుడూ మనతోనే ఉండాలి.

మనం ఇంత సంక్షేమం చేస్తున్నా.. రాష్ట్రంపై ఇంకా కొందరు కుట్రలు పన్నుతూనే ఉన్నారు. అలాంటి వాళ్ల నైజాన్ని ప్రజల్లో ఎండగట్టాలి. - సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం పనిచేసే పార్టీ టీడీపీ. మన జెండాలోనే నాగలి గుర్తు ఉంది. అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. ఇదే మన పార్టీ సిద్ధాంతం. ప్రతి రైతులో మన ప్రభుత్వం ఉందనే భరోసాను కలిగించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఉండవల్లి నివాసం నుంచి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలపై చర్చించారు. సింగపూర్ పర్యటన విశేషాలను నేతలకు వివరించారు. ఎన్నికల హామీలన్నీ ఒక్కొటొక్కటిగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వాని కంటే రెండింతలు సంక్షేమం ఇస్తున్నామని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. 'సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. ఈ నెలలోనే సూపర్ సిక్స్‌లోని రెండు హామీలు నెరవేరుస్తున్నాం. అన్నదాత సుఖీభవ నిధులను శనివారం విడుదల చేస్తున్నాం. తొలి విడతగా రూ.7 వేలు జమ చేస్తున్నాం. ఇందులో కేంద్రం వాటా రూ.2 వేలు, రాష్ట్రం వాటా రూ.5 వేలు ఉంటుంది. 46,85,838 మంది మంది రైతులకు లబ్ధి కలుగుతుంది. రూ.2,342.92 కోట్లు విడుదల చేస్తు న్నాం. కేంద్రం రూ.831.51 కోట్లు ఇస్తోంది. అర్హులైన రైతుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోతే 155251 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు' అని పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారంటే..

నిత్యం జనంలో ఉండాలి..

కష్టాలున్నా సంక్షేమం అమలు చేస్తున్నాం. మన ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను జనంలోకి తీసుకెళ్లి అర్థమయ్యేలా వివరించాల్సింది పార్టీ యంత్రాంగమే. నిత్యం వారిలో ఉండాలి.. వారి కోసమే పనిచేయాలి. మరింత మంది మన పాలనను మెచ్చాలి. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కోటి కుటుంబాలను మన పార్టీ నాయకులు కలవడం ఓ రికార్డు. ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమీక్షలు నిర్వహిస్తున్నాం. ఏమైనా లోపాలుంటే సరిచేసుకోవాలని సూచిస్తున్నాం.

నేడు ప్రకాశం జిల్లాలో సీఎం పర్యటన

- దర్శి నియోజకవర్గంలో 'అన్నదాత సుఖీభవ'కు శ్రీకారం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు గొట్టిపాటి, డోలా

ఒంగోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం ప్రకాశం జిల్లాలో పర్యటించనున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకానికి దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం గ్రామం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. కేంద్రం పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు కలిపి ఒక్కొక్కరికీ రూ.20 వేలు ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో తొలి విడత రూ.7 వేలను శనివారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రకాశం జిల్లాలో ఈ పథకం కింద 2,68,165 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. శనివారం ఉదయం 10.35 గంటలకు దర్శి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారు. అక్కడి నుంచి తూర్పువీరాయపాలెం చేరుకుని రైతుల సమావేశంలో పాల్గొంటారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సమావేశం ఏర్పాట్లను మంత్రులు డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరిశీలించారు.



తూర్పువీరాయపాలెంలో సీఎం సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి

రైతుల కోసమే టీడీపీ..

తెలుగుదేశం తొలి నుంచీ రైతుల పక్షపాతి. ఎన్టీఆర్ రైతులకు రూ.50కే విద్యుత్తుసరఫరా చేశారు. రాయలసీమలో 90 శాతం ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే చేపట్టాం. మనం చేపట్టిన ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. పథకాలను రద్దు చేసింది. ఆ ప్రభుత్వం రైతు భరోసా కింద ఏడాదికి రూ.12,500 ఇస్తామని రూ.7,500 మాత్రమే ఇచ్చింది. మనం రూ.20 వేలు ఇస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్లు బకాయి పెడితే మనం వచ్చాక చెల్లించాం. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇస్తున్నాం. అగ్రిటెక్ ద్వారా రైతులకు పరికరాలు అందజేస్తున్నాం. ప్రతి రైతు కళ్లలో ఆనందం చూడడమే ఈ ప్రభుత్వ లక్ష్యం.

ప్రతి రైతు కుటుంబానికీ 20వేలు

- కనీసం 10 సెంట్లు.. గరిష్ఠ భూ పరిమితి లేదు
- రూ.20 వేల లోపు జీతం తీసుకున్నా అర్హులే
- సొంత భూమి లేని కౌలు రైతులకూ వర్తింపు
- ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు అనర్హులు
- మాజీ, తాజా ప్రజాప్రతినిధులకూ.. వృత్తి నిపుణులకు పథకం వర్తించదు
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మార్గదర్శకాలివే!

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. శనివారం నుంచి అమలు జరిగే ఈ పథకంలో కనీసం 10 సెంట్ల భూమి కలిగిన రైతులు, అటవీ భూమి సాగు హక్కుదారులు, భూమి లేని కౌలు రైతులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున లబ్ధి చేకూరనున్నది. ఇందులో రూ.6వేలు పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్నది. మిగతా రూ.14వేలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనున్నది. ఈ పథకానికి అర్హత కలిగి, భూమి లేని కౌలు సాగుదారులందరికీ రాష్ట్ర బడ్జెట్ నుంచి ఏటా రూ.20వేలు చెల్లించనున్నది. ఈ పథకం అర్హతలో భార్య, భర్త, పెళ్లి కాని పిల్లలను ఒక రైతు కుటుంబంగా, పిల్లలకు పెళ్లిళ్లు అయితే ప్రత్యేక కుటుంబంగా పరిగణించనున్నారు. సాగుభూమిపై చట్టబద్ధంగా హక్కున్న వ్యక్తి భూయజమానిగా గుర్తిసారు. ఏమాత్రం భూమి లేకుండా, లేదా ప్రభుత్వం పేదలకు కేటాయించిన భూమితో సహా వ్యవసాయ, ఉద్యాన పంటలకు లేదా పట్టు పురుగుల పెంపకానికి భూమిని వార్షిక కౌలుకు తీసుకున్న వ్యక్తిని కౌలుసాగుదారుగా పరిగణించనున్నారు. ప్రస్తుత, మాజీ.. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, జడ్పీ ఛైర్‌పర్సన్లు, రిటైరైన, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, మంత్రిత్వ శాఖలు, కార్యాలయాలు, శాఖలు, అనుబంధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు, స్థానిక సంస్థల్లోని రెగ్యులర్ ఉద్యోగులు, రిటైరైన, ప్రస్తుత అధికారులు అనర్హులు. నెలకు రూ.10వేలు పైన ప్రభుత్వ పెన్షన్ తీసుకునే రిటైర్డ్ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్ వంటి వృత్తి నిపుణులు, అండర్ టేకింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వారు, గృహాలుగా మార్చిన వ్యవసాయ భూములు కలిగిన వ్యక్తులు, ఆక్వా సాగు, వ్యవసాయేతర వినియోగం కోసం రెవెన్యూ రికార్డుల్లో సవీకరించిన భూములున్న వారిని ఈ పథకం నుంచి మినహాయించారు. అయితే నెలకు రూ.20వేల లోపు జీతం తీసుకునే ఉద్యోగులకు, సిబ్బందికి ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ పథకంలో ఉమ్మడి కుటుంబంలో అత్యధిక భూమి కలిగిన వ్యక్తి బ్యాంకు ఖాతాకు ఈ పథకం సొమ్ము జమ కానున్నది. కౌలు రైతుగా లబ్ధి పొందాలంటే వారి కుటుంబ సభ్యులకు సొంత భూమి ఉండకూడదు. గరిష్ఠ భూ పరిమాణంతో నిమిత్తం లేకుండా ప్రతి భూ యజమాని కుటుంబంలో ఒక సాగుదారుకే ప్రయోజనం లభించనున్నది. భూయజమాని ద్వారా ఒక కౌలు సాగుదారుకు మాత్రమే లబ్ధి చేకూరనున్నది. ఒకే భూమి యజమానికి అనేక మంది లీజుదారులున్నా.. అందులో షెడ్యూల్డ్ తెగల కౌలుసాగుదారుకు ప్రాధాన్యం ఇస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో చట్ట ప్రకారం బహుళ లీజు ఒప్పందాలు కలిగిన భూమి లేని సాగుదారులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఈ పథకం నుంచి మినహాయించిన యజమానుల భూములను సాగు చేస్తున్న కౌలుదారులు ఈ పథకానికి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. దేవదాయ, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇనాం, దేవాలయ భూములు సాగు చేసే కౌలుదారులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనున్నది. కౌలుసాగుదారు పత్రం, ఈ-పంట నమోదు ద్వారా కౌలు రైతులను ఎంపిక చేస్తారు. రెవెన్యూ వెబ్‌ల్యాండ్, ఆర్వోఎఫ్ఆర్ డేటా ప్రకారం భూ యజమానులను ఆర్టీజీఎస్ గుర్తించగా, గ్రామ సచివాలయాల ద్వారా కుటుంబ సమాచారం, సీఎఫ్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల డేటా, గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిల ద్వారా లబ్ధిదారుల ధ్రువీకరణ జరుగుతుంది. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే అర్హులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలి. పథకం సొమ్మును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. నగదు బదిలీ అయ్యాక లబ్ధిదారుల ఫోన్లకు సంక్షిప్త సందేశం వస్తుంది. ఈ పథకానికి అర్హత ఉండీ లబ్ధి చేకూరకపోతే రైతుసేవా కేంద్రాల్లో ఫిర్యాదులు స్వీకరించి, రెండు వారాల్లోగా సమస్యను పరిష్కరిస్తారు. ఫిర్యాదుల కోసం 155251 టోల్‌ఫ్రీ నంబరు వినియోగించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది.

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ చెల్లింపులిలా.. (రూ.ల్లో)

సీజన్	కేంద్రం	రాష్ట్రం	మొత్తం	కౌలు రైతులకు రాష్ట్రం
ఖరీఫ్	2,000	5,000	7,000	
రబీ	2,000	5,000	7,000	10,000
సమ్మర్	2,000	4,000	6,000	10,000
మొత్తం	6,000	14,000	20,000	20,000

15 నుంచి 'ప్లాస్టిక్' రహితంగా రాష్ట్ర సచివాలయం

- పురపాలక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేశ్ కుమార్

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్న లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వచ్చే ఏడాది జూన్ 5 నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు ఆకాంక్ష. అధికార యంత్రాంగం ఆచరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర సచివాలయాన్ని ఈనెల 15 నాటికి 'ప్లాస్టిక్' రహితంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అమలు పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటయింది. జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. శుక్రవారం సచివాలయంలో శిక్షణ, అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, మనిషి ఆరోగ్యానికి కలిగే నష్టాలను వివరించారు. సచివాలయంలోకి సింగిల్ యూజ్ ప్లాసిక్ వస్తువులు తీసుకురాకుండా గేటు వద్దే నిలుపుదల చేయాలని ఆదేశించారు. సచివాలయ బ్లాకుల్లో ఆర్వో ప్లాంట్ల ద్వారా తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఘన, ద్రవ్య వ్యర్థాల సేకరణకు మూడు రకాల డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్వోలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగులందరికీ సీఆర్‌డీఏ ద్వారా స్టీల్ వాటర్ బాటిల్స్ అందిస్తామని చెప్పారు.

ఇండియా స్కిల్స్ పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కేంద్రం నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్-2025 పోటీ పోస్టర్‌ను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర యువత వినియోగించుకోవాలని, విజేతలకు ప్రపంచ నైపుణ్య పోటీలు-2026లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని తెలిపారు. సెప్టెంబరు 30 వరకు ఏపీ నైపుణ్యం, స్కిల్ ఇండియా డిజిటల్ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల్లోకి ఇతరుల ప్రవేశం నిషేధం

పాఠశాలల్లోకి ఇతరుల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. ఆ మేరకు చర్యలు చేపట్టాలని ఆర్జేడీలు, డీఈవోలకు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తప్ప ఇంకెవరూ పాఠశాలల పరిసరాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

దశలవారీగా డిగ్రీ అధ్యాపకుల నిరసనలు

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జేఏసీ పిలుపునిచ్చింది. ఈనెల 7న నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, 11వ తేదీ నుంచి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, 18న విజయవాడలోని ధర్నాకు హాజరుకావాలని లెక్చరర్లను కోరింది. 'ఎన్నిసార్లు అడిగినా డిగ్రీ అధ్యాపకుల బదిలీలు చేపట్టడంలేదు. గతంలో ఎయిడెడ్ కాలేజీలకు గ్రాంట్ నిలిపివేసినప్పుడు జీవో 42 తీసుకొచ్చిన ప్రభుత్వ లెక్చరర్ పోస్టుల్లో ఎయిడెడ్ లెక్చరర్లను నియమించింది. అనంతరం ఎయిడెడ్ కాలేజీలకు గ్రాంట్ పునరుద్ధరించినా వారిని అక్కడే కొనసాగిస్తోంది. దీనిపై ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా స్పందించలేదు' అని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 26 రాష్ట్రాల్లో డిగ్రీ అధ్యాపకులను అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లుగా మార్చారని, ఏపీలో ఇప్పటికీ అధ్యాపకులుగానే కొనసాగిస్తున్నారని తెలిపారు.

అటవీ ప్రాంతాలపై సమగ్ర నివేదిక

- తయారీకి కమిటీ నియామకం

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అటవీ ప్రాంతాలపై సమగ్ర నివేదిక సమర్పించడానికి ప్రభుత్వం శుక్రవారం నిపుణుల కమిటీని నియమించింది. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన 10 మంది సభ్యులు ఉంటారు. చట్ట ప్రకారం గుర్తించబడిన, వర్గీకరించబడిన, భూయాజమాన్యంతో సంబంధం లేకుండా 'అడవి'గా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, గతంలో అడవిగా ఉండి, క్షీణించిన, తొలగించబడిన, శుభ్రం చేయబడిన భూమిగా మారిన ప్రాంతాలను గుర్తించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తులకు చెందిన తోటలు, తీగ చెట్లతో కప్పబడిన ప్రాంతాలను గుర్తించి, నెలలోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం నిర్దేశించింది. భూపరిపాలన శాఖ అడిషనల్ చీఫ్ కమిషనర్ ఛైర్మన్‌గా మరో కమిటీని నియమించింది. దీనిలో సీసీఎల్ఏ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ కన్నుమూత

- విద్య, పరిశోధనా రంగాలలో విశిష్ట కృషి
- అమెరికాలో కుమారుడి ఇంట హఠాన్మరణం
- సంతాపం తెలిపిన సాహితీవేత్తలు



అనంతపురం టౌన్, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహిత్య విమర్శకుడు, కవి, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ(78) ఇకలేరు. కొంతకాలంగా అమెరికా, కాలిఫోర్నియాలోని కుమారుడు వంశీ దగ్గర ఉంటున్న ఆయన భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. అనంతపురం జిల్లా తనకల్లు మండల కేంద్రంలో జన్మించిన ఆయన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన శాఖ అధ్యక్షుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆచార్యుడిగానే కాకుండా కవి, నాటక రచయిత, ప్రతిభావంతుడైన అనువాదకుడిగా ఆయన గుర్తింపు పొందారు. ప్రఖ్యాత కన్నడ రచయిత ఎస్.ఎల్ భైరప్ప రాసిన 'పర్వ' నవలను తెలుగులోకి అనువదించారు. దీనికిగాను 2004లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఇందిరా గోస్వామి హిందీలో రచించిన విషాద కామరూప నవలనూ తెలుగు పాఠకులకు అందించారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ కావ్యానందం రచనను కన్నడలోకి అనువాదం చేశారు. తెలుగు చరిత్ర - కొన్ని కొత్త చూపులు, సాహిత్య పరిశోధనా కళ, తెలుగు సంస్కృతి- శాసనాల, చారిత్రక పరిణామాలు తదితర పరిశోధనాత్మక రచనలు పుస్తకాలుగా వెలువడ్డాయి. పదవీ విరమణ అనంతరం అమెరికా వెళ్లిపోయారు. అక్కడే ఉంటూ 'సిరికోన సాహిత్య అకాడమీ'ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తూ, అనేక మంది కవులు, రచయితలకు వేదికగా నిలిచారు. కాగా, లక్ష్మీనారాయణ అంత్యక్రియలు అమెరికాలోనే నిర్వహిస్తున్నట్లు కుమారుడు వంశీ తెలిపారు. ఆయన మృతికి పలువురు సాహితీవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

షార్ డైరెక్టర్‌గా పద్మకుమార్ బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ ఈఎస్ పద్మకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు తిరువనంతపురంలోని ఐపిఎస్‌యూ డైరెక్టర్‌గా సేవలందించారు.

లిక్కర్ నిందితుల రిమాండ్ పొడిగింపు

- 12 మందికి 13 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

విజయవాడ/రాజమహేంద్రవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో వివిధ జైళ్లలో ఉన్న 12 మందికి 13వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. నిందితుల రిమాండ్ గడువు ముగియడంతో రాజమహేంద్రవరం జైలు నుంచి ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని, విజయవాడ జిల్లా జైలు నుంచి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, పైలా దిలీప్, బూనేటి చాణక్య, చెరుకూరి వెంకటేశ్‌నాయుడు, బాలాజీ గోవిందప్ప, గుంటూరు జిల్లా జైలు నుంచి బాలాజీ కుమార్, నవీన్ కృష్ణను ఏసీబీ కోర్టుకు తరలించారు. నిందితులను దూరప్రాంతాల్లోని వేర్వేరు జైళ్ల నుంచి కోర్టుకు తీసుకురావాల్సి వస్తోందని, ఇక నుంచి రిమాండ్ పొడిగింపులను వర్చ్యువల్‌గా జరిగేలా చూడాలని సిట్ దర్యాప్తు అధికారి శ్రీహరిబాబు కోర్టును అభ్యర్థించారు. దీనిని న్యాయాధికారి తోసిపుచ్చారు. వర్చువల్ విధానంలో నిందితుల మాటలు సరిగా వినిపించడం లేదన్నారు. ఇరువైపులా వాదనలు వినాలి కదా? అని ప్రశ్నించారు. రిమాండ్ పొడిగింపు సమయంలో నిందితులను కోర్టుకు తీసుకురావాలని స్పష్టం చేశారు.

ఏపూట భోజనం ఆపూట కావాలి: మిథున్‌రెడ్డి

తనకు ఇంటి నుంచి భోజనాన్ని ఏ పూటకు ఆ పూట అనుమతించాలని మిథున్‌రెడ్డి ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఇంటి నుంచి ఒకేసారి తీసుకొస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం భోజనాన్నే రాత్రిపూట తినాల్సి వస్తోందన్నారు. తనకు అల్సర్ ఉన్న కారణంగా ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని తెలిపారు. మిథున్‌రెడ్డి పార్లమెంట్‌లో వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారని, ఏ పూట భోజనం ఆ పూట అనుమతించడానికి అవకాశం ఉందని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. దీనిపై పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. కాగా, మిథున్‌రెడ్డి తిరిగి సాయంత్రం 5 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేరుకున్నారు. ఆయన్ను స్నేహ బ్యారక్‌లోనే ఉంచినట్టు జైలు సూపరింటెండెంట్ రాహుల్ తెలిపారు. రెండు పూటలకు ఒకేసారి భోజనం బయట నుంచి తెస్తున్నారని, ఇతర ఖైదీలకు అందించినట్లే ఆయనకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు.

కోర్టులోకి రాకుండా మీడియాను అడ్డుకోండి

- వైసీపీ న్యాయవాదుల ఫిర్యాదు
- ఎలా నియంత్రించాలో మీరే చెప్పండి: కోర్టు

విజయవాడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కోర్టు హాలులోకి మీడియా ప్రతినిధులు రాకుండా అడ్డుకోవాలని వైసీపీకి చెందిన న్యాయవాదులు ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావును కోరారు. మద్యం కేసు నిందితులను కోర్టుకు హాజరుపరిచినప్పుడు ఈ విజ్ఞప్తి చేశారు. కోర్టు విషయాలు ముందుగానే మీడియాకు లీకవుతున్నాయని, లోపల జరిగే దాన్ని వక్రీకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. న్యాయాధికారి స్పందిస్తూ.. లీకుల విషయాల్లో ఎవరిని తప్పు పడతామని, లోపలకు రాకుండా మీడియాను ఎలా నియంత్రించాలో చెప్పండని ప్రశ్నించారు.

బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

లిక్కర్ కేసు నిందితుల పిటిషన్లను ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. డి.వాసుదేవరెడ్డి, డి.సత్యప్రసాద్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఐదో తేదీకి వాయిదా పడింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహనరెడ్డి, బాలాజీ గోవిందప్ప, మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై విచారణ నాలుగో తేదీకి, బాలాజీ కుమార్, నవీన్‌కృష్ణ బెయిల్ పిటిషన్లు ఏడో తేదీకి వాయిదా పడ్డాయి. బాలాజీ కుమార్ యాదవ్‌ను అరెస్ట్ చేసినప్పుడు స్వాధీనం చేసుకున్న రూ.3.5 లక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై విచారణ ఏడో తేదీకి వాయిదా పడింది. చెరుకూరి వెంకటేశ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ ఏసీబీ కోర్టు తీర్పునిచ్చింది.

భగవంతుడు మా వైపు ఉన్నాడు: చెవిరెడ్డి

మద్యం కేసులో తమను అన్యాయంగా ఇరికించారని, భగవంతుడు తమ వైపు ఉన్నాడని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కోర్టుకు తీసుకొచ్చినప్పుడు ఆయన మాట్లాడుతూ లోపలికి వెళ్లారు. ఈ కేసులో తన పాత్ర లేదన్నారు. అక్రమ కేసులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. కోర్టులోనూ ఇదే ప్రస్తావన చేశారు.

పింఛన్ల సొమ్ము రూ.2.50లక్షల చోరీ

- అప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బంది చందాలు.. లబ్ధిదారులకు పంపిణీ

నరసాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు చెల్లించాల్సిన రూ.2.50 లక్షల పింఛను సొమ్మును ఓ వీఆర్వో తన బైక్ డిక్కీలో పెట్టగా ఆగంతకులు కొట్టేశారు. ఈ ఘటన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో శుక్రవారం వెలుగుచూసింది. బాధితుడు, ఐదో వార్డు సచివాలయ వీఆర్వో లక్ష్మీగణపతి పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. గురువారం మునిసిపల్ అధికారుల నుంచి పింఛన్ల సొమ్ము రూ.2.50 లక్షల నగదును తీసుకున్నారు. ఆ సొమ్మును శుక్రవారం పంపిణీ చేయాల్సి ఉండగా, బైక్ డిక్కీలో పెట్టుకుని, పట్టణంలోని తెలగా కళ్యాణ మండపంలో జరుగుతున్న బంధువుల వివాహానికి వెళ్లారు. రాత్రి ఇంటికి వెళ్లి చూసే సరికి బైక్ డిక్కీలో సొమ్ము లేదు. వెంటనే అధికారులకు తెలియజేశాడు. తోటి రెవెన్యూ సిబ్బంది అప్పటికప్పుడు చందాలుగా వేసుకుని రూ. 2.50లక్షలు పోగు చేశారు. ఆ మొత్తాన్ని వీఆర్వో శుక్రవారం లబ్ధిదారులందరికీ పంపిణీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయలక్ష్మి చెప్పారు.

సత్యసాయి శత జయంతికి ప్రధానికి ఆహ్వానం



ప్రధాని మోదీకి సత్యసాయి శత జయంతి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుక ల్లో పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆహ్వానించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ట్రస్టు ప్రతినిధులు జస్టిస్ రామసుబ్రహ్మణ్యం, నాగానందం, హీరా, సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండేతో కలిసి ఆయన ఢిల్లీలో ప్రధాని మోదీని శుక్రవారం కలిశారు. నవంబరులో జరిగే శత జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

సాయంత్రానికి మారిన శ్రీవాణి దర్శనం

- శుక్రవారం నుంచి ప్రయోగాత్మకంగా అమలు

తిరుమల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి టికెట్లు తీసుకున్న రోజే దర్శనం.. తిరుమలలో ప్రయోగాత్మకంగా శుక్రవారం నుంచి మొదలైంది. అన్నమయ్య భవనం ముందున్న కౌంటర్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు తొలిరోజు శ్రీవాణి ట్రస్టు దాతలకు 800 టికెట్లను కేటాయించారు. తిరుపతి ఎయిర్‌పోర్టులోనూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు 200 టికెట్లు జారీచేశారు. వీరంతా సాయంత్రం 4.30 నుంచి 5.45 గంటల మధ్యలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న 500 మంది మాత్రం పాత సమయం ప్రకారమే ఉదయం 10 గంటలకు వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. పాత విధానంలో శ్రీవాణి దాతలు మూడు రోజుల పాటు తిరుమలలో ఉండాల్సి రావడంతో ఈ కొత్త పద్ధతిని టీటీడీ ప్రారంభించింది.

పర్యాటకాభివృద్ధికి అనుకూలంగా బార్ పాలసీ

- క్యాబినెట్ సబ్ కమిటీలో మంత్రుల అభిప్రాయాలు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీ రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఉండాలని ఎక్సైజ్‌పై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. పర్యాటక శాఖ సమన్వయంతో పాలసీ రూపొందించాలని అధికారులకు సూచించింది. కమిటీ సమావేశం శుక్రవారం ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో జరిగింది. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర మంత్రులు గొట్టిపాటి రవికుమార్ ప్రత్యక్షంగా, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు, 50 స్టార్ హోటళ్లలో బార్లు, మైక్రో బ్రూవరీలు ఉన్నాయని అధికారులు వివరించారు. రాష్ట్ర వైన్ డీలర్ల సంఘం వినతులను అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.



పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులతో శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్యామ్

పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో 'శ్యామ్' విజయదుందుభి

కాకినాడ(కార్పొరేషన్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్స్-2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించడమే కాకుండా అత్యధిక పోస్టులను కైవసం చేసుకుంది. ఫలితాల వివరాలను శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జి.శ్యామ్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కలిపి 6,014 ఉద్యోగాలకు 4,005 ఉద్యోగాలను తమ సంస్థ కైవసం చేసుకుందన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా, టెస్ట్ సిరీస్, మెటీరియల్ ప్రోగ్రామ్ ద్వారా అభ్యర్థులు ఈ విజయాన్ని సాధించారని తెలిపారు. ప్రధానంగా సివిల్ కానిస్టేబుల్ విభాగంలో 168/200 మార్కులతో విశాఖపట్నానికి చెందిన జి.నానాజీ (రి.నెం.4434322) రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడని చెప్పారు. మహిళల విభాగంలో 159/200 మార్కులతో విజయనగరానికి చెందిన జి.రమ్యమాధురి (రి.నెం.4318582) రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఏపీఎస్పీ విభాగంలో 144.5/200 మార్కులతో విశాఖపట్నానికి చెందిన ఎం.అచ్యుతరావు (రి.నెం.4008213) ప్రథమ ర్యాంకు సాధించినట్టు శ్యామ్ వెల్లడించారు..

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
★ SINCE 1965 ★
శనివారం
2 ఆగస్టు 2025







భారతీయ చిత్ర పరిశ్రమకు 2023 సంవత్సరానికి గాను 71వ జాతీయ పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. విధు వినోద్ చోప్రా తెరకెక్కించిన 'ట్వల్త్ ఫెయిల్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాస్సే(ట్వల్త్ ఫెయిల్) సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డుకు ఎంపికయ్యారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారాల రేసులో టాలీవుడ్ సత్తాచాటింది. ఏకంగా ఏడు పురస్కారాలను దక్కించుకుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'భగవంత్ కేసరి' ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు సినిమాగా ఎంపికైంది. చిన్న చిత్రంగా విడుదలై సంచలన విజయం సాధించిన 'హను-మాన్' చిత్రానికి.. 'ఉత్తమ యానిమేషన్- విజువల్ ఎఫెక్ట్స్', 'యాక్షన్ కొరియోగ్రఫీ' విభాగాల్లో రెండు అవార్డులు దక్కాయి. యువతరాన్ని విశేషంగా ఆకట్టుకున్న 'బేబీ' చిత్రంతో.. ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా చిత్ర దర్శకుడు సాయి రాజేశ్, ఉత్తమ గాయకుడుగా పీవీఎన్ఎస్ రోహిత్ ఎంపికయ్యారు. 'బలగం' చిత్రంలోని 'ఊరూ పల్లెటూరు' అంటూ అందరి హృదయాలను హత్తుకునేలా పాట రాసిన కాసర్ల శ్యామ్‌కు ఉత్తమ గేయ రచయితగా జాతీయ అవార్డు దక్కింది.

జాతీయ అవార్డులు.. సత్తా చాటిన తెలుగు సినిమా



● ఉత్తమ నటులుగా షారుక్, విక్రాంత్ ● టాలీవుడ్‌కు ఏకంగా ఏడు అవార్డులు

33 ఏళ్ల కెరీర్‌లో...

బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్‌ఖాన్‌ను తొలిసారిగా జాతీయ ఉత్తమ చలన చిత్ర నటుడు పురస్కారం వరించింది. 2023లో విడుదలైన 'జవాన్' చిత్రంలో నటనకు గాను ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సినిమాను తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కించారు. బాక్సాఫీసును షేక్ చేసి ఏకంగా రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. షారుక్‌ఖాన్ తొలుత తన కెరీర్‌ను బుల్లి తెరతో ప్రారంభించారు. అనంతరం చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు. ఆయన నటించిన తొలి చిత్రం 'దీవానా'. 1992లో విడుదలైన ఈ చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. షారుక్ తన 33 ఏళ్ల సినీ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూశారు. 'డర్', 'బాజీగర్', ' దిల్‌సే', 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే', 'కుచ్ కుచ్ హోతా హై', 'దేవదాస్', 'వీర్-జరా', 'కల్ హో న హో', 'పహేలి', 'స్వదేశ్' , 'చెక్ దే ఇండియా', 'మై నేమ్ ఈజ్ ఖాన్', 'పఠాన్' వంటి చిత్రాలు షారుక్‌ఖాన్ కెరీర్‌లో మైలు రాళ్లుగా నిలిచాయి. కాగా, 2005లో షారుక్ ఖాన్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును బహూకరించింది.

తొలి జాతీయ అవార్డ్



మూడు పదుల నట జీవితంలో ఉత్తమ నటిగా తనకు ఇది తొలి జాతీయ అవార్డ్ అని నటి రాణీ ముఖర్జీ ఉద్వేగంతో చెప్పారు. తనకు ఈ అవార్డ్ రావడానికి కారకులైన 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' యూనిట్ సభ్యులకు, దర్శకనిర్మాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నటిగా తన 30 ఏళ్ల కష్టానికి తగ్గ ఫలితం ఇదనీ, సినిమా అంటే ఉన్న ప్రేమ, అభిమానం ఇప్పుడు జాతీయ అవార్డ్ వరకూ తీసుకు వచ్చిందని రాణీ చెప్పారు.

కష్టానికి తగ్గ ఫలితం



'ధూమ్ మచావో ధూమ్' షోతో బుల్లి తెరపై తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు విక్రాంత్ మాస్సే. 2009లో 'బాలికా వధు' టీవీ షో ద్వారా పాపులర్ అయ్యారు. 2013లో 'లుటేరా' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. 'జిన్నీ వెడ్స్ సన్నీ', 'హసీన్ దిల్ రూబా', 'లవ్ హాస్టల్', 'ట్వెల్త్ ఫెయిల్', 'సెక్టార్ 36', 'సబర్మతీ ఎక్స్‌ప్రెస్' చిత్రాలతో మంచి పేరు గడించారు. '12 ఫెయిల్' చిత్రంలో సహజంగా నటించేందుకు విక్రాంత్ పడిన కష్టం అంతా ఇంతా కాదు. సినిమాలో నల్లగా కనిపించాలని దర్శకుడు వినోద్ చోప్రా చెప్పడంతో శరీరానికి ఆవనూనె పట్టించి రోజూ మూడు గంటల పాటు ఎండలో గడిపారు విక్రాంత్. దీని వల్ల స్కిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చినా ఆయన లెక్క చేయలేదు. ఆ కష్టానికి ఫలితం ఇప్పుడు జాతీయ అవార్డ్ రూపంలో దక్కింది.

ప్రతిభకు పట్టం

'వాతి' అనే తమిళ సినిమాకు గాను జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు జీవీ ప్రకాశ్ కుమార్. ఆయన మొదటి సారిగా తన మేనమామ ఏ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకత్వంలో వచ్చిన 'జెంటిల్మేన్' సినిమాకు సౌండ్ ట్రాక్ విభాగంలో పనిచేశారు. శంకర్ నిర్మాణ సారథ్యంలో, వసంత బాలన్ దర్శకత్వంలో వచ్చిన 'వేయిల్' అనే తమిళ సినిమాతో సంగీత దర్శకుడిగా మారారు. తెలుగులో 'లక్కీ భాస్కర్', 'మట్కా', 'రాబిన్ హుడ్' చిత్రాలకు సంగీతం అందించారు.

ట్వల్త్ ఫెయిల్ కాదు



ఎన్నో అవమానాలు, మరెన్నో విమర్శలు మధ్య నిజాయితీగా గెలిచిన విజయవంతమైన చిత్రం 'ట్వల్త్ ఫెయిల్'. 'ఈ ఏడాది మీరు కేవలం ఒకే ఒక్క సినిమా చూడదలుచుకుంటే కచ్చితంగా 'ట్వల్త్ ఫెయిల్' చూడండి' అంటూ ఆ చిత్రం విడుదలైన సమయంలో పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నెటిజన్లకు సూచించారు. జాతీయ ఉత్తమ నటుడి పురస్కారానికి అర్హమైన నటనను కనబరచారు అంటూ అప్పట్లోనే ఆయన విక్రాంత్ మాస్సేను అభినందించారు కూడా. ఇప్పుడు ఆయన అంచనా నిజమైంది. 'ట్వల్త్ ఫెయిల్' ఉత్తమ జాతీయ చిత్రంగా నిలవగా, విక్రాంత్ మాస్సేకు ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. పన్నెండో తరగతి ఫెయిలైనా పట్టుదలతో సివిల్స్ సాధించి ఐపీఎస్‌కు సెలెక్టయ్యారు మనోజ్‌కుమార్ శర్మ. ఆయన జీవిత కథ ఆధారంగా అనురాగ్ పాఠక్ రాసిన పుస్తకం 'ట్వల్త్ ఫెయిల్'. అదే పేరుతో రూపుదిద్దుకున్న చిత్రమిది. పన్నెండో తరగతి తప్పిన యువకుడు సివిల్స్‌ను లక్ష్యంగా ఎంచుకోవడం, ఆ క్రమంలో మనోజ్‌కు ఎదురైన సవాళ్లను స్ఫూర్తిదాయకంగా తెరపైన ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు విధు వినోద్ చోప్రా 13 ఏళ్ల విరామం తర్వాత 'ట్వల్త్ ఫెయిల్' కోసం మళ్లీ మెగాఫోన్ పట్టారు. అంతేకాదు కథ, నిర్మాణం, ఎడిటింగ్ బాధ్యతలను తన భుజాన వేసుకున్నారు.

నిర్మాతల సహకారం వల్లే



సంపూర్ణేష్ బాబు హీరోగా 2014లో వచ్చిన 'హృదయ కాలేయం' సినిమాతో తెలుగు తెరకు దర్శకుడిగా పరిచయమయ్యారు నీలం సాయి రాజేష్. ఆ తర్వాత 'కొబ్బరి మట్ట', 'కలర్ ఫొటో' చిత్రాలకు పనిచేశారు. 2023లో 'బేబీ' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా స్క్రీన్‌ప్లేకు గాను జాతీయ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా అవార్డు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ మేల్ సింగర్..ఇలా రెండు జాతీయ అవార్డులు 'బేబీ' సినిమాకు రావడం ఆనందంగా ఉంది. స్క్రీన్‌ప్లేకి జాతీయ అవార్డు రావడమనేది చాలా పెద్ద విషయం. నన్ను నమ్మి నాతో సినిమా తీసిన నిర్మాతలకు నా ధన్యవాదాలు' అని అన్నారు.

ఆదరణ... అవార్డులు

హీరోల ఇమేజ్‌ను వాడుకుంటూ మూస ధోరణిలో సినిమాలు చేయడానికే ఎక్కువ మంది యువ దర్శకులు ప్రయత్నిస్తున్న తరుణంలో అనిల్ రావిపూడి మాత్రం బాలకృష్ణ లాంటి ఫైర్ బ్రాండ్‌ను పెట్టుకొని 'భగవంత్ కేసరి' చిత్రంతో ఓ కొత్త ప్రయత్నం చేశారు. ఆడబిడ్డను సివంగిలా తయారుచేయాలనే సందేశాన్ని హృదయాలకు హత్తుకునేలా ఆవిష్కరించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల అంశాలను స్పృశిస్తూనే వాటికి మన ఇంటి నుంచే ఓ పరిష్కారం రావాలంటూ చూపించిన తీరు ఆకట్టుకుంది. కొన్నాళ్లుగా అభిమానులను మాత్రమే మెప్పించే మాస్ పాత్రలతో వరుస సినిమాలు చేస్తున్న బాలకృష్ణ తన పంథా మార్చి తండ్రీ కూతుళ్ల బంధం చుట్టూ కథను అంగీకరించడమూ విశేషమే. బాలకృష్ణ సినిమా అంటే మాస్‌ను మెప్పించే హంగులు, భారీ పోరాటాలు, నేపథ్య సంగీతం ఎలివేషన్లతో థియేటర్లు దద్దరిల్లిపోవాలనే ట్రెండ్ ఉధృతంగా నడుస్తున్న టైమ్‌లో బాలకృష్ణ ఈ చిత్రంలో పిల్లలపై వాత్సల్యం కురిపించే పాత్ర చేశారు. ఆయనకు ఈ చిత్రంలో కథానాయికతో డ్యూయెట్ సైతం లేదు. స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి తన పాత్ర పరిధి మేరకు ఆయన నటించారు. ఆ ప్రయత్నం వృథాగా పోలేదు. అప్పట్లో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకొన్న 'భగవంత్ కేసరి' నేడు జాతీయ పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికవడం ద్వారా మరో ఘనతను సాధించింది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఒక మహిళ ధైర్యంగా నిలబడాలి అనే సామాజిక స్పృహతో దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. భయస్తురాలైన ఓ అమ్మాయి ధైర్యవంతురాలిగా మారేలా ప్రోత్సహించేలా మార్గదర్శకుడి పాత్రలో బాలకృష్ణ అద్భుతంగా నటించారు. స్నేహితుడి కూతురుకు తానే తండ్రై సాకడంతో పాటు ఓ సివంగిలా ఆమెను తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమించే పాత్రను తన నటనతో రక్తికట్టించారు. ఆయన తెలంగాణ యాసలో చెప్పిన సంభాషణలు సైతం ఆకట్టుకున్నాయి. తెలంగాణ గద్దర్ పురస్కారాల్లో 2023లో ఉత్తమ తృతీయ చిత్రంగా 'భగవంత్ కేసరి' పురస్కారాన్ని దక్కించుకుంది. భగవంత్ కేసరి చిత్రానికి జాతీయ అవార్డు దక్కడానికి గల కారణాలను జ్యూరీ సభ్యులు వివరించారు. ఒక భయస్తురాలైన సాధారణ యువతి ధైర్యవంతురాలిగా ఎలా మారింది అనే చక్కటి కథాంశంతో ఈచిత్రం తెరకెక్కిందని జ్యూరీ ప్రశంసించింది. భావోద్వేగ సన్నివేశాలు, పోరాట ఘట్టాలు బలంగా ఉన్నాయని పేర్కొంది.



విజేతలకు అభినందనలు...

తెలుగు చలన చిత్ర పరిశ్రమకు జాతీయ అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్‌కేసరి' సినిమాకు జాతీయ అవార్డు రావడం ఆనందంగా ఉందని, నాడు ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రానికి ఇప్పుడు అవార్డులు కూడా రావడం గొప్ప విషయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తెలుగు సినిమా రంగానికి పలు పురస్కారాలు దక్కడం సంతోషంగా ఉందని, 'భగవంత్ కేసరి' చిత్రం ఉత్తమ తెలుగు చిత్రం పురస్కారానికి ఎంపికవడం ఆనందదాయకమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు 7 అవార్డులు రావడం గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోని పల్లెవాసనకు పట్టంకట్టి ఆ పరిమళాలను విశ్వవ్యాప్తం చేసిన 'బలగం' సినిమాకు అవార్డు రావడం 4 కోట్ల మంది ప్రజలకు ఎంతో గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

ఉత్తమ బాలనటిగా సుకుమార్ తనయ



'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నటనకు గాను జాతీయ ఉత్తమ బాలనటిగా మరో నలుగురితో కలసి సంయుక్తంగా అవార్డుకు ఎంపికయ్యారు. సుకృతి వేణి బండ్రెడ్డి. అందరి హృదయాల్ని తాకేలా, మనసుల్ని హత్తుకునేలా 'గాంధీ తాత చెట్టు' కథ ఉంటుంది. దర్శకుడు సుకుమార్ కుమార్తె అయిన సుకృతి వేణి బండ్రెడ్డి నటనకు అందరూ ముగ్ధులయ్యారు. మొదటి చిత్రంతోనే జాతీయ అవార్డు గెలిచిన సుకృతిని చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రశంసించారు.

ఈ గౌరవం చిత్ర బృందానిదే!

జాతీయ పురస్కారాల్లో 'భగవత్ కేసరి' ఎంపిక కావడం నాకు అపారమైన గౌరవం. ఈ గౌరవం మొత్తం మా చిత్ర బృందానికే దక్కుతుంది. చిత్ర నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది, ఈ కథను అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు అనిల్ రావిపూడి, అలాగే ప్రతి కళాకారుడు, సాంకేతిక నిపుణుడు, సిబ్బంది అందరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. ఈ గుర్తింపు మాకు మరింత స్ఫూర్తిని స్తూ..ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను తాకే శక్తిమంతమైన కథలను అందించాలన్న మా తపనను మరింత బలపరుస్తోంది.

\- నందమూరి బాలకృష్ణ

బాధ్యత పెంచింది



'భగవంత్ కేసరి'కి జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి ఆనందం వ్యక్తం చేశారు. 'కథను నమ్మి మేము చేసిన ప్రయత్నానికి గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. ప్రతి సినిమాను బాధ్యతగా చేస్తాం. ఇప్పుడు అది మరింతగా పెరిగింది' అని అన్నారు.

పల్లె పాటకు గౌరవం



వరంగల్‌లో జన్మించిన కాసర్ల శ్యామ్ బాల్యం నుంచే కళల పట్ల ఆసక్తిని ఏర్పరచుకొన్నారు. సినిమాల్లోకి రాకముందు శ్యామ్ జానపద గీతాలు రాసి పాడారు. సుమారు 50కి పైగా ఆల్బమ్స్‌కి ఆయన పాటలు రాశారు. 2003లో జయ దర్శకత్వంలో తెరకెక్కిన 'చంటిగాడు' సినిమాతో శ్యామ్‌కు తొలి అవకాశం వచ్చింది. 2009లో వచ్చిన 'మహాత్మా' సినిమాలో రాసిన 'నీలపురి గాజుల ఓ నీలవేణి' పాటకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పటి వరకు ఆయన వంద సినిమాల్లో 250కి పైగా పాటలు రాశారు. 'బలగం' సినిమాలో 'ఊరూ పల్లెటూరు' పాటకు జాతీయ స్థాయిలో ఉత్తమ గేయ రచయిత అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' ఎందరో ప్రముఖుల తర్వాత 'ఊరు పల్లెటూరు' పాటకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అదృష్టంగా భావిస్తున్నా. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ పల్లె స్వచ్ఛతను, చాటి చెప్పిన ఈ పాట జాతీయ స్థాయిలో నాకు గుర్తింపు తీసుకొచ్చినందుకు తెలుగు వాడిగా చాలా సంతోషపడుతున్నా. ఈ అవార్డు రావడానికి కారణమైన చిత్ర దర్శకుడు వేణుకు, నిర్మాతలు హర్షిత్‌రెడ్డి, హర్షిత, దిల్‌రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇంత మంచి పాటకు సంగీతం సమకూర్చిన భీమ్స్‌కు, గాయకులు రామ్ మిరియాల, మంగ్లీకి నా కృతజ్ఞతలు' అని అన్నారు.

జీతం 15 వేలు.. ఆస్తి వంద కోట్లు!

» కాంట్రాక్టు ఉద్యోగి భారీ అక్రమాలు

» లోకాయుక్త దాడులతో వెలుగులోకి


బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేసే ఆయన జీతం నెలకు రూ.15 వేలు. కానీ ఆయన మొత్తం ఆస్తి విలువ దాదాపు రూ.100 కోట్లు. జీతం, ఆస్తికి సంబంధించిన ఈ రెండు అంకెలను పోల్చి చూస్తే ఎవరికైనా దిమ్మతిరిగి పోవాల్సిందే!! ఒక క్లర్క్‌గా పనిచేసే ఆయన.. కీలక అధికారులను తనకు అనుకూలంగా మలచుకొని, వారితో కలిసి భారీగా అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. లోకాయుక్త తాజా దాడుల్లో ఈ వ్యవహారం బయటపడింది. ఏకంగా లెక్కల్లో చూపని రూ.30 కోట్లకు పైగా ఆస్తులను అధికారులు గుర్తించారు. వీటిల్లో 24 ఇళ్లు, ఐదు ప్లాట్‌లు, 40 ఎకరాల వ్యవసాయ భూములు, కార్లు, బంగారం తదితరాలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(కేఆర్‌ఐడీఎల్)లో కళకప్ప నిడగుంది అనే వ్యక్తి కాంట్రాక్టు పద్ధతిన 2003లో చెత్త ఊడ్చే పనిలో చేరాడు. అప్పట్లో అతని నెల జీతం రూ.200 మాత్రమే. 17 ఏళ్ల సర్వీసు తర్వాత ఉద్యోగోన్నతిపై క్లర్క్ స్థాయికి చేరాడు. ఈ క్రమంలో కేఆర్‌ఐడీఎల్‌లో పనిచేసే కొందరు అధికారులతో కలిసి భారీగా అక్రమాలకు పాల్పడ్డాడు. 2023-24 మధ్య చేపట్టిన పనుల్లో రూ.72 కోట్ల దాకా అక్రమాలు జరిగాయని, 96 అసంపూర్తి ప్రాజెక్టులకు నకిలీ పత్రాలు సృష్టించి.. ఈ సొమ్మును కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చించోళ్కర్, కళకప్ప పాత్ర ఉన్నట్లు తేలింది. దీంతో 2024లో వీరిద్దరినీ సస్పెండ్ చేశారు. అప్పటికి కళకప్ప నెల జీతం రూ.15 వేలు. ఇతని అక్రమాల గురించి లోకాయుక్త బృందం సమగ్ర ఆధారాలు సేకరించింది.

పేదరికం నుంచి రూ.కోట్లకు పడగలెత్తాడు!

డీఎస్పీ వసంతకుమార్ నేతృత్వంలో కొప్పళ జిల్లా కేంద్రంలోని కళకప్ప నివాసం, గతంలో పనిచేసిన కార్యాలయంలో గురువారం ఏకకాలంలో దాడులు చేసింది. కళకప్పకు కొప్పళ, భాగ్యనగరలో 24 ఇళ్లు ఉన్నట్లు గుర్తించింది. హిట్నాళ్, హళగి, యలబురగలో 40 ఎకరాల భూమి, 5 ఇంటి స్థలాలను గుర్తించింది. వీటితో పాటు రెండు కార్లు, రెండు బైకులు, 350 గ్రాముల బంగారం,



కేజీన్నరకు పైగా వెండి వస్తువులను కూడా అధికారులు సీజ్ చేశారు. ఈ ఆస్తులు కళకప్ప, ఆయన భార్య, సోదరుడి పేర్లపై ఉన్నాయి. పలువురి బినామీల పేరిట కూడా ఆస్తులు బయటపడ్డాయి. కాగా, సస్పెండ్ అయిన చించోళ్కర్ కోర్టు నుంచి స్టే తెచ్చుకుని దావణగెరెలో మళ్లీ విధులకు చేరారు. కళకప్పపై సస్పెన్షన్ కొనసాగుతోంది. కాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో లోకాయుక్త అధికారులు గత కొద్ది రోజులుగా పలువురు ప్రభుత్వ అధికారులకు చెందిన ఇళ్లు, ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. జూలై 23నఐఏఎస్ అధికారి వసంతి అమర్‌తో సహా 8మంది అధికారులకు సంబంధించిన ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. రూ.37.42 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశారు.



ప్రభుత్వ పథకాలకు బతికున్న నేతల పేర్లు పెట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కోరుతూ అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్రమోహన్ శ్రీవాస్తవ, జస్టిస్ సుందర్ మోహన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి.. పై ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ ప్రకటనలకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ ప్రకటనల్లో సీఎం స్టాలిన్ ఫొటో ఉండవచ్చని.. అయితే దివంగత పార్టీ నేతలు, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలు, పార్టీ చిహ్నాలు, జెండాలు ఉండరాదని, వాటికి అనుమతి లేదని స్పష్టంచేసింది. ప్రభుత్వ ప్రకటనల్లో అధికార పార్టీ పేరు, చిహ్నం ఉపయోగించడం సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులకు విరుద్ధమని తెలిపింది. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ప్రారంభించబోయే పథకాలు, అమలులో ఉన్న పథకాలకు సంబంధించిన ప్రకటనల్లో రాజకీయ నేతల పేర్లు, ఫొటోలు లేకుండా చూసుకోవాలని ఆదేశించింది. పథకాల ప్రారంభోత్సవాలు, అమలుకు సంబంధించి ఎలాంటి వ్యతిరేక ఉత్తర్వులూ జారీచేయడం లేదని పేర్కొంది. అయితే సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వాన్ని తాము అడ్డుకోవడం లేదని.. వాటిని ప్రచారం చేస్తున్న తీరుపైనే అభ్యంతరమని స్పష్టత ఇచ్చింది. 'ఉంగళుడన్ స్టాలిన్' పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించింది. ఆయన పేరుతోనే శనివారం మరో ఆరోగ్య పథకాన్ని ప్రారంభించనుంది. పిటిషనర్ షణ్ముగం తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ నారాయణ్ వాదనలు వినిపించారు. కొందరు రాజకీయ నేతలను ప్రమోట్ చేయడానికి రాష్ట్రప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని, 2014నాటి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తోందని తెలిపారు. అయితే రాజకీయ చిహ్నాలు కనిపించే ఎలాంటి మెటీరియల్ ఉన్నా చట్టనిబంధనలను ఉల్లంఘించినట్లేనని హైకోర్టు స్పష్టంచేసింది.

సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

» ఈ నెల 7న నోటిఫికేషన్ జారీ..అదే రోజు నామినేషన్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల కమిషన్ (ఈసీ) షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల ఏడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని.. అదే రోజు నామినేషన్ల దాఖలు మొదలవుతుందని.. 21వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉంటుందని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 22న నామినేషన్లు పరిశీలిస్తారు. పోటీ నుంచి ఉపసంహరించుకునేందుకు ఆఖరి గడువు 25వ తేదీ. అనివార్యమైతే వచ్చే నెల 9వ తేదీన పోలింగ్ జరుగుతుందని ఈసీ తెలిపింది. గత నెల 21న జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 9న పార్లమెంటు భవనం మొదటి అంతస్తులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితం ప్రకటిస్తారు.

'షక్సగాం'లో చైనా చొరబాటు

న్యూఢిల్లీ ఆగస్టు 1: సరిహద్దు ప్రాంతాల్లోని భారత భూభాగంలో చైనా అక్రమ చొరబాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. భారత్‌కు వ్యూహాత్మక ప్రాంతమైన షక్సగాం వ్యాలీలో డ్రాగన్ కంట్రీ రోడ్ల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తోంది. అత్యంత క్లిష్టమైన ఈ లోయలో చైనా చేపట్టిన రహదారి విస్తరణ, మౌలిక సదుపాయాల పనులను ఉపగ్రహ ఛాయా చిత్రాలు స్పష్టం చేశాయి. షక్సగాంలో చేపట్టిన కొత్త రోడ్డు.. చైనాలోని అక్సాయ్‌చిన్(జీ219) జాతీయ రహదారిని కలుపుతుంది. వాస్తవానికి షక్సగాం వ్యాలీ భారత్ పరిధిలో, ఉత్తర లడఖ్‌లోని సియాచిన్‌కు సమీపంలోనే ఉంది. అయితే.. 1963లో పాకిస్థాన్ ఓ ఒప్పందం ద్వారా దీనిని చైనాకు అప్పగించింది. ఫలితంగా అప్పటి నుంచి ఈ లోయపై చైనా నియంత్రణే కొనసాగుతోంది. కానీ, సదరు ఒప్పందాన్ని భారత్ తిప్పికొడుతోంది. దీనిని చట్టవిరుద్ధమని పేర్కొంటోంది. కాగా, ప్రస్తుత ఉపగ్రహ ఛాయా చిత్రాలపై ఓపెన్-సోర్స్ ఇంటెలిజెన్స్ విశ్లేషకుడు నాథన్ రూసర్, పరిశోధకులు నేత్రా దేశాయ్ స్పందిస్తూ.. అత్యంత క్లిష్టమైన షక్సగాంలో చైనా రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు.

బెట్టింగ్ యాప్‌ల విషయంలో కేంద్రంపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ఈ అంశంపై కేంద్రం కౌంటర్ దాఖలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మార్చి 26న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, గత విచారణ సందర్భంగా దీనిపై స్పందించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు మళ్లీ విచారణ చేపట్టింది. అయితే, గత విచారణ సందర్భంగా నోటీసులు ఇచ్చినప్పటికీ, కౌంటర్ దాఖలు చేయకపోవడంతో కేంద్రంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. బెట్టింగ్ యాప్‌లను కేంద్రం సమర్థిస్తుందా? వ్యతిరేకిస్తుందా? బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది? అంటూ కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం వైఖరి తెలుసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

వాణిజ్య సిలిండర్ ధర రూ.33.50 తగ్గింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: కేంద్ర ప్రభుత్వ రంగ చమురు సంస్థలు వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ (19 కిలోలు) ధర స్వల్పంగా రూ.33.50 తగ్గిస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నాయి. దీంతో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,631.50 లకు చేరుకున్నది. తద్వారా వాణిజ్య వినియోగదారులకు ఉపశమనం లభించనుంది. తగ్గించిన ధర శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. కానీ, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ (14.2 కిలోలు) ధరలో ఎటువంటి మార్పు లేదు.

రష్యా సమీపంలోకి అమెరికా అణు జలంతర్గాములు

వాషింగ్టన్, ఆగస్టు 1: తనను ఉద్దేశించి వ్యంగ్య వ్యాఖ్యలు చేసిన రష్యా మాజీ అధ్యక్షుడు, ఆ దేశ భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వెదేవ్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. మెద్వెదేవ్ వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, రెండు అణు జలంతర్గాములను రష్యాకు సమీపంలో మోహరించాలని తమ సైనికాధికారులను ఆదేశించానని శుక్రవారం ప్రకటించారు. భారత్, రష్యాలను పతన ఆర్థిక వ్యవస్థ (డెడ్ ఎకానమీ)లు అంటూ అభివర్ణించిన ట్రంప్‌ను వ్యంగ్యంగా విమర్శిస్తూ.. 'ట్రంప్‌కు ఇష్టమైన వాకింగ్ డెడ్ వంటి రక్తపిశాచి సినిమాలు ఆయనను వెంటాడుతున్నట్టున్నాయి' అని మెద్వెదేవ్ గురువారం పేర్కొన్నారు. ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఆటోమేటిక్ అణ్వస్త్ర దాడి వ్యవస్థ 'డెడ్ హ్యాండ్'ను గుర్తు తెచ్చుకోవాలంటూ.. పరోక్షంగా అణు దాడికీ సిద్ధమే అన్నట్టు హెచ్చరించారు.

ట్రంప్ సుంకాలతో అమెరికా కుటుంబాలపై దెబ్బ!

» సగటున 2,400 డాలర్ల వ్యయం పెరగొచ్చు.. ఎస్బీఐ రిపోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశంలోకి వచ్చే వివిధ దేశాల ఉత్పత్తులపై కొత్తగా విధించిన సుంకాలు అమెరికన్ కుటుంబాలను గణనీయంగా ప్రభావితం చేయవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. సుంకాల దెబ్బతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని, ఫలితంగా స్వల్పకాలంలో అమెరికన్ కుటుంబాల సగటు వ్యయాలు దాదాపు 2,400 డాలర్లు (దాదాపు రూ.2,09,460) పెరిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ పరిశోధనా నివేదిక పేర్కొంది. పెరిగిన కుటుంబాల వ్యయాల భారం అన్ని కుటుంబాలకు ఒకే విధంగా ఉండదని, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు దాదాపు 1,300 డాలర్ల నష్టాన్ని చవిచూసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ భారం సంపన్న కుటుంబాలతో పోల్చితే దాదాపు మూడు రెట్లు ఎక్కువని తెలిపింది. మరోవైపు అధిక ఆదాయ కుటుంబాలు 5,000 డాలర్ల వరకు నష్టాన్ని ఎదుర్కొవచ్చని అంచనా వేసింది. కొత్త వాణిజ్య యుద్ధం భారత్‌కన్నా అమెరికా ఆర్థిక వ్యవస్థనే ఎక్కువగా దెబ్బతీయవచ్చని పేర్కొంది. తక్కువ జీడీపీ వృద్ధి అంచనా, పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి తోడు కొత్త సుంకాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత నష్టపోతుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఇక అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని, కొత్త సుంకాల ప్రభావంతో ద్రవ్యోల్బణం అమెరికా ఫెడరల్ రిజర్వు 2026 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 2 శాతం కన్నా ఎగువన ఉండవచ్చని నివేదిక పేర్కొంది. సుంకాల సంబంధిత ఒత్తిళ్ల ఫలితంగా అమెరికా జీడీపీపై దాదాపు 40 నుంచి 50 బేసిస్ పాయింట్ల మేర దెబ్బ పడవచ్చని తెలిపింది. ఇక భారత్‌పై ఆర్థిక ప్రభావం తక్కువగా ఉండనుందని ఎస్బీఐ అంచనా వేసింది.

ప్రజ్వల్ రేవణ్ణ దోషి




బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అత్యాచారం కేసులో జేడీఎస్ బహిష్కృత నేత, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ (34)ను బెంగళూరు కోర్టు దోషిగా తేల్చింది. గత ఏడాది హాసన్ జిల్లాలో ఆయనపై నమోదైన నాలుగు రేప్ కేసుల్లో ఒకదానిలో దోషిగా తేలుస్తూ స్థానిక ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. న్యాయాధికారి సంతోష్ గజానన్ భట్ శనివారం శిక్ష ఖరారు చేయనున్నారు. జడ్జి తీర్పు వినగానే.. ప్రజ్వల్ రేవణ్ణ కోర్టు హాల్‌లోనే విలపించాడు. తమ కుటుంబానికి చెందిన ఓ ఫాంహౌస్‌లో ఇంట్లో పనిచేసే మహిళపై అత్యాచారం చేసి, ఆ దురాగతాన్ని వీడియో తీసినట్లు పేర్కొంటూ నమోదైన కేసులో కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ప్రజ్వల్ రేవణ్ణ దీంతో సహా నాలుగు రేప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. రేవణ్ణ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు భారీగా వీడియోలు బయటకు రావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ పరిణామం తర్వాత ఆయనపై నాలుగు రేప్ కేసులు నమోదయ్యాయి. అప్పుడు హాసన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీచేసిన రేవణ్ణ ఓడిపోయారు. ప్రజ్వల్ రేవణ్ణ మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ మనవడు. ప్రజ్వల్ రేవణ్ణపై రేప్ కేసు నమోదైన తర్వాత ఆయన్ను జేడీఎస్ నాయకత్వం పార్టీ నుంచి బహిష్కరించింది.

ప్రస్తుత కేసు నేపథ్యమిదీ..

మైసూరు జిల్లా కేఆర్ నగర్‌కు చెందిన 48 ఏళ్ల ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గత ఏడాది ఏప్రిల్ 28న ప్రజ్వల్‌పై అత్యాచార కేసు నమోదైంది. హాసన్ జిల్లా హొళెనరసీపురలోని వారి కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లో పనిచేసే మహిళ.. రేవణ్ణ తనపై 2021లో రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫాంహౌస్‌లో, బెంగళూరు బసవనగుడిలోని ఆయన తండ్రి రేవణ్ణ నివాసంలో అత్యాచారం చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఆ దురాగతాన్ని మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడని తెలిపారు. ప్రజ్వల్ కేసు దర్యాప్తు కోసం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో బాధితురాలిని ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ, తల్లి భవాని కిడ్నాప్ చేశారు. సిట్ పోలీసులు 2024 సెప్టెంబరులో ఆమెను రక్షించారు. అంతకుముందు మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు 2024 ఏప్రిల్ 26న బయటకు వచ్చిన తర్వాత ప్రజ్వల్ జర్మనీకి పారిపోయాడు. తిరిగొచ్చిన రేవణ్ణను పోలీసులు బెంగళూరు విమానాశ్రయంలో మే 31 పోలీసులు అరెస్టు చేశారు. హొళేనరసిపుర పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో ముమ్మర దర్యాప్తు జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం 1,632 పేజీలతో గత ఏడాది డిసెంబరులో చార్జిషీట్ దాఖలు చేసింది. 113 మంది సాక్షులను విచారించినట్లు పేర్కొంది. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ 3న అభియోగాలు మోపింది. ప్రజ్వల్ పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో 14 నెలలుగా ఉంటున్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ మాజీ ఎంపీ, నటి రమ్య ఎక్స్‌లో స్పందించారు.

అనిల్ అంబానీపై లుక్‌అవుట్ నోటీసులు



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ప్రముఖ వ్యాపారవేత్త, అనిల్ ధీరుభాయ్ అంబానీ గ్రూప్ (ఏడీఏజీ) చైర్మన్ అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రూ.3 వేల కోట్ల బ్యాంకు రుణ మోసానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆయనపై ఈడీ లుక్ అవుట్ నోటీస్ జారీ చేసింది. ఈ కేసులో ఈనెల 5న ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ తొలుత ఆయనకు సమన్లు ఇచ్చింది. అయితే ఆయన దేశం విడిచిపోకుండా చూసే ఉద్దేశంతో అనంతరం లుక్‌అవుట్ సర్క్యులర్ కూడా జారీ చేసింది. 2017-19 మధ్య అంబానీ గ్రూప్ కంపెనీలకు యెస్ బ్యాంకు ఇచ్చిన రూ.3 వేల కోట్ల రుణాలను దారి మళ్లించారనే ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. రుణం మంజూరు చేయడానికి యెస్ బ్యాంకు ప్రమోటర్లకు ముడుపులు ఇచ్చారన్న అభియోగాలున్నాయి. అలాగే రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకున్న రూ.10 వేల కోట్ల రుణాలను కూడా దారి మళ్లించారనే ఆరోపణలున్నాయి. ఇటు ఆర్‌కామ్-కెనరా బ్యాంకుల మధ్య రూ.1,150 కోట్ల రుణం విషయంలో అవకతవకలు.. ఏటీ-1 బాండ్లలో రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ పెట్టిన రూ.2,850 కోట్ల పెట్టుబడుల్లోనూ 'క్విడ్ ప్రోకో' జరిగినట్లు ఆరోపణలున్నాయి. మొత్తంగా రూ.17 వేల కోట్ల ఆర్థిక అవకతవకలకు సంబంధించి అనిల్ అంబానీని ప్రశ్నించి.. ఈడీ ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయనుంది.

ఎస్ఐఆర్‌పై చర్చకు పట్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై చర్చ విషయంలో విపక్షాలు పట్టువీడడం లేదు. ఎస్ఐఆర్ అంశం శుక్రవారం కూడా పార్లమెంట్ ఉభయసభలను కుదిపేసింది. దీంతో విపక్ష సభ్యుల ఆందోళనల నడుమ పలుమార్లు వాయిదా పడుతూ జరిగిన లోక్‌సభ, రాజ్యసభ ఎలాంటి చర్చలు లేకుండానే సోమవారానికి వాయిదా పడ్డాయి. ఇక, రాజ్యసభ వెల్‌లోకి దూసుకొచ్చిన సభ్యులను మార్షల్స్ అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. రాజ్యసభను పారామిలటరీ చేతికి అప్పగించారంటూ కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తొలుత ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగా స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల నిర్వహణకు సిద్ధమయ్యారు. కానీ ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఎస్ఐఆర్‌పై చర్చ, ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండడంతో సభ మొదలైన మూడు నిమిషాలకే మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. రెండు గంటలకు సభ పునఃప్రారంభమైన తర్వాత గోవా శాసనసభలో ఎస్టీలకు సీట్లు కేటాయింపునకు సంబంధించిన బిల్లుపై చర్చను స్పీకర్ ప్రతిపాదించగా ప్రతిపక్ష సభ్యులు సహకరించలేదు. మరోపక్క, ఎస్ఐఆర్‌పై రాజ్యసభలోనూ ఇదే తరహా ఆందోళనలు కొనసాగగా.. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ జరగకుండానే సభ వాయిదా పడింది. ఇదిలా ఉండగా, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో చర్చించలేమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు శుక్రవారం తెలిపారు. ఈసీకి సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో చర్చించలేమంటూ కాంగ్రెస్ నేత, దివంగత బలరాం జాఖర్ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఇచ్చిన ఉత్తర్వులనే తాము అనుసరిస్తున్నామని రిజిజు పేర్కొన్నారు.

బీజేపీ కోసం ఈసీ ఓట్ల చోరీ

దీనిపై ఆటంబాంబు వంటి ఆధారం మా వద్ద ఉంది.. దాన్ని పేల్చితే దాక్కోడానికి ఈసీకి చోటు కూడా దొరకదు

» ఆరు నెలలపాటు దర్యాప్తుచేసి ఈసీ గుట్టును పట్టాం: రాహుల్



శుక్రవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందని నిరూపించే ఆటంబాంబు వంటి ఆధారం తమ వద్ద ఉన్నదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వెల్లడించారు. ఆ ఆటంబాంబును పేల్చితే ఈసీకి దేశంలో దాక్కోవడానికి చోటు కూడా మిగలదని వ్యాఖ్యానించారు. ఈసీ చర్య విద్రోహం కిందకే వస్తుందని, ఇందులో భాగస్వాములైన ఉన్నతాధికారుల నుంచి కింది సిబ్బంది వరకు ఎవరినీ వదిలిపెట్టబోమని, ఒకవేళ రిటైరు అయి ఎక్కడెక్కడో ఉన్నా వెతికిమరీ పట్టుకుంటామని రాహుల్ హెచ్చరించారు. బిహార్‌లో ఎస్ఐఆర్ తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో రాహుల్ ఈసీపై విమర్శలు గుప్పించారు. నిజానికి, ఈ నెల ఐదో తేదీన కర్ణాటకలో ఈసీ అక్రమాలను బయటపెడతామని గురువారమే కాంగ్రెస్ పార్టీ హెచ్చరించింది. దీనిపై రాహుల్ గాంధీ నాయకత్వంలో బెంగళూరులో భారీ నిరసన ప్రదర్శన కూడా ఉంటుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ చేసిన 'ఆటంబాంబు' వ్యాఖ్య ఆసక్తిని రేపుతోంది. "ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ముందునుంచీ నేను చెబుతూనే ఉన్నాను. ఇప్పుడు దానికి సంబంధించిన ఆధారం కూడా మాకు లభించింది" అని పార్లమెంటు ఆవరణలో రాహుల్ అన్నారు. 2023లో మధ్యప్రదేశ్ ఎన్నికలు, ఆ మరుసటి ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు, ఇటీవలి మహారాష్ట్ర ఎన్నికల్లో పోలింగ్ ఉల్లంఘనలు జరిగాయన్నారు. "మహారాష్ట్రలో ఓటర్ల సవరణ పేరిట కోటిమందిని కొత్తగా ఎన్నికల జాబితాలో చేర్చారని మేం ఇప్పటికీ నమ్ముతున్నాం. ఆధారాలతో ఈసీని కలిసినా అప్పట్లో ఉపయోగం లేకపోయింది. దీంతో మేమే రంగంలోకి దిగాం. సొంతంగా ఆరునెలలపాటు దర్యాప్తు జరిపి.. ఈసీకి వ్యతిరేకంగా 'ఆటంబాంబు' వంటి ఆధారం కనుగొన్నాం." అని రాహుల్‌గాంధీ వివరించారు. మరోవైపు, 'ఓట్లచోరీ' అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఈసీ తోసిపుచ్చింది. అలాంటి నిరాధార ఆరోపణలను పట్టించుకోనక్కర్లేదని తన సిబ్బందికి స్పష్టంచేసింది. "ఈసీపై నిరాధార ఆరోపణలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం రోజువారీ వ్యవహారంగా మారింది. బాధ్యత లేని ఇలాంటి ప్రకటనలను పట్టించుకోకుండా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని మా సిబ్బందిని కోరాం." అని వివరించింది. తమ వద్ద 'ఆటంబాంబు' లాంటి ఆధారం ఉన్నదన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'ఆటంబాంబులా పేలొద్దు. నీరులా ప్రవహించండి' అంటూ ఎద్దేవాచేసింది. మర్యాద లేకుండా ఈసీపై అప్రజాస్వామిక భాషను రాహుల్ వాడటం సరికాదని సంబిత్ పాత్రా మండిపడ్డారు.

బిహార్‌లో 65 లక్షల ఓట్లు 'మిస్సింగ్'

బిహార్‌లో ఎస్ఐఆర్ కసరత్తు పూర్తయిన నేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది ఇందులో చేర్చలేదని స్పష్టమైంది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో 7.9 కోట్ల ఓట్లు ఉండగా, తాజాగా ఆ సంఖ్య 7.24 కోట్లకు తగ్గింది. మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 90,817 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల జాబితాను ఈసీ క్షుణ్ణంగా పరిశీలించింది. మృతి చెందిన, వలస వెళ్లిన, ఒకసారి కంటే ఎక్కుసార్లు రిజిస్టర్ అయిన, చిరునామాలేని ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. రాజధాని పాట్నాలో అత్యధికంగా 3.95 లక్షల మంది చోటు కోల్పోయారు.

పాకిస్థాన్‌పై 19 శాతమే!

» తమతో ఒప్పందం కుదుర్చుకోని 69 దేశాలపై ట్రంప్ సుంకాలు

» ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం

» ఆగస్టు 7 నుంచి అమల్లోకి



న్యూయార్క్/వాషింగ్టన్, ఆగస్టు 1: సుంకాల రంకెలు వేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తమతో ఇంకా ఒప్పందం కుదుర్చుకోని 69 దేశాలపై టారిఫ్‌ల భారాన్ని ఖరారు చేశారు. భారత ఉత్పత్తులపై 25 శాతం సుంకాల భారం మోపిన ఆయన.. పాకిస్థాన్ ఉత్పత్తులపై 19 శాతమే విధిస్తున్నట్టు వెల్లడించారు. ఈమేరకు.. 'ఫర్దర్ మాడిఫయింగ్ ద రెసిప్రోకల్ టారిఫ్స్' పేరిట రూపొందించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. తమతో ఇప్పటికే చాలా దేశాలు అర్థవంతమైన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయని.. మరికొన్ని దేశాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాయని అందులో తెలిపారు. "మిగతా దేశాలు చర్చలు జరుపుతున్నప్పటికీ.. అమెరికాతో ఉన్న వాణిజ్య అసమతౌల్యాలను పరిష్కరించే దిశగా సరైన ప్రతిపాదనలు చేయట్లేదని నాకు అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. అలాంటి దేశాలపై సుంకాలు విధిస్తున్నట్టు తెలిపారు. ట్రంప్ పేర్కొన్న అలాంటి దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. ఈసారి లావోస్, మయన్మార్ దేశాలపై అత్యధికంగా 40% సుంకం, స్విస్ ఎగుమతులపై 39%, కెనడాపై 35% విధించిన ట్రంప్.. జపాన్‌పై 15%, పాకిస్థాన్, థాయ్‌ల్యాండ్, మలేసియా దేశాలపై 19%, శ్రీలంకపై 20 శాతం సుంకాలు విధించారు. కెనడాపై సుంకాల బాదుడు శుక్రవారం నుంచే (ఆగస్టు 1) అమల్లోకి రాగా.. మిగతా దేశాలపై 7వ తేదీ నుంచి అమలవుతుందని తెలిపారు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై అదనంగా జరిమానా కూడా వేస్తామన్న ఆయన.. కార్యనిర్వాహక ఉత్తర్వులో మాత్రం ఆ ప్రస్తావనే తేకపోవడం గమనార్హం. కాగా.. ఇప్పటికే అమెరికాకు ఎగుమతి అయ్యి, దారిలో ఉన్న ఉత్పత్తులపై, లోడింగ్ పూర్తయి ఆగస్టు 7లోగా బయల్దేరడానికి నౌకల్లో సిద్ధంగా ఉన్న ఉత్పత్తులపై.. కొత్త సుంకం వర్తించదని 'భారత ఎగుమతి సంఘాల సమాఖ్య' డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. ట్రంప్ సుంకాల భారం నేపథ్యంలో.. దేశ ప్రయోజనాలను కాపాడడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భారత ప్రభుత్వం పేర్కొంది. అమెరికాతో వాణిజ్య చర్చల్లో వ్యవసాయ, పాల ఉత్పత్తుల రంగ ప్రయోజనాలను పరిరక్షిస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. "మన ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి.. మార్కెట్లో అందుబాటులో ఉన్నదానిని బట్టి, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. తద్వారా.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడం ఆపబోమని ఆయన చెప్పకనే చెప్పారు.

ఇవీ లెక్కలు!

18%

2021-25 నడుమ.. అమెరికా భారతదేశ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. మన మొత్తం ఎగుమతుల్లో 18 శాతానికిపైగా ఒక్క అమెరికాకే వెళ్లాయి.

6.22%

మన దిగుమతుల్లో అమెరికా ఉత్పత్తుల వాటా కేవలం 6.22 శాతం.

రూ.15.51 లక్షల కోట్లు

వస్తువులు, సేవలు.. అన్నీ కలిపి 2024-25లో ఇరుదేశాల మధ్య జరిగిన వాణిజ్యం విలువ 186 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.51 లక్షల కోట్లు). ఇందులో భారతదేశ ఎగుమతులు 86.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7.21 లక్షల కోట్లు) కాగా.. అమెరికా నుంచి భారత్‌కు దిగుమతి అయిన ఉత్పత్తుల విలువ 45.3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3.77 లక్షల కోట్లు). సేవల రంగంలో అమెరికాకు భారత ఎగుమతుల విలువ 28.7 బిలియన్ డాలర్లు (రూ.2.39 లక్షల కోట్లు) కాగా.. దిగుమతుల విలువ 25.5 బిలియన్ డాలర్లు (రూ.2.13 లక్షల కోట్లు). అంటే.. 3.2 బిలియన్ డాలర్ల (రూ.26,720 కోట్ల) మిగులు.

రూ. 3.43 లక్షల కోట్లు

అమెరికాతో భారత్‌కు వాణిజ్య మిగులు నానాటికీ పెరుగుతోంది. 2022-23లో అది 27.7 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.2.31 లక్షల కోట్లు) ఉండగా.. 2023-24లో 35.32 బిలియన్ డాలర్లకు (రూ.2.95 లక్షల కోట్లు), 2024-25లో 41 బిలియన్ డాలర్లకు (3.43 లక్షల కోట్లకు) పెరిగింది.



సింగపూర్‌లోని ఏఎల్బీఏ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు వద్ద మంత్రి నారాయణ

ఘన వ్యర్థాల నిర్వహణకు సింగపూర్ మోడల్

- అక్కడి ప్లాంట్, పద్ధతులు పరిశీలించిన మంత్రి నారాయణ

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రోజువారీ వచ్చే చెత్తను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు తరలించడంతో పాటు దాన్ని రీసైకిల్ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా సింగపూర్‌లోని ఏఎల్‌బీఏ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబుతో కలసి మంత్రి నారాయణ శుక్రవారం సందర్శించారు. గృహాలు, పరిశ్రమల నుంచి సేకరించిన ఘన వ్యర్థాలను అధునాతన వాహనాల్లో ఈ ప్లాంట్‌కు తరలిస్తారు. ఇక్కడ ప్లాస్టిక్‌తో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి ఇంధనం ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. వ్యర్థాల సేకరణ నుంచి వాటిని రీసైక్లింగ్ చేసేవరకూ ఎలాంటి పద్ధతులు అవలంబిస్తున్నారో మంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. ఆ తర్వాత ఆయన మలేసియా బయలుదేరి వెళ్లారు. పట్టణాభివృద్ధి, ట్విన్ టవర్స్‌తో పాటు కన్వెన్షన్ సెంటర్లు, రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అంశాలను మంత్రి నారాయణ పరిశీలించనున్నారు.

ఆ స్థానిక సంస్థల పరిధిలో ఎన్నికల కోడ్

- ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో 'పీఎం కిసాన్' మాత్రమే
- కోడ్ సడలించాకే 'అన్నదాత సుఖీభవ': ఎన్నికల సంఘం

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 10, 12 తేదీల్లో జరగనున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పలు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా పంచాయతీలు, మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారని పేర్కొంది. ఎన్నికలు జరిగే ప్రాంతంలో 48 గంటల ముందు ప్రచారం నిలిపేయడం, మద్యం షాపులు మూసేయడంతో పాటు ఎన్నికలు జరిగే రోజుల్లో జిల్లా కలెక్టర్లు ఆయా ప్రాంతాల్లో సెలవులు ప్రకటించాలని ఆదేశించింది. కాగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' కింద కోడ్ అమలులో ఉన్నచోట పీఎం కిసాన్ నిధులు మాత్రమే విడుదల చేయడానికి అనుమతించింది. కోడ్ సడలించిన తర్వాత అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని పేర్కొంది.

జూలైలో జీఎస్టీ వసూళ్లు రూ.2,930 కోట్లు

- గతేడాది జూలై కంటే 12.12% ఎక్కువ

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జూలైలో నికరంగా రూ.2,930 కోట్ల జీఎస్టీ వసూలైంది. గతేడాది జూలైలో వసూలైన నికర జీఎస్టీ కంటే 12.12 శాతం పెరిగింది. అంతేగాక 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇవే అత్యధిక నెలవారీ నికర వసూళ్లు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు నికర జీఎస్టీ పెరుగుతూ వస్తోంది. స్థూల జీఎస్టీ వసూళ్లు కూడా గత ఏడాది జూలై కంటే 14 శాతం పెరిగాయి. నెలవారీ వసూళ్లలో పెరుగుదల వేగంగా నమోదవుతున్న రాష్ట్రాల్లో దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉండగా, దేశవ్యాప్తంగా మూడోస్థానంలో నిలిచింది. ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు 14.47 శాతం వృద్ధి చెందాయి. జూలైలో రూ.1,704 కోట్ల ఐజీఎస్టీ వచ్చింది. గత ఏడాది జూలైలో కంటే 10.69 శాతం పెరిగింది.

పోలీసు ఉద్యోగాల్లో మహిళల సత్తా

(మొదటి పేజీ తరువాయి)

రెండూ జరిగాయని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల కొరత ఇంకా ఉందని, రాబోయే రోజుల్లో మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబరులో శిక్షణ ప్రారంభం అవుతుందని, 9 నెలల్లో శిక్షణ పూర్తి చేసుకుని వారు విధుల్లోకి వస్తారని తెలిపారు. ఈ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విశాఖపట్నానికి చెందిన గండి నానాజీ(ప్రథమ), విజయనగరం వాసి రమ్య మాధురి(ద్వితీయ), రాజమహేంద్రవరానికి చెందిన అచ్యుతరావు(తృతీయ)లకు హోంశాఖ మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా కేటగిరీల వారీగా కటాఫ్ వివరాలను ఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని చెప్పారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలపై కేసు తప్పదు

ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి.. "మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపైకి పంపి హత్య చేయించే కార్యక్రమాలకు శ్రీకారం చుడితే.." అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంపై కేసు నమోదు చేస్తామని మంత్రి అనిత తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించబోమన్నారు. జగన్‌పై కేసు నమోదు చేసి తీరుతామని స్పష్టం చేశారు. వైసీపీ అధ్యక్షుడు ప్రాంతానికి ఒకలా మాట్లాడే రకమని, నగరిలో టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ప్రశ్నిస్తూనే నెల్లూరులో మహిళా ఎమ్మెల్యేపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యేని పరామర్శించడం.. ప్రాంతానికో విధంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. "జగన్ ఇప్పుడు పరామర్శించాల్సింది.. తల్లి, చెల్లినే." అని వ్యాఖ్యానించారు.

'వీఆర్' పనిష్మెంట్ కాదు: డీజీపీ

పోలీసు శాఖలో వేకన్సీ రిజర్వ్(వీఆర్) కూడా శాంక్షన్ పోస్టేనని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. శాఖా పరమైన నిర్ణయాలు పోలీసు శాఖలో అంతర్గత వ్యవహారమని, ఎవరికి ఏ పోస్టింగ్ ఇవ్వాలో తమకు తెలుసని అన్నారు. పోలీసులు వీఆర్‌లో ఉన్నారంటే అది పనిష్మెంట్ కిందికి వస్తాయనుకోవడం సరి కాదన్నారు. పోలీసులకు శాంతి భద్రతలే ముఖ్యమని, రాజకీయపరమైన వివాదాల్లోకి లాగొద్దని సూచించారు. పోలీసు ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చేందుకు డీటీసీలు, పీటీసీలు ఉన్నాయని తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి దగ్గర పోలీసు అకాడమీ కోసం 95 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని, దీంతో పాటు విశాఖపట్నం జిల్లాలో గ్రేహౌండ్స్ నిర్మాణానికి త్వరలో భూమి పూజ జరుగుతుందని వెల్లడించారు. పూర్తిస్థాయి పారదర్శకతతో జరిగిన కానిస్టేబుల్ నియామకాల్లో సమర్థులైన అభ్యర్థులే ఎంపికయ్యారని తెలిపారు. కాగా, రాష్ట్రంలో తప్పిపోయిన బాలికలను కుటుంబాల చెంతకు చేర్చేందుకు నెల రోజుల పాటు 'ఆపరేషన్ ట్రేస్' నిర్వహిస్తున్నట్లు డీజీపీ చెప్పారు.

రెండున్నరేళ్లకు పైగా..

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి 2022, నవంబరు చివరి వారంలో నోటిఫికేషన్ విడుదలైంది. 6,100 పోస్టులకు రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు(ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రాథమిక పరీక్షకు 4.59 లక్షల మంది హాజరయ్యారు. తర్వాత శారీరక సామర్థ్య, దేహ దారుఢ్య పరీక్షల్లో 95 వేల మంది పాల్గొనగా, తుది పరీక్షలో 38,910 మంది అర్హత సాధించారు. కటాఫ్ మార్కుల మేరకు 33,921 మంది అర్హత సాధించినా.. వీరిలోనూ ఎక్కువ మార్కులు సాధించిన 6,100 మందిని ఎంపిక చేసింది. 3,580 సివిల్ పోలీసు కానిస్టేబుల్ పోస్టుల్లో మహిళలు 1,063 ఉండగా, ఏపీఎస్పీకి ఎంపిక చేసిన 2,520 మందిలో మొత్తం పురుష అభ్యర్థులే ఉన్నారు.

కానిస్టేబుల్ నియామకాలపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్ నియామకాలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పోలీసు కానిస్టేబుళ్ల ఎంపికలో సామాజిక రిజర్వేషన్లతో సంబంధం లేకుండా తమను ప్రత్యేక కేటగిరీగా పరిగణించేలా ఆదేశించాలని కోరుతూ పలువురు హోంగార్డులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. అప్పట్లో హైకోర్టు డివిజన్ బెంచ్.. దీనిలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. ఈ తీర్పును సవాలు చేస్తూ వాసపల్లి శ్రీనివాస్ సహా 73 మంది జూలై 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న బి. వరాలే ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, జూన్‌లో మొదలైన ఎంపిక ప్రక్రియ శుక్రవారంతో ముగిసిందని, ఫలితాలు కూడా విడుదల అయ్యాయని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ధర్మాసనం సదరు పిటిషన్‌ను కొట్టివేసింది.

మేజిస్ట్రేట్లపై శాఖాపరమైన చర్యలే!

- గత నెల ఇచ్చిన సర్క్యులర్‌లో మార్పులు

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులకు సంబంధించిన కేసులలో నిందితులకు రిమాండ్ విధించేప్పుడు తాము ఇచ్చిన సర్క్యులర్‌లోని అంశాలను తూ.చ. తప్పకుండా పాటించాలని పేర్కొంటూ గత నెల 5న హైకోర్టు సర్క్యులర్ జారీ చేసింది. అయితే.. ఆ సర్క్యులర్‌లో పేర్కొన్న అంశాల్లో లోపాలు ఉన్నాయని కొందరు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సదరు సర్క్యులర్‌లోని లోపాలను సరిచేస్తూ రిజిస్ట్రార్ జ్యుడీషియల్ కమలాకర్‌రెడ్డి సవరణ సర్క్యులర్‌ను విడుదల చేశారు.

మార్పులు ఇవీ..

1) సోషల్ మీడియాలో అనుచిత, అభ్యంతరకర ఒక పోస్టు, వ్యాఖ్య పెట్టినందుకు వివిధ పోలీస్ స్టేషన్లలో బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని, నిందితులకు రిమాండ్ విధించే సమయంలో మేజిస్ట్రేట్లు అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని గత సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం.. భారతీయ న్యాయ సంహిత-2023 ప్రకారం ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న కేసులలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అనుసరించాలని తెలిపారు.

2) ఇమ్రాన్ ప్రతాప్ గాధి వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ కేసు మేరకు.. ప్రసంగం, రచన, కళాత్మక వ్యక్తీకరణకు సంబంధించి అందిన ఫిర్యాదులలో ఎఫ్ఐఆర్ నమోదుకు ముం దు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 173(3) కింద పోలీసులు ప్రాథమిక విచారణ జరపాలి. డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలి. 14 రోజుల్లో ప్రాథమిక విచారణ ముగించాలని గత సర్క్యులర్‌లో పేర్కొన్నారు. తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు 3 నుంచి ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న నేరాలకు సంబంధించిన కేసులలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 173(3)ని అనుసరించారా? అనేది మేజిస్ట్రేట్లు నిర్ధారించుకోవాలని సూచించారు.

3) మేజిస్ట్రేట్‌లు రిమాండ్ విధించేటప్పుడు దర్యాప్తు అధికారి అర్నేష్‌కుమార్, ఇమ్రాన్ ప్రతాప్ గాధి కేసులలో సుప్రీం తీర్పులను అనుసరించారా?. నిందితుడు నేరాలను పునరావృతం చేశాడా?. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందా?. ఆధారాలను తారుమారు చేయగలరా?. కస్టోడియల్ విచారణ అవసరమా?. తదితర అంశాలపై సంతృప్తి చెందిన తరువాతే రిమాండ్ పై నిర్ణయం తీసుకోవాలని పాత సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. అయితే, తాజా సర్క్యులర్‌లో.. ఏడేళ్ల వరకు శిక్షకు వీలున్న కేసులలో రిమాండ్ విధించే ముందు దర్యాప్తు అధికారి అర్నేష్‌కుమార్, ఇమ్రాన్ ప్రతాప్ గాధి కేసులలో సుప్రీం తీర్పులను అనుసరించారా?. లేదా?. అనే విషయంపై మేజిస్ట్రేట్లు సంతృప్తి చెందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

4) గత సర్క్యులర్‌లో పేర్కొన్న సూచనలను మేజిస్ట్రేట్‌లు తూ.చ. తప్పకుండా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తామని, శాఖాపరమైన విచారణను ఎదుర్కోవడమే కాకుండా కోర్టుధిక్కరణ కింద చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు. తాజాగా సర్క్యులర్‌లో పేర్కొన్న సూచనలను తప్పకుండా పాటించాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే శాఖాపరమైన విచారణకు బాధ్యులవుతారని పేర్కొన్నారు.

వీళ్లకేం తక్కువని!?

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం రూ.31వేలు జీవితాంతం చెల్లిస్తుంది. ఇలా ఒకే వ్యక్తికి రెండేసి పింఛన్లు ఇవ్వడంలో హేతుబద్ధత ఏమిటో ఎవరికీ అర్థం కాదు. పార్లమెంటు చట్టం ప్రకారం మాజీ ఎంపీలకు, రాష్ట్ర శాసనసభ చట్టాల ప్రకారం మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్లు ఇస్తున్నారు. కానీ... ఒకే వ్యక్తికి రెండు పింఛన్లు ఇవ్వకూడదనే చట్టం మాత్రం లేదు.

డబుల్ ధమాకా...

మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్యేగా పని చేసి రెండు పింఛన్లు తీసుకుంటున్న వారిలో మన రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. వీరిలో... వందలు, వేల కోట్ల వ్యాపారాలు చేసే బడా పారిశ్రామిక వేత్తలు, స్టార్లు, రాజకీయ వారసులూ ఉన్నారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఒక్కరోజు పని చేసి మాజీ అయినా జీవితాంతం రూ.30వేలు పింఛను వస్తుంది. పొరుగు రాష్ట్రం తెలంగాణలో మాజీ ఎమ్మెల్యేలకు రూ.50 వేలు పింఛను చెల్లిస్తున్నారు. ఇక.. మాజీ ఎంపీలకు రూ.31 వేల పింఛను అందుతుంది. విచిత్రం ఏమిటంటే... ఒకే వ్యక్తి 2 పదవులు చేసి మాజీ అయ్యాక అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు పింఛన్లు ఇచ్చేస్తున్నాయి. ఏదేమైనా.. వాళ్లు దీనిని వదులుకోవడంలేదు. మిగిలిన వాళ్లు తమకు తెలియకుండానే రెండూ తీసుకుంటున్నారు.

అసలు అవసరమా?

రెండు పింఛన్ల సంగతి పక్కనపెడితే... అసలు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పింఛన్లు ఇవ్వడం అవసరమా? అనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ఒకప్పుడు పూర్తిగా ప్రజాసేవకే అంకితమై, అత్యంత నిరాడంబర జీవితం సాగించే నేతలు కొందరు చట్ట సభల్లో అడుగు పెట్టేవారు. వారికి ఇతర వ్యాపకాలు, వ్యాపారాలూ ఉండేవి కావు. ఇలాంటి నేతలకు 'మాజీ' అయ్యాక పింఛను ఇవ్వడంలో అర్థముంది. కానీ, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచేందుకు ఒక్కో నియోజకవర్గానికి కనీసం రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఎమ్మెల్యేగా గెలవగానే ప్రతి నెలా రూ.1.30 లక్షల జీతం అందుతుంది. ఇతర అలవెన్సుల రూపంలో ప్రతినెలా రూ.లక్ష అందుతున్నాయి. ఎంపీకీ భారీగా జీతం, భత్యాలు అందుతాయి. వారి కుటుంబ సభ్యులకూ సౌకర్యాలు అందుతాయి. మాజీలు అయ్యాక పింఛను తీసుకోవడం ఒక ఎత్తైతే... మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే హోదాలో రెండు పింఛన్లు తీసుకోవడం మరో ఎత్తు.

పీ4కు వాడొచ్చు కదా...

పీ4 కింద పేదల కుటుంబాలను దత్తత తీసుకోవాలని... 'మార్గదర్శులు'గా మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే పిలుపునిస్తున్నారు. మరి... రెండేసి పింఛన్లు తీసుకుంటున్న నేతలు ఒక పేద కుటుంబాన్ని దత్తత తీసుకోవచ్చు కదా? జీత, భత్యాలు, పింఛన్లతో అవసరంలేని ధనికులైన నేతలు... తమకు అందుతున్న మొత్తాన్ని ప్రజలకోసం వెచ్చించవచ్చు. ప్రస్తుతం... 'పీ4'పై చంద్రబాబు పిలుపునకు స్పందిస్తున్న ప్రజా ప్రతినిధుల సంఖ్య పెద్దగా కనిపించడంలేదు. ఆ విషయం పక్కనపెడితే... రెండు పింఛన్లు తీసుకుంటున్న వారు, నైతిక బాధ్యతగా ఒక దానిని వదులుకోవాలనే వాదనా వినిపిస్తోంది. ప్రభుత్వమైనా 'ఒక మాజీకి ఒకటే పింఛను' చట్టం తేవాలి.

ఏడాదిలో రూ.22,842 కోట్లు దోచేశారు!

భారత్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలు.. 2024లో 22 లక్షలకుపైగా

- 'డేటా ల్యాబ్స్' సంస్థ నివేదిక వెల్లడి
- మహారాష్ట్ర, యూపీ, కర్ణాటక టాప్
- రాజ్యసభలో కేంద్రం ప్రకటన
- దేశంలో నిమిషానికి 761 సైబర్ దాడులు: డీఎస్‌సీఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఒక్క ఏడాది.. ఏకంగా రూ.22,842 కోట్లు.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి భారతీయులు పోగొట్టుకున్న సొమ్ము ఇది. అంతే కాదు గత ఏడాది తొలిమూడు నెలలతో పోలిస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి మూడు నెలల్లో ఎనిమిది రెట్లు అధికంగా సైబర్ నేరాలు జరిగినట్లు గుర్తించారు. ఢిల్లీకి చెందిన 'డేటా ల్యాబ్స్' సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ దిగ్భ్రాంతికర అంశాలను వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సైబర్ నేరాల బారినపడి సుమారు రూ.1.2 లక్షల కోట్లు కోల్పోయే అవకాశం ఉందని 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)' అంచనా వేసినట్లు తెలిపింది. సైబర్ నేరాలతో భారతీయులు కోల్పోయిన మొత్తం 2022లో రూ.2,306 కోట్లు, 2023లో రూ.7,465 కోట్లు మాత్రమేనని వివరించింది. సైబర్ నేరాలకు సంబంధించి 2023లో 15.6 లక్షల ఫిర్యాదులు రాగా, 2024లో 20 లక్షల వరకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. 2019తో పోలిస్తే ఈ సంఖ్య పది రెట్లు ఎక్కువని వెల్లడించింది.



స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ చెల్లింపులతో..

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూన్ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా రూ.24.03 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఇది సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. ఓటీపీ మోసాల నుంచి డిజిటల్ అరెస్ట్ దాకా కొత్త కొత్త విధానాలను అనుసరిస్తూ.. ప్రజల నుంచి సొమ్ము కొట్టేస్తున్నారు. వాట్సాప్‌లో ప్రముఖులు, వ్యాపారవేత్తల చిత్రాలను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టి, డీప్‌ఫేక్ వీడియోలు పంపి ఉద్యోగులను బురిడీ కొట్టించడం, యాప్‌లలో పెట్టుబడులపై భారీ లాభాల ఆశచూపి మోసగించడం, ప్రముఖ బ్యాంకుల నుంచి ఆరోగ్య బీమా, వాహన బీమా రెన్యూవల్ పేరిట కాల్స్ చేసి.. డెబిట్, క్రెడిట్‌కార్డులు, బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము కొల్లగొట్టడం, యువతులతో న్యూడ్ కాల్స్ చేయించి, మాట్లాడించి వాటిని బయటపెడతామని బెదిరించి వసూళ్లకు పాల్పడటం వంటివి పెరిగాయి.

నాలుగేళ్లలో నాలుగింతలు నేరాలు

దేశంలో సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని, 2024లో 22 లక్షలకుపైగా సైబర్ నేరాలు జరిగాయని రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2021లో జరిగిన 4.5లక్షల సైబర్ నేరాలతో పోలిస్తే ఇది నాలుగు రెట్లు ఎక్కువని తెలిపింది. ఈ ఏడాది ఇప్పటికే 12 లక్షలకుపైగా సైబర్ నేరాలు నమోదయ్యాయని వెల్లడించింది. ఇందులో అత్యధికంగా మహారాష్ట్ర (1.6 లక్షల నేరాలు), ఉత్తరప్రదేశ్ (1.4 లక్షలు), కర్ణాటక (లక్ష నేరాలు)లో నేరాలు జరిగాయని తెలిపింది. మరోవైపు బాలలకు సంబంధించిన సైబర్ నేరాలూ పెరుగుతున్నాయని కేంద్రం తెలిపింది. 2018-2022 మధ్య చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి 3వేలకుపైగా, పిల్లలపై ఆన్‌లైన్ వేధింపులకు సంబంధించి 500కుపైగా కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. ఇక దేశంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వెబ్‌సైట్లపై సైబర్ దాడులు కూడా బాగా పెరిగాయని 'డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ)' ఇటీవల వెల్లడించింది. దేశంలో ప్రతి నిమిషం 761 సైబర్ దాడులు జరుగుతున్నట్టు తెలిపింది. వినియోగదారుల డేటాను చోరీచేయడం, వెబ్‌సైట్లను బ్లాక్ చేసి సొమ్ముకోసం డిమాండ్ చేయడం పెరిగిందని వెల్లడించింది.

8 మందితో వివాహం.. తొమ్మిదో పెళ్లికి సిద్ధం

- మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన నిత్య పెళ్లి కూతురు

నాగ్‌పూర్, ఆగస్టు 1: ఏకంగా ఎనిమిది పెళ్లిళ్లు చేసుకున్న ఓ నిత్య పెళ్లికూతురు.. తొమ్మిదో పెళ్లికి సిద్ధమవుతుండగా మహారాష్ట్ర పోలీసులకు చిక్కింది. సమీరా ఫాతిమా అనే ఉపాధ్యాయురాలు డబ్బు కోసం ముస్లిం సమాజంలోని ధనవంతులు, పెళ్లయిన పురుషులను లక్ష్యంగా చేసుకుంది. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో వారి వివరాలు సేకరించి ఫేస్‌బుక్, వాట్సాప్‌వంటి సామాజిక మాధ్యమాల్లో దగ్గరవుతుంది. అనుకోని పరిస్థితుల వల్ల విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఓ బిడ్డతో ఒంటరిగా ఉంటున్నానని కథలు చెప్పి నమ్మించి పెళ్లి చేసుకునేది. కొన్ని రోజులకు పథకం ప్రకారం వారి నుంచి డబ్బులు డిమాండ్ చేసేది. అవసరమైతే బెదిరించి వసూలు చేసేందుకు ఆమెకు ఒక ముఠా ఉంది. ఇలా గత 15ఏళ్లలో 8పెళ్లిళ్లు చేసుకుని బాధితుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. సమీర తన నుంచి రూ.50 లక్షలు వసూలు చేసిందని ఆమె మాజీ భర్త ఒకరు ఆరోపించారు. ఆమె బాధితుల్లో రిజర్వ్ బ్యాంకు సీనియర్ అధికారులు ఉన్నారు.

భర్తకు లైంగిక సామర్థ్యం లేదనడం పరువు నష్టం కాదు: బాంబే హైకోర్టు

ముంబై, ఆగస్టు 1: భర్తకు లైంగిక సామర్థ్యంలేదని విడాకుల కేసు విచారణ సందర్భంగా భార్య ఆరోపించడం పరువు నష్టం కిందికి రాదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. తన ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం న్యాయవిచారణలో భాగంగా ఆమె అలాంటి ఆరోపణ చేయవచ్చని తెలిపింది. తన మాజీ భార్య, ఆమె కుటుంబ సభ్యులపై ఓ వ్యక్తి దాఖలు చేసిన పరువు నష్టం దావాను కొట్టివేస్తూ జస్టిస్ ఎస్.ఎం.మోదక్ ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

త్వరలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ!

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాక (ఆగస్టు 20 తర్వాత).. ఏ రోజైనా కేంద్ర మంత్రివర్గాన్ని పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ పునర్వ్యవస్థీకరణలో పలువురు మంత్రులకు ఉద్వాసన పలుకుతారని.. ముఖ్యంగా కొంతమంది బ్యూరోక్రాట్లను పక్కన పెడతారని భావిస్తున్నారు. వారి స్థానంలో.. పార్టీలో చిరకాలం పనిచేసిన, సంఘ్‌కు సన్నిహితులైన వారికి స్థానం లభిస్తుందని, మంత్రివర్గ కూర్పుపై సంఘ్ ప్రభావం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగమంత్రి జైశంకర్‌తో పాటు హర్దీప్ పురి, అర్జున్ రాం మేఘ్వాల్, అశ్వినీ వైష్ణవ్.. బ్యూరోక్రసీ నుంచి వచ్చి మోదీ ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో ఎవరిని తప్పిస్తారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. వీరు కాక అనేకమందిని పనితీరు ఆధారంగా తప్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. వారిలో కొందరికి జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించాలని యోచిస్తున్నారు. కాగా.. ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు ఆగస్టు 21 కావడం వల్ల.. బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేసేది ఎవరనే అంశంపై మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగేలోపే స్పష్టతరానుంది. ఆ పదవికి.. రాజ్‌నాథ్ సింగ్, జగత్ ప్రకాశ్ నడ్డా వంటివారి పేర్లు వినిపించడంతోపాటు దక్షిణాది నుంచి బీసీని నియమించాలనే ప్రతిపాదనపైనా మంతనాలు జరుగుతున్నాయి. ఇక ఆగస్టు 15 తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందని, ఈ విషయంపై పార్టీ అగ్రనేతలకు మధ్య అవగాహన దాదాపు కుదిరినట్లేనని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్, మనోహర్ లాల్ ఖట్టర్, ప్రహ్లాద్ జోషి తదితరుల పేర్లు చర్చకు వస్తున్నాయి.

నాకొద్దీ మంత్రి పదవి..

కేంద్ర మంత్రివర్గం నుంచి తనకు విముక్తి కల్పించాల్సిందిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాను కోరినట్లు తెలిసింది. ఈ బాధ్యతల కారణంగా తాను పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించలేకపోతున్నానని.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేయాలనుకుంటున్నానని వారికి ఆయన చెప్పినట్లు సమాచారం. సంఘ్ పెద్దల వద్ద కూడా బండి సంజయ్ తన మనోగతాన్ని వెల్లడించి వారి ఆమోదాన్ని పొందినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆయన స్థానంలో లక్ష్మణ్‌కు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

ఇంటింటికీ సంస్కృతం చేరాలి: మోహన్ భాగవత్

నాగ్‌పూర్, ఆగస్టు 1: భారతదేశంలోని అన్ని భాషలకు సంస్కృతం మూలమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఈ భాష దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికీ చేరాలని, అందరూ సంస్కృతంలో మాట్లాడుకునేలా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం నాగపూర్‌లోని కవి కులగురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్మించిన అభినవ భారతి అంతర్జాతీయ విద్యాభవనం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. సంస్కృతం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు తమ దైనందిన జీవితంలో వాడుక భాషగా ఉపయోగించాలని సూచించారు.

మాలెగావ్ కేసులో భాగవత్‌ను అరెస్టు చేయాలన్నారు

- మహారాష్ట్ర ఏటీఎస్ అధికారి సంచలన ఆరోపణ

ముంబై, ఆగస్టు 1 : మాలెగావ్ పేలుళ్ల కేసును విచారించిన మహారాష్ట్ర తీవ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్)లో పనిచేసిన ఓ అధికారి సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని దర్యాప్తు అధికారి పరమ్ వీర్ సింగ్ తనను ఆదేశించారని మెహబూబ్ ముజావర్ అనే రిటైర్డ్ పోలీసు అధికారి ఆరోపించారు. దేశంలో కాషాయ ఉగ్రవాదం ఉందనే వాదన సృష్టించాలని అలా ఆదేశించారని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ వెల్లడించారు. పరమ్ వీర్ సింగ్, ఆయన పైనున్న అధికారులు కొందరు.. రామ్ కల్సంగ్రా, సందీప్ డాంగే, దిలీప్ పాటిదార్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌లను అరెస్టు చేయాలని తనను ఆదేశించారని చెప్పారు. అప్పట్లో పరమ్ వీర్ సింగ్ చనిపోయిన వారిని బతికున్నట్లు చార్జిషీట్ రాయాలని తనను ఆదేశించారని పేర్కొన్నారు. ఆ ఆదేశాలను తాను తిరస్కరించడంతో తనను తప్పుడు కేసుల్లో ఇరికించారని పేర్కొన్నారు. అయితే వాటన్నిటి నుంచి తాను బయట పడ్డానన్నారు.

90 రోజుల నిర్వహణ దశలోకి నిసార్

న్యూఢిల్లీ, తిరువనంతపురం, ఆగస్టు 1: ఇస్రో-నాసా జంటగా ప్రయోగించిన నిసార్ ఉపగ్రహం కీలకమైన 90 రోజుల నిర్వహణ దశలోకి ప్రవేశించింది. ఈ దశలో శాస్త్రవేత్తలు భూపరిశీలన కోసం పూర్తిస్థాయిలో ఉపగ్రహాన్ని సిద్ధం చేయడానికి కొన్ని తనిఖీలు, కక్ష్య సర్దుబాట్లు చేపడతారు. 'నిసార్‌ను 737 కిమీ ఎత్తులో ప్రవేశపెట్టాం. వాస్తవానికి దాన్ని 747 కిమీకు చేర్చాలి. ఇప్పుడు ఈ ప్రక్రియ పూర్తికి 40-50 రోజులు పడుతుంది' అని నాసా ఎర్త్ సైన్సెస్ డివిజన్‌లో నేచురల్ హజార్డ్స్ రిసెర్చ్ ప్రోగ్రామ్ మేనేజర్ జెరాల్డ్ డబ్ల్యూ బావెన్ తెలిపారు.

విశ్రాంతి వయసులో జీవన పోరాటం

- దేశంలో వృద్ధులకు కరువైన ఆర్థిక భద్రత
- ఇతరులపై ఆధారపడ్డ 70 శాతం మంది
- పూటగడవాలంటే చాలామంది పని చేయాల్సిందే

న్యూఢిల్లీ, ఆగస్టు 1: వృద్ధాప్యం వచ్చాక విశ్రాంతి తీసుకుందామంటే దేశంలో చాలామందికి పూటగడిచే పరిస్థితి లేదు. సత్తువ లేకపోయినా పనిచేసి కడుపునింపుకోవాల్సిందే. ఇక 70% మంది ఆర్థికంగా ఇతరులపై ఆధారపడే జీవిస్తున్నారు. పలువురికి ఆర్థిక, ఆరోగ్య భద్రత లేకుండా పోయాయి. ఇదీ దేశంలో వృద్ధుల పరిస్థితి అని ఓ అధ్యయన నివేదిక తాజాగా వెల్లడించింది. 'భారతదేశంలో వృద్ధాప్యం.. సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై నీతి ఆయోగ్, సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ, జాతీయ మానవ హక్కుల కమిషన్ భాగస్వామ్యంతో శంకలా ఫౌండేషన్ సంస్థ ఓ అధ్యయనం నిర్వహించి నివేదిక విడుదల చేసింది. దేశంలో వేగంగా పెరుగుతున్న వృద్ధాప్య జనాభాపై లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా (ఎల్ఏఎస్ఐ) పేర్కొన్న అంశాలను ఆ నివేదికలో వివరణాత్మకంగా విశ్లేషించింది. పలువురు వృద్ధులు



పస్తులతోనే రోజులు గడుపుతున్నారని వెల్లడించింది. చాలామందిలో శారీరక, మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని పేర్కొంది.

నివేదికలోని ముఖ్య అంశాలు..

- దేశంలో 6.4% మంది వృద్ధులకు భోజన పరిమాణం తగ్గిపోయింది. 5.6% మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఏడాదిలో కనీసం ఒకరోజు పస్తులుండే వారు 4.2 శాతం మంది ఉన్నారు.
- 60 ఏళ్లు పైబడిన వారిలో హృద్రోగ సమస్యలతో 35.6 శాతం, రక్తపోటుతో 32 శాతం, మధుమేహంతో 13.2 శాతం బాధపడుతున్నారు. హృద్రోగ బాధితులు ఎక్కువగా గోవా (60 శాతం), కేరళ (57 శాతం)లలో ఉన్నారు. ఎముకలు, కీళ్ల వ్యాధులతో 19 శాతం మంది వృద్ధులు బాధపడుతున్నారు. ఈ వ్యాధుల బాధితుల్లో 33 శాతంతో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది.
- ఇక మానసిక సమస్యలు కూడా వృద్ధుల్లో ఎక్కువ అవుతున్నాయి. డిప్రెషన్ లక్షణాలు 30 శాతం మందిలో కనిపిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాలు మాయమైపోతుండటంతో వృద్ధులు ఒంటరిగా మిగిలిపోతున్నారు. వృద్ధులైన మహిళలు 18.7 శాతం, పురుషులు 5.1 శాతం ఒంటిరిగా జీవిస్తున్నారు. కేరళలోని వృద్ధుల్లో 65%మంది స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నారు.
- ఇక 2021 నాటికి జనాభాలో 60 ఏళ్లు పైబడిన వారు కేరళలో 16.5 శాతం మంది ఉండగా, తమిళనాడులో 13.6 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 13.1 శాతం, పంజాబ్‌లో 12.6 శాతం మంది ఉన్నారు. ఇక బిహార్‌లో (7.7 శాతం) అతి తక్కువ మంది ఉన్నారు.



ఇంటి నిర్మాణం ప్రదేశంలో మంత్రి నారా లోకేశ్

రాజధానిలో శరవేగంగా సీఎం సొంతిల్లు

» నిర్మాణ పనులు పరిశీలించిన తనయుడు లోకేశ్

తుళ్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో నిర్మాణంలో ఉన్న తమ సొంత ఇంటి పనులను మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అసెంబ్లీ పడమర వైపు, ఈ- 6 రోడ్డు పక్కనే వెలగపూడికి చెందిన ఓ కుటుంబం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు ఐదెకరాల భూమిని కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందులో నాలుగు నెలల క్రితం కుటుంబ సమేతంగా శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఎస్ఆర్ఆర్ నిర్మాణ సంస్థ సీఎం ఇంటి నిర్మాణ పనులను చేపట్టింది. పెద్ద సంఖ్యలో కార్మికులను రంగంలోకి దించి శరవేగంగా పనులు చేపడుతోంది. ఈ క్రమంలో పనులు ఏ విధంగా సాగుతున్నాయో లోకేశ్ పరిశీలించారు. 40 నిమిషాల పాటు కంపెనీ వారితో చర్చించి వెళ్లారు.

జగన్‌రెడ్డి కళ్లకు కనిపించని సంక్షేమం

» రాజకీయాలకు ఆయన అనర్హుడు: మంత్రి ఆనం

ఆత్మకూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'గతంలో ఏ ప్రభుత్వాలూ ఇవ్వని సంక్షేమాన్ని నేడు ప్రజలు ఆనందంగా అందుకుంటున్నారు. అయితే జగన్‌రెడ్డి కళ్లకు మాత్రం ఈ సంక్షేమం కనిపించడం లేదు. సంక్షేమం గురించి గంటల తరబడి మాట్లాడటం వేరు, చేసి చూపడం వేరు. నేడు కూటమి ప్రభుత్వంలో అదే సంక్షేమం కొత్త చరిత్రను తిరగ రాస్తోంది' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇటీవల సీఎం చంద్రబాబుపై నీచమైన వ్యాఖ్యలు చేసిన జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడని అనైతిక నీచస్థాయి రాజకీయాలు నేడు రాష్ట్రంలో వైసీపీ ద్వారా, జగన్ ద్వారా చూస్తుండడం చాలా విచారకరం. వైసీపీలో కీలక నేతలంతా పార్టీని వీడుతుండటం, అక్రమాలు వెలుగు చూస్తుండడంతో జగన్ తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో ఉండి నీచ రాజకీయాలకు తెరలేపుతున్నారు. అరాచకం, రౌడీయిజం, ఎదురుదాడితో రాజకీయం చేయాలనుకోవడం మంచిది కాదు. రౌడీలు, గంజాయి స్మగ్లర్లు, బెట్టింగ్‌రాయళ్ల ఇంటికెళ్లి పరామర్శించడం, ఏదో ఘనత సాధించినట్లు విజయ యాత్ర చేయడం గతంలో ఎప్పుడూ నా రాజకీయ జీవితంలో చూడలేదు. జగన్‌రెడ్డి రాజకీయాలకు అనర్హుడు' అని అన్నారు.

7 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్: సవిత

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఈ నెల 7వ తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కూటమి ప్రభుత్వం ప్రారంభిస్తోందని తెలిపారు. ఎన్నికల హామీ అమల్లో భాగంగా ఏటా రూ.125 కోట్ల భారం భరిస్తూ.. 65 వేల చేనేత కుటుంబాలకు అందిస్తున్న బహుమతిగా ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి చేనేత కార్మికుడికి పని కల్పించాలన్న లక్ష్యంతో నూతన టెక్స్‌టైల్ పాలసీ తీసుకొచ్చామన్నారు. దీని ద్వారా 1.51 లక్షల మందికి ప్రభుత్వం ఉపాధి కల్పించిందన్నారు. చేనేతలకు థ్రిఫ్ట్ ఫండ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్లు, ఈ ఏడాదికి రూ.5 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. హ్యాండ్లూమ్ అభివృద్ధి కోసం 10 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం పలు వ్యాపార సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు మంత్రి సవిత తెలిపారు. త్వరలో సహకార సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు.

బాబుపై అక్కసుతో జగన్ కట్టుకథలు: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కుంభకోణంలో నిందితుడు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితిపై అనుమానాలు తలెత్తుతున్నాయని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. అధికారం పోయాక రోజురోజుకి జగన్ మానసిక పరిస్థితి దిగజారుతున్నట్లు అర్థమవుతుందన్నారు. నెల్లూరు పర్యటనలో జగన్ మాట్లాడిన తీరు సరిగా లేదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం ఎస్వీ యూనివర్సిటీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రబాబుకు మధ్య గొడవలను దగ్గరుండి చూసినట్లు జగన్ చెబుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు దేశ రాజకీయాలలో ప్రత్యేకస్థానం ఉందని, దేశవ్యాప్తంగా ఆయనకు దక్కుతున్న గౌరవాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని చెప్పారు. నెల్లూరు పర్యటనలో పోలీసుల మానసిక ధైర్యం దెబ్బతీసేలా జగన్ వ్యవహార శైలి ఉందని ఎంపీ విమర్శించారు.

లిక్కర్ స్కాంను సిట్ నిగ్గుతేలుస్తుంది: పితాని

పెనుమంట్ర, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లిక్కర్ స్కాంపై సిట్ దర్యాప్తు సంస్థ నిగ్గు తేలుస్తుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పొలమూరులో వ్యవసాయ విశాల పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కండిబోయిన శ్రీనివాస్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పితాని పాల్గొని మాట్లాడారు. ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో జే బ్రాండ్ల ద్వారా నాసిరకం మద్యాన్ని ప్రభుత్వం విక్రయించి ప్రజల జీవితాలతో చెలగాటమాడిందని విమర్శించారు. ప్రజాధనాన్ని ప్రభుత్వానికి చేరకుండా పక్కదారి పట్టించిందని ఆరోపించారు. జగన్ మీడియా అవాస్తవాలను వాస్తవాలుగా ప్రజలను నమ్మించాలని చూస్తుందని పితాని ఆరోపించారు.

జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే లిక్కర్ స్కామ్: నిమ్మల

అనపర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): లిక్కర్ తయారీ నుంచి అమ్మకాల వరకు జగన్‌రెడ్డి కనుసన్నల్లోనే జరిగాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి విచ్చేసిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్‌లో దోచుకున్న రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని వెనుకకు తీసుకు వచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైసీపీ దోచుకున్న ప్రజా సొత్తును వెనుకకు తీసుకువచ్చి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నిలదొక్కుకునే విధంగా చేస్తామని మంత్రి నిమ్మల అన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జగన్ అవినీతిని కేంద్ర సంస్థలు కక్కిస్తాయి: సీఎం రమేశ్

విశాఖపట్నం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అధికారం అడ్డం పెట్టుకొని మాజీ సీఎం జగన్... ఐదేళ్ల దిగమింగిన అవినీతి సొమ్మును కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్కిస్తాయని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ఆయన శుక్రవారం విశాఖపట్నంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబుతో కలసి విలేకరులతో మాట్లాడారు. జగన్ హయాంలో జరిగిన అవినీతిపై రాష్ట్ర పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారని, కేంద్ర సంస్థలు సీబీఐ, ఈడీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా రంగంలో దిగి మొత్తం బండారం బయట పెడతాయన్నారు. రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలకు శ్రీకారం చుట్టింది జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. త్వరలో పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి ఎన్నిక జరుగుతుందని, బీటెక్ రవి భార్యను పోటీకి దించి గెలిపిస్తామన్నారు. తద్వారా అక్కడ జగన్ బలం ఏమిటో ఈ రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తామని ఎంపీ ప్రకటించారు. మద్యం స్కామ్‌లో జగన్ ప్రధాన దోపిడీగా తేలడం ఖాయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అధికారం ఇక దక్కదనే విషయం అర్థమై జగన్ మతి భ్రమించినట్లు మాట్లాడుతున్నారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు.

త్వరలో బిగ్‌బాస్ అరెస్టు: సత్యకుమార్

ధర్మవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాంలో త్వరలోనే బిగ్‌బాస్ అరెస్టు అవుతారని మంత్రి సత్యకుమార్ అన్నారు. అరెస్టు భయంతోనే జగన్ ప్రజలను కన్‌ఫ్యూజ్ చేస్తున్నారని ఆరోపించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే పరామర్శకు వెళతారని, కానీ మాజీ సీఎం జగన్ మాత్రం దౌర్జన్యాలు, కబ్జాలు చేసిన వారిని పరామర్శించడానికి వెళుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనవారిని అరెస్టు చేస్తారా అని జగన్ వితండవాదం చేయడం సిగ్గుచేటని అన్నారు. తప్పు చేస్తే ఎన్నిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా చట్టం విడిచిపెట్టదని అన్నారు. ప్రజలు జగన్ మాయ మాటలు నమ్మేస్థితిలో లేరని అన్నారు.

గండికోట ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన

డిసెంబరు 26,27 తేదీల్లో ఉత్సవాలు

గండికోట ఇండియాకే గ్రాండ్ క్యానన్ అని సీఎం చంద్రబాబు అన్నారు. గండికోట వద్ద శుక్రవారం జరిగిన ఏపీ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్‌కు చంద్రబాబు హాజరయ్యారు. గండికోట ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతాన్ని యాంకర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. "ప్రపంచంలో అతి సుందరమైన ప్రదేశాల్లో గండికోట 10వది. దీన్ని ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడానికి మాస్టర్‌ప్లాన్ తయారుచేస్తున్నాం. రూ.80కోట్లతో పనులు ప్రారంభిస్తున్నాం. అక్కడే కృష్ణదేవరాయల విగ్రహం పెట్టిస్తాం. ఒకపక్క గండికోట, ఒంటిమిట్ట, మధ్యలో కడప దర్గా ఈ మూడు అనుసంధానం చేయగలిగితే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుంది. కడపలో నేషనల్ హైవేస్‌కు ఒక్క ఏడాదిలోనే రూ.12వేలకోట్లు ఖర్చుచేశాం." అని తెలిపారు. సాస్కీ, స్వదేశీ దర్శన్ పథకాల ద్వారా గండికోట, బొర్రా గుహలు, అహోబిళం, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో టూరిజం ప్రాజెక్టులకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గండికోట ఉత్సవాలు డిసెంబరు 26, 27 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు గాను సీఎం సమక్షంలో ఒప్పందాలు జరిగాయి. ఈజ్‌మైట్రిప్, హిల్టెన్ హోటల్స్ సహా వివిధ సంస్థలు ఏపీ టూరిజం కార్పొరేషన్‌తో రూ.500 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నాయి.



గండికోట పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు





కడప జిల్లా జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలో జరిగిన ప్రజావేదిక సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న సీఎం

జగన్‌కు తెలిసింది విధ్వంసమే!

"దేన్నైనా చెడగొట్టడం, పడగొట్టడం చాలా సులభం. కుండ పాలల్లో ఒక చుక్క విషం వేస్తే చెడిపోతాయి, కానీ పాలు తయారుచేసిన వారికే ఆ కష్టం తెలుస్తుంది. ఎప్పుడుకూడా నిలబెట్టడం, అభివృద్ధి చేయడమే కష్టం, విధ్వంసం చేయడం ఒక నిమిషం పని. ఐదేళ్లూ అదే జరిగింది. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. చాలా సమస్యలు సృష్టించారు. రూ.10లక్షలకోట్లు అప్పు చేశారు. అప్పట్లో పింఛన్ ఒక నెల తీసుకోకపోతే రెండోనెల ఎగ్గొట్టేవారు. మేమొచ్చాక ఆ పరిస్థితిని సరిదిద్దాం. సాంకేతికతను జోడించి పంపిణీని సులభతరం చేశాం."

- చంద్రబాబు.

(మొదటి పేజీ తరువాయి)

రేపటిరోజున మార్గదర్శులై మరికొన్ని బంగారు కుటుంబాలకు చేయూతను ఇవ్వాలి. సమాజానికి మనం ఏదైనా చేయాలి. మనతో పుట్టినవారు ఇంకా పేదరికంలో మగ్గుతున్నారు. వారిని ఆదుకునేందుకే పీ4 కార్యక్రమం. మన బంగారు కుటుంబాలు ప్రపంచానికి రోల్‌మోడల్‌గా మారుతాయి" అని ముఖ్యమంత్రి తెలిపారు. పింఛన్ ఎక్కడ, ఎప్పుడు ఇచ్చారో తెలుసుకునేందుకు టెక్నాలజీ ఉపయోగిస్తున్నామన్నారు.'మీకు పింఛన్ వస్తుంది...పంపిస్తున్నాం...తీసుకోండి' అని ముందురోజు మెసేజ్ పంపిస్తున్నాం. పింఛన్ ఇచ్చే సమయంలో లంచాలు అడుగుతున్నారా దురుసుగా ప్రవర్తించారా అని అదే రోజు సాయంత్రం మెసేజ్ పెడుతున్నాం. అవసరమైతే భవిష్యత్తులో వాట్సప్ సేవలు అందుబాటులోకి తెస్తాం. ఎవరికైనా పింఛను అందకుంటే అందులో మెసేజ్ పెట్టవచ్చు. వెంటనే అందిస్తాం." అని చంద్రబాబు వివరించారు. ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అందుబాటులోకి తెస్తామన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7 నుంచి పవర్‌లూమ్స్‌కు హ్యాండ్‌లూమ్స్‌కు విద్యుత్ ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

"కొంతమంది వితండవాదులు ఉంటారు. ఆరోజు నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయాడని జగన్ మీడియా ప్రసారం చేసింది. అదేరోజు మధ్యాహ్ననికి మాటమార్చారు. తెల్లవారే సరికి పేపర్‌లో నారాసుర రక్తచరిత్ర అంటూ నా చేతిలో కత్తి. ఆ తర్వాత నేనేదో ఆదినారాయణరెడ్డికి చెప్పానంట, బీటెక్ రవికి చెప్పానంట. రోజురోజుకు మాట మార్చారు. నెల్లూరుకు (జగన్) వెళ్లారు. ప్రశాంతిరెడ్డి... ప్రభాకర్‌రెడ్డి సతీమణి, ఎమ్మెల్యే. ఆమె క్యారెక్టర్ గురించి నోరుపారేసుకున్న వ్యక్తిని మందలించాల్సింది పోయి నేరుగా అక్కడకు వెళ్లి ఆయనను ఇంకా రెచ్చగొట్టారు. 'ఇంకా తిట్టు..నేను ఉన్నా'నంటూ భుజం తట్టారు. ఇలాంటి వారు రాజకీయాల్లో ఉండాలా? నిన్న ఆయన నెల్లూరుకు వెళ్లారు. చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యం వెళ్లినపుడు వచ్చిన జనాభా వీడియో తీసుకొని నిన్న జగన్ మీడియాలో ప్రసారం చేశారు. జగన్ పత్రికలో వచ్చేదాన్ని మీరు నమ్మితే కుక్కతోక పట్టుకొని గోదావరిని ఈదినట్లే జాగ్రత్త. మంచిగా ఎక్కడ జగన్ తిరిగినా నాకేం బాధలేదు. కానీ ప్రజలకు అసౌకర్యం కలిగించారంటే ఊరుకోం. తోక తిప్పితే కట్‌చేస్తా"

2028 చివరికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పూర్తి

"మొన్ననే కడప మహానాడులో రాయలసీమకు స్టీల్‌ప్లాంట్ వస్తుందని చెప్పాను. అన్నట్టే స్టీల్‌ప్లాంట్ శాంక్షన్ చేశాం, డెవలపర్‌ను ఎంపిక చేశాం. జిందాల్ కంపెనీ పనులు మొదలుపెట్టింది. 2028 డిసెంబర్‌నాటికి ఫేజ్ -1 పూర్తిచేయాలని స్పష్టంగా ఆదేశాలిచ్చాం. మొదటి దశ రూ.4,500కోట్లు, రెండవ దశ రూ.11, 850కోట్లతో ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది. 2029కల్లా ప్రొడక్షన్ ప్రారంభమవుతుంది. గాలేరునగరి కాల్వలు కడప వరకు తీసుకెళ్తామని చెప్పాం, వచ్చే ఏడాది మొదటికల్లా కడప వరకు గాలేరునగరి కాల్వలను పూర్తిచేస్తాం. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తామన్నాం, చెప్పినట్లుగానే ఇచ్చాం."

రుణం తీర్చుకుంటా..

"దేన్నైనా చెడగొట్టడం, పడగొట్టడం చాలా సులభం. కుండ పాలల్లో ఒక చుక్క విషం వేస్తే చెడిపోతాయి, కానీ పాలు తయారుచేసిన వారికి కష్టం తెలుస్తుంది. ఇప్పుడుకూడా నిలబెట్టడం కష్టం, అభివృద్ధి చేయడం కష్టం, విధ్వంసం చేయడం ఒక నిమిషం పని. ఐదేళ్ల అదే జరిగింది. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రాయలసీమ ప్రాంతానికి కావాల్సింది నీళ్లు. కూటమి ప్రభుత్వం రాగానే హంద్రీనీవా వెడల్పు చేసి లైనింగ్ వేసి పనులు పూర్తిచేసి రూ.3800కోట్లతో 3900క్యూసెక్కుల నీరు వెళ్లేందుకు పనులు ప్రారంభించాం, 2024లో పదికి ఏడు సీట్లు ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో పదికి పది సీట్లూ ఇచ్చేందుకు మీరు సిద్ధమయ్యారు. మీరుణం (కడప) తీర్చుకుంటాను."

రాయలసీమకే వలసలు వచ్చేలా చేస్తా..

"2014-2019 మధ్య రూ.12,241 కోట్లు ఖర్చుచేసి ముఖ్యమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తిచేశాం. 2019-2024 మధ్య రూ.2వేలకోట్లు మాత్రమే అప్పటి ప్రభుత్వం ఖర్చుచేసింది. సముద్రంలోకి పోయేనీళ్లను వాడుకుంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు కరువు సమస్య తొలగిపోతుంది. రాయలసీమలో అనేక వనరులు ఉన్నాయి, పరిశ్రమలు రావల్సిన అవసరం ఉంది. కొప్పర్తి, ఓర్వకల్లు, ఇండస్ట్రియల్‌లో రూ.5వేల కోట్లు పెట్టి అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమలో ఆటోమొబైల్, స్పేస్ టెక్నాలజీ, డిఫెన్స్, ఎయిరోస్పేస్, ఎలక్ట్రానిక్, డ్రోన్ సిటీ పెట్టి గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తయారు చేస్తున్నాం.. ఇవన్నీ వస్తే మన పిల్లలు ఉద్యోగాల వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేదు. వేరే ప్రాంతాల వాళ్లే రాయలసీమకు వలస వస్తారు."

సింగపూర్‌లో తెలుగుహవా..

"నేను 25ఏళ్ల ముందు సింగపూర్‌కు వెళితే తెలుగు వారు ఒక్కరుండేవారు కాదు. కానీ నిన్న 40వేల మంది ఒక్క సింగపూర్‌లో ఉన్నారంటే మిగిలినదేశాల్లో ఎంతమంది ఉన్నారో ఆలోచించాలి. అక్కడి స్థానికుల కంటే మనవాళ్ల తలసరి ఆదాయం అధికం. అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, ఐర్లాండ్‌లలో స్థిరపడి సంపాదిస్తున్నారంటే అది నాలెడ్జ్ ఎకానమీలో మనవాళ్లకుండే తెలివితేటలే కారణం." అని చంద్రబాబు తెలిపారు.



కడప జిల్లా గూడెంచెరువు గ్రామంలో జగదీష్ ఆటోలో ప్రజా వేదిక సభకు వెళుతున్న సీఎం చంద్రబాబు

పింఛన్లు పంపిణీ చేసిన సీఎం

ఆటో ఎక్కిప్రజా వేదిక వద్దకు.. మీరొచ్చాక రోడ్లు బాగుపడ్డాయి సార్..

చంద్రబాబుకు వివరించిన జగదీశ్

ముఖ్యమంత్రి చంద్రబాబు జమ్మలమడుగు సమీపంలోని గూడెంచెరువు లో శుక్రవారం పెన్షన్లు పంపిణీ చేశారు. ఉలసాల అలివేలమ్మ అనే లబ్ధిదారు ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారి జీవనస్థితిగతులు ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఆమె పెద్దకుమారుడు వేణుగోపాల్‌కు చెందిన చేనేత మగ్గాన్ని సీఎం పరిశీలించారు. తమకు తల్లికి వందనం లబ్ధి చేకూరిందని వేణుగోపాల్ వివరించారు. అనంతరం అలివేలమ్మ చిన్నకుమారుడు ఆటో డ్రైవరు జగదీశ్‌తో మాట్లాడారు. అదే ఆటోలో సీఎం చంద్రబాబు సమీపంలో ఉన్న ప్రజావేదిక వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో జగదీశ్‌తో సరదాగా ముచ్చటించారు. చంద్రబాబు తనతో సంభాషించడం పట్ల జగదీశ్ సంతోషం వ్యక్తం చేశారు. వారి మధ్య సంభాషణ ఇలా సాగింది..

సీఎం: ఏం తమ్ముడు ఎలా ఉంది?

జగదీశ్: సార్ రోడ్లన్నీ బాగున్నాయి. ప్రభుత్వం మంచి పనిచేస్తోంది.

సీఎం : ఎన్ని రోజుల నుంచి ఆటో నడుపుతున్నావు?

జగదీశ్ : 12 ఏళ్ల నుంచి నడుపుతున్నా సార్

సీఎం: గతంలో ఎలాగుండేది?

జగదీశ్: రోడ్లన్నీ గుంతలుగా ఉండేవి సార్. గ్రావెల్స్ రోడ్లు, రోడ్డుపై వెళ్లేటప్పుడు ఆటోకు ప్రతిసారీ రిపేర్లే, ఇప్పుడు అలాంటివేమీ లేవు. సీసీరోడ్లు వేశారు. కరెంటు రెగ్యులర్‌గా ఉంటుంది. పైపులైను వేశారు. అంతా బాగుంది సార్.

సీఎం: ఆటోలన్నింటినీ ఎలక్ట్రికల్ వెహికల్స్‌గా మారిస్తే బాగుంటుంది కదా.. ఇంట్లోనే చార్జింగ్ చేసుకోవచ్చు.

జగదీశ్: అవును సార్. మాకు మంచి ఆదాయం వస్తుంది

సీఎం: మనమిత్ర యాప్ తెలుసా?

అది ఎలా పనిచేస్తుందో తెలుసా?

జగదీశ్ : కొంచెం తెలుసు.

సీఎం: మనమిత్ర యాప్‌లో అన్ని వివరాలు ప్రభుత్వం పొందుపరిచింది. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు సర్టిఫికెట్లు, మీ ఇంటి నుంచే పొందవచ్చు

జగదీశ్ : సార్ మీరు యువతకు రోల్‌మోడల్.

సీఎం:ఆన్‌లైన్ కోర్సులు పెడుతున్నాం. నువ్వు ఆటో నడుపుతూ కూడా చదువుకునే అవకాశముంది. స్టీలు ప్లాంటు ఇక్కడికి వస్తే ఎలాగుంటుంది.?

జగదీశ్ : స్టీలు ప్లాంటు వస్తే ఈ ప్రాంతమంతా పూర్తిగా అభివృద్ధి అవుతుంది సార్.

(ప్రజావేదిక రావడంతో ఆటో ఆగడంతో చంద్రబాబు దిగారు. ఆయనకు చంద్రబాబు డబ్బు (ఆటోబాడుగ) ఇచ్చారు.

లిక్కర్ కంటే.. ఇసుక స్కామే పెద్దది!

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడి

విజయవాడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కాం కంటే నాటి ఇసుక కుంభకోణమే చాలా పెద్దదని మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. వసూళ్లకు విజయవాడను డెన్‌గా ఎంచుకున్నారని.. బియాండ్ కాఫీ హౌస్‌కు చెందిన సుధీర్ ఈ వసూళ్ల చేపట్టేవాడని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కృష్ణప్రసాద్ ఆ పార్టీలోనే ఉన్నారు. జరిగిన అక్రమాలన్నీ ప్రత్యక్షంగా చూశారు. ఇప్పుడు ఆయనే ఈ మాటలనడం ప్రాధాన్యం సంతరించుకుంది. జగన్ అడ్డగోలు నిర్ణయాలను అడ్డుకోవడంతో ఆయన్ను వైసీపీ నాయకత్వం టార్గెట్ చేసింది. తనపైకి జోగి రమేశ్‌ను, వైసీపీ మూకలను ఉసిగొల్పడంతో ఆయన ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అనంతరం టీడీపీలో చేరి గత ఎన్నికల్లో మైలవరం నుంచి గెలిచారు. 'రూ.1467 కోట్ల ఇసుక దోచేశారు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇసుక కుంభకోణంపై తనకు తెలిసిన వివరాలను మీడియాతో పంచుకున్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసి విచారణకు పిలిస్తే మొత్తం చెబుతానని స్పష్టంచేశారు. 'వైసీపీ ప్రభుత్వం ఏజెన్సీలను ముందుపెట్టి తెరవెనుక అనధికారికంగా రూ.వేల కోట్ల ఇసుక అక్రమ వ్యాపారం నడిపింది. తద్వారా నెలకు రూ.260 కోట్లు వైసీపీ పెద్దల జేబుల్లోకి వెళ్లేవి. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన లాభాల ఆశలు చూపించి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కూడిన సిండికేట్లకు అప్పగించారు. ఒక్కో సిండికేట్‌లో 10-15 మంది ఉండేవారు. నెలకు 20కోట్ల నుంచి 25కోట్ల వరకు కప్పంగా ఫిక్స్ చేశారు. ఆ డబ్బును ప్రతి పది రోజులకోసారి ముందుగానే కట్టాలి. మొత్తం నగదుగానే ఇవ్వాలి. పోలీసులు అడ్డుకోకుండా, కేసులు పెట్టకుండా ఆ రోజుల్లో ఆ పార్టీలో నంబర్‌టూగా ఉన్న విజయసాయిరెడ్డి మాట్లాడేవారు' అని చెప్పారు. పెద్దలకు అయాచితంగా లబ్ధి కలిగేదని.. సిండికేట్లకు మాత్రం నష్టాలు వచ్చేవని.. దాంతో నాలుగైదు నెలలకే వైదొలిగేవారని.. వైసీపీ పెద్దలు మళ్లీ కొత్త సిండికేట్లను ప్రోత్సహించేవారని తెలిపారు. 'ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సిండికేట్లకు కట్టబెట్టారు. ఉభయ గోదావరి జిల్లాలకు రూ.24 కోట్ల చొప్పున టార్గెట్ పెట్టారు. కృష్ణా జిల్లాకు రూ.22కోట్లు.. గుంటూరుకు రూ.24 కోట్లు.. ఇలా ప్రతి జిల్లాకు సగటున రూ.22 కోట్ల నుంచి రూ.25కోట్ల వరకు నెలకు టార్గెట్లు పెట్టారు. అంతకంటే ఎక్కువ సిండికేట్లకు వస్తే ఆ మొత్తాన్ని వారిని ఉంచుకోమని చెప్పేవారు. ప్రభుత్వ పెద్దలకు మాత్రం ఫిక్స్‌చేసిన డబ్బు కట్టేయాల్సిందే' అని వివరించారు. ఆర్థిక వ్యవహారాలు పూర్తిగా నగదు రూపంలోనే జరిగేవన్నారు. రూ.కోట్ల ఆశలు, లాభాల లెక్కల సినిమా చూపించడంతో స్థానిక వైసీపీ నేతలు ఆశపడి అప్పులు చేసి మరీ సిండికేట్లలో చేరారని.. ప్రభుత్వ పెద్దలు నిర్దేశించిన ప్యాకేజీని ముందుగానే కట్టారని.. ఆ సిండికేట్లలో బాగుపడిన వారెవరూ లేరని వెల్లడించారు. రాష్ట్రంలో లోకల్‌గా పోలీసులు వేధిస్తే.. సిండికేట్లు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లేవని.. అప్పుడు విజయసాయిరెడ్డి రంగంలోకి దిగి పోలీసులతో మాట్లాడేవారని అన్నారు. 'ఇసుక కుంభకోణంలో అవినీతి వివరాలు నా వద్ద ఉన్నా యి. సంబంధిత అధికారులు, సిట్ విచారణకు పిలిస్తే వాస్తవాలు వివరిస్తా' అని కృష్ణప్రసాద్ తెలిపారు.



హామీల అమలులో ప్రభుత్వం విఫలం: బొత్స

విశాఖపట్నం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైసీపీ ఒత్తిడి ఫలితంగానే అమ్మఒడి పథకాన్ని అరకొరగా వాయిదాల పద్ధతిలో అమలు చేస్తున్నారు. అదేవిధంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుకు ముందుకు వచ్చింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. హత్యలు సర్వసాధారణమైపోయాయి. పాలనను పూర్తిగా గాలికి వదిలేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జగన్ పర్యటనపై అడుగడుగునా ఆంక్షలు విధించడం దారుణం. మా పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే అధినేత పరామర్శించడం తప్పా? గతంలో ఎన్నడూ లేని విధంగా విశాఖలో డ్రగ్స్‌తో యువకులు పట్టుబడ్డారు. ఆ యువకులు అధికార పార్టీకి చెందిన నేతల సన్నిహితులు, బంధువులంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. రాష్ట్రంలో యథేచ్ఛగా భూ దోపిడీ జరుగుతోంది. లులూ సంస్థకు ఉద్యోగాల కోసం భూములు ఇస్తున్నారా?, లాలూచీ పడి ఇస్తున్నారా?' అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, శాసన మండలి సభ్యులు పెనుమత్స వీరవెంకట సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు డబ్బులు ఇంతకాలం ఉన్నాయా?

» ప్రజల దృష్టిని మరల్చడానికే మాపై కేసులు పెడుతోంది: సజ్జల




అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఫామ్‌హౌస్‌లో దాచిన డబ్బులు ఇప్పటి వరకూ ఉన్నాయా? అసలు కుంభకోణం ఎక్కడ జరిగిందో అర్థం కావడం లేదు' అని వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. విజయవాడలో లిక్కర్ స్కామ్ నిందితులను పరామర్శించేందుకు శుక్రవారం వైసీపీ నేతలతో వెళ్లిన ఆయన ఆ తరువాత మీడియాతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైంది. ఏపీలో ఒక సీఎం, ఇద్దరు డీసీఎంలు ఉన్నారు. ఇద్దరిలో ఒక డీసీఎం డిప్యూటీ సీఎంగా ఉంటే.. మరొకరు డీఫ్యాక్టో సీఎంగా ఉన్నారు. వారెవ్వరికీ ప్రజా సమస్యలు పట్టడం లేదు. లిక్కర్ స్కామ్ ఎక్కడ జరిగింది? అసలు జరగని కుంభకోణంలో అరెస్టులు ఏమిటి? ఈ పేరుతో ప్రజల దృష్టిని మరల్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజల్లోకి జగన్ వెళ్లకుండా అడ్డుకోవడానికి ఏదో ఒక డైవర్షన్ చేస్తున్నారు. సీజ్ చేశామని చెబుతున్న రూ.11కోట్లు ఎవరివి? అతని స్టేట్‌మెంట్ రికార్డు చేశారా? ఏపీఎండీసీలో స్కామ్ జరిగిందంటూ ప్రభుత్వం కొత్తరాగం అందుకుంది' అని సజ్జల అన్నారు.

అన్నదాతకు చంద్రబాబు ఇచ్చేది 14 వేలే: షర్మిల


అమరావతి, ఆగస్టు 1(అమరావతి): అన్నదాత సుఖీభవ పథకంలో కేంద్రం ఇచ్చే రూ.6,000 తీసేస్తే చంద్రబాబు ఇచ్చేది రూ.14,000 మాత్రమే అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20,000 ఇస్తామని ప్రకటించి... తీరా ఎన్నికల్లో గెలిచాక కేవలం రూ.14.000 ఇవ్వడం ఏమిటి? అని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆమె, సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవలో 30 లక్షల మంది రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తల్లికి వందనంలో 20 లక్షల మంది తల్లులకు, గ్యాస్ సిలెండర్ పథకంలో సగం మంది మహిళలకు ఎగనామం పెట్టారన్నారు. సూపర్ సిక్స్ హామీల అర్హులందరికీ పథకాలను ఇవ్వకుండా సగం మందికి ఎత్తేస్తున్నారని ఆరోపించారు.

శ్రీశైలం జోరు.. 'సాగర్' హోరు

వరద నీటి విడుదలతో కృష్ణమ్మ పరవళ్లు



శ్రీశైలం డ్యాం నుంచి సాగర్‌కు విడుదలవుతున్న వరద



నాగార్జున సాగర్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నంద్యాల, విజయపురిసౌత్, అచ్చంపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు 8 క్రస్ట్ గేట్లను పదడుగుల మేర ఎత్తి శుక్రవారం 2,15,424 క్యూసెక్కులు దిగువకు.. కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ ఉత్పాదన నిమిత్తం మరో 65,592 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే తెలంగాణాలోని కల్వకుర్తికి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 2,52,560 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం డ్యాంలోకి వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 201.5822 టీఎంసీలుగా నమోదైంది.

సాగర్‌లో 26 గేట్ల నుంచి నీటి విడుదల

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు శ్రీశైలం నుంచి 2,57,342 క్యూసెక్కుల భారీ వరద చేరుతోంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 2,09,966 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 8604, ఎడమ కాలువ ద్వారా 7684, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,57,342 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 585.20 అడుగులుంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,57,342 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల నుంచి 2,05,278 క్యూసెక్కులు..

పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 40.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,12,271 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, ఎనిమిది గేట్ల ద్వారా 1,88,278 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 2,05,278 క్యూసెక్కుల నీరు దిగువన విడుదలవుతోంది.

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా

తుహిన్ కుమార్

» నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర



అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా న్యాయవాది గేదెల తుహిన్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో ఆయన నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. సీజేఐ బీఆర్.గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం గత నెల 2న సమావేశమై.. తుహిన్ కుమార్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా నియమించాలని కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర హైకోర్టులో 37 మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉంది. అదనపు న్యాయమూర్తులతో కలుపుకొని ప్రస్తుతం 29 మంది న్యాయమూర్తులు ఉన్నారు. తుహిన్ నియామకంతో ఈ సంఖ్య 30కి చేరనుంది.

1994లో హైకోర్టు న్యాయవాదిగా ఎన్‌రోల్

తుహిన్ కుమార్ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా వీరగట్టం మండలం కత్తులకవిటి గ్రామం. తల్లిదండ్రులు సరోజినినాయుడు, కృష్ణమూర్తినాయుడు. విశాఖలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తిచేశారు. లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు పొందిన ఆయన విశాఖ ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1994లో హైకోర్టు న్యాయవాదిగా నమోదయ్యారు. విశాఖలో జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. ఏడాదిన్నర తర్వాత ప్రాక్టీస్‌ను ఏపీ హైకోర్టుకు మార్చారు. 2000-2004 మధ్య ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ)గా పనిచేశారు. 2010-14 మధ్య గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ తరఫున హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2016-17లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్నారు.

కడపలో సోలార్ కార్పొరేషన్‌కు 1,200 ఎకరాలు

» నంద్యాల జిల్లాలో గ్రీన్‌కోకు 174 ఎకరాలు

» అన్నమయ్య జిల్లాలో టిడ్కోకు 50 ఎకరాలు

» కుప్పంలో కేంద్రీయ విద్యాలయానికి ఏడెకరాలు

» ఆగిరిపల్లిలో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్‌కు 45 ఎకరాలు

» ఆమోదించిన ఏపీఎల్ఎమ్ఏ

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు కంపెనీలకు భూ కేటాయింపుల ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ భూ నిర్వహణ సంస్థ (ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ-ఏపీఎల్ఎమ్ఏ) ఆమోదం తెలిపింది. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సీసీఎల్ఏ కార్యాలయంలో అథారిటీ సమావేశం జరిగింది. అదనపు సీసీఎల్ఏ, కన్వీనర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి, ఆర్థిక, పురపాలక, ఇంధన, గృహనిర్మాణ, పరిశ్రమలు, వ్యవసాయ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. కీలకమైన ఎనిమిది అంశాల ఎజెండాపై చర్చించారు. రాష్ట్ర సోలార్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కడప జిల్లా మైలవరం మండలం దొడియం, వడ్డీరాల గ్రామాల్లో 1,200 ఎకరాలను లీజు ప్రాతిపదికన ఇవ్వాలని నిర్ణయించారు. గ్రీన్‌కో కంపెనీకి నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలో 174.1 ఎకరాల కేటాయింపునకు ఎల్ఎమ్ఏ ఆమోదం తెలిపింది. గతంలో నిర్ణయించిన ధర మేరకు ఎకరా రూ.5 లక్షల చొప్పున కేటాయించాలని తీర్మానించినట్లు తెలిసింది. కడప జిల్లా కొండాపురం మండలం కొప్పోలు, కోడూరు, చామలూరు గ్రామాల్లో 45 ఎకరాలు హెటిరో విండ్‌పవర్‌కు.. తొండూరు మండలం మల్లేల, ఉడవగండ్ల గ్రామాల్లో 40 ఎకరాలు అట్రియా విండ్‌పవర్‌కు కేటాయించేందుకు సమ్మతించారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం బైరాగునిపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 7.74 ఎకరాలు కేటాయించాలన్న ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం సిబయల గ్రామంలో ఏపీ టిడ్కోకు 50 ఎకరాలు కేటాయింపునకు అంగీకరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహనిర్మాణం కోసం ఈ భూములు కేటాయించారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 45.60 ఎకరాల కేటాయింపునకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఎకరాకు రూ.37 లక్షల ధర వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిపాదించినట్లు తెలిసింది. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం ఈ భూమిని కేటాయించింది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వ ఆమోదం కోసం పంపించనున్నారు.

రహదారుల పనుల జోరు

రాష్ట్రంలో పలు కొత్త ప్రాజెక్టులు

» 185 కి.మీ. పరిధిలో నిర్మాణం

» నేడు 2,381 కోట్ల వర్క్‌లకు శంకుస్థాపన



అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులకు మోక్షం లభించింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ, జాతీయ రహదారుల సంస్థలు సంయుక్తంగా పలు కొత్త ప్రాజెక్టులు చేపట్టబోతున్నాయి. 185 కి.మీ. పరిధిలో కొత్తగా రూ. 2,381 కోట్లతో రహదారుల నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి, ఫ్లైఓవర్‌ల నిర్మాణం చేపట్టబోతున్నారు. కేంద్ర రోడ్డురవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కలసి శనివారం ఆ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇవి కాకుండా ఇప్పటికే కేంద్రం చేపట్టిన రెండు రహదారి ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. వాటిని లాంఛనంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు.

శంకుస్థాపన చేసే ప్రాజెక్టులు

- పల్నాడు జిల్లాలో చిలూకలూరిపేట నుంచి నకరికల్లు వరకు ఉన్న జాతీయ రహదారి 167ఏని రూ. 787 కోట్లతో విస్తరించబోతున్నారు. ఈ రహదారి 38 కిమీ పొడవు ఉంది.
- రాజమండ్రిలో ఎన్‌హెచ్ 16పై గామన్ జంక్షన్ వద్ద రూ. 327 కోట్ల వ్యయంతో 3 కి.మీ. పొడవైన ఫ్లైఓవర్ నిర్మించబోతున్నారు. ఈ పనిని ఎన్‌హెచ్ఏఐ చేపట్టనుంది. లాలాచెరువు జంక్షన్ వద్ద ఎన్‌హెచ్ 216ఏను రూ. 232 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ రహదారి పొడవు 6 కి.మీ..
- చింతూరు నుంచి మోటు వరకు ఉన్న ఎన్‌హెచ్ 326 రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. దీని నిర్మాణ వ్యయం రూ. 98 కోట్లు.
- గురజాల నగరంలో మాచర్ల, రెంటచింతల బైపాస్‌రోడ్డు విస్తరణ పనులను రూ. 54 కోట్లతో విస్తరణ చేయనున్నారు.

---

4 నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని రానున్న రెండు రోజుల్లో దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు పరిసరాల్లో ఉత్తర, దక్షిణ ద్రోణి ఒకటి ఏర్పడనుంది. దీని ప్రభావంతో ఆ తర్వాత రెండు రోజుల్లో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. ఇంకా దక్షిణ తమిళనాడు పరిసరాల్లో రానున్న రెండు, మూడు రోజుల్లో తూర్పు, పడమర ద్రోణి ఒకటి విస్తరించే వాతావరణం నెలకొంది. వీటి ప్రభావంతో ఉత్తర తమిళనాడుకు ఆనుకుని రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో పలుచోట్ల ఈనెల 4వ తేదీన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఐదో తేదీ నుంచి మరింత పెరిగి అక్కడక్కడా భారీవర్షాలు కురవనున్నాయని పేర్కొంది.

ఇసుక అక్రమ తవ్వకాల కేసు విచారణ వాయిదా

» జీఎన్టీ తీర్పుపై సుప్రీంలో జేపీ పిటిషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నాడు ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు వ్యతిరేకంగా గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. జేపీ వెంచర్స్‌కు దాదాపు రూ.18 కోట్ల జరిమానా విధించింది. గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుపై 2023 మే 15న జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా అందుబాటులో లేరని జూనియర్ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తదుపరి విచారణను సెప్టెంబరు 3కు సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

ఆరుగురు హౌసింగ్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు

» వారి అక్రమాలపై సమగ్ర విచారణకు ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ కార్యక్రమాల్లో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన హౌసింగ్ అధికారులపై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీరు సి.జయరామాచారిని విచారణాధికారిగా, కడప జిల్లా ఇన్‌చార్జి హౌసింగ్ హెడ్ వి.రాజరత్నంను ప్రెజెంటింగ్ ఆఫీసర్‌గా నియమించింది. మూడు నెలల్లో విచారణ నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం అమృతనగర్ కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణ పథకం అమలులో అక్రమాలు జరిగినట్లు విచారణలో నిర్ధారించారు. ప్రొద్దుటూరు గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కవర్ చేసే ప్రాజెక్టు అమలులో అక్రమ చెల్లింపులు చేసి ఉల్లంఘనలకు పాల్పడిన ఆరుగురు హౌసింగ్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని విచారణాధికారి సిఫారసు చేశారు. దాంతో ప్రస్తుతం సర్వీసులో ఉన్న పులివెందుల హౌసింగ్ ఏఈ సి.సంజీవరాయుడు, గతంలో అక్కడ పనిచేసిన ఏఈలు టి.కె.ప్రతాప్‌రెడ్డి (ప్రస్తుతం కమలాపురం ఏఈ), డి.లాలికృష్ణయ్య (ప్రస్తుతం కర్నూలు జిల్లా మంత్రాలయం డిప్యూటీ ఈఈగా ఉన్నారు)ల పైన, గతంలో ప్రొద్దుటూరు ఈఈగా పనిచేసి పదవీ విరమణ చేసిన పి.నాగేశ్వరరావు, డీఈఈగా పని చేసి రిటైరైన ఆర్.వీరన్న, ఈఈ ఎన్.రాజశేఖర్‌లపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలను ప్రారంభించింది. దీంతో వారు తమపై అభియోగాలను తిరస్కరిస్తూ తదుపరి చర్యలను ఉపసంహరించాలని అభ్యర్థిస్తూ లిఖితపూర్వకంగా అర్జీలను సమర్పించారు. దీంతో సదరు అభియోగాలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డీఎస్సీ తుది 'కీ' విడుదల

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షల తుది 'కీ'ని డీఎస్సీ-2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో 'కీ'ని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి తుది 'కీ' రూపొందించామని, దీనిపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించే అవకాశం లేదని స్పష్టం చేశారు. కాగా, 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం జూన్ 6 నుంచి జూలై 2 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు.

నకిలీ వెబ్‌సైట్లతో దోపిడీ

18 రాష్ట్రాల్లో.. 127 ఫిర్యాదులు

» రిసార్ట్స్, హోటల్స్ బుకింగ్ పేరిట నగదు కాజేత

» ముగ్గురు విద్యార్థుల ఖాతాల్లో సొమ్ము జమ

» రాజస్థాన్‌లో ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు



కేసును ఛేదించిన రెండు బృందాలతో ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 రాష్ట్రాల్లో 127 కేసులు.. దాదాపు ఏడాది నుంచి బ్యాంకు ఖాతాలు మార్చి మార్చి.. పర్యాటకులే లక్ష్యంగా దోపిడీ.. అన్నిచోట్లా ఫిర్యాదులు తీసుకోవడం తప్ప విచారణ ముందుకు సాగని పరిస్థితి.! కానీ.. బాపట్ల జిల్లా పోలీసులు పక్కావ్యూహంతో ముందుకెళ్లడంతో సైబర్ నేరగాళ్లు దొరికిపోయారు. ఈ కేసుపైనే ఏడాదిపాటు దృష్టి సారించిన రెండు బృందాలు.. ఖాకీ సినిమా తరహాలో రాజస్థాన్ వెళ్లి.. స్థానిక పోలీసుల సాయంతో ఇద్దరు నిందితులను ఇక్కడకు పట్టుకొచ్చారు. ఆ వివరాలను పోలీసులు శుక్రవారం వెల్లడించారు.

హరిత రిసార్టుపైనే 49 ఫిర్యాదులు

చీరాల, బాపట్ల తీర ప్రాంతాలు పర్యాటకంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. తెలంగాణతో పాటు బెంగళూరు, తమిళనాడు నుంచి కూడా వారాంతాల్లో పర్యాటకులు పెద్దసంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. ఈ క్రమంలో సైబర్ దొంగల కన్ను ఈ ప్రాంతంపై పడింది. సూర్యలంకలోని హరిత రిసార్ట్‌ను లక్ష్యంగా నకిలీ వెబ్‌సైట్ సృష్టించి దందాకు తెరలేపారు. ఈ వెబ్‌సైట్‌లో రిసార్టులు బుక్ చేసుకున్న వారు భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ మోసాలపై వివిధ ప్రాంతాల్లో 49ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది జూన్ 16న బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. ఈ కేసు విచారణకు ఎస్పీ తుషార్ డూడీ.. ఏడుగురు పోలీసులతో ఐటీ సైబర్ కోర్ టీమ్, ఐదుగురు పోలీసులతో విచారణ అండ్ ఫీల్డ్ టీమ్ అంటూ రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లు బ్యాంకు ఖాతాలు మొదలుకుని ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌ల వరకూ.. ఏ ఒక్క సాంకేతిక అంశాన్నీ వదలకుండా జల్లెడ పట్టాయి. ఐపీ అడ్రస్‌లను నిత్యం ట్రాక్‌లో ఉంచి మూలాలు రాజస్థాన్‌లో ఉన్నాయని గుర్తించాయి.

రెండు దఫాలుగా రాజస్థాన్‌కు..

కేసు విచారణలో భాగంగా తొలుత ముగ్గురు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకి ఈ నగదు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వీరంతా రాజస్థాన్‌కు చెందిన వారు కావడంతో అక్కడకే వెళ్లి విచారణ చేపట్టారు. అయితే ఈ ముగ్గురూ అమాయకులని, వారిని ఎరగా వేసి సైబర్ నేరగాళ్లు డబ్బు కొల్లగొడుతున్నారని గుర్తించారు. రెండోసారి పక్కా ఆధారాలతో రాజస్థాన్ వెళ్లిన పోలీసులు దాదాపు రెండు వారాలు అక్కడే ఉండి కేసును ఛేదించారు. నిందితులు ఉన్నట్లు గుర్తించిన దిగ్ జిల్లాలోని సహసన్ ప్రాంతానికి కొత్తవ్యక్తులు వెళ్లడం అసాధ్యం. అక్కడ స్థావరం ఏర్పాటు చేసుకున్న నిందితులు బయటి నుంచి ఎవరు వచ్చినా తెలిసేలా పటిష్ఠ నిఘా వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లడమే పోలీసులకు సవాల్‌గా మారింది. రెండు సార్లు ప్రయత్నించి విఫలయ్యారు కూడా. అయితే స్థానిక ఉన్న ఫారెస్ట్ అధికారి సాయంతో ఎట్టకేలకు అక్కడకు వెళ్లి పరంజిత్ (20), బిట్టూ (21)లను అదుపులోకి తీసుకుని ఇక్కడకు తీసుకువచ్చారు. నిందితులు చేసిన మోసాలపై 18 రాష్ట్రాల పరిధిలో 127 ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసు విచారణలో తేలింది. ఎంతో శ్రమించి కేసు ఛేదించిన రెండు టీమ్‌లను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

కాంబోడియా.. వయా ఢిల్లీ...!

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల వల

» తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల ఆశ

» విడతలవారీగా రూ.1.73 కోట్లు దోపిడీ



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు

అనంతపురం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నకిలీ యాప్స్‌తో కాంబోడియా నుంచి వల వేశారు. ఢిల్లీ కేంద్రంగా ఫేక్ అకౌంట్లు నిర్వహిస్తూ అనంతపురం జిల్లాకు చెందిన టెకీ నుంచి విడతలవారీగా రూ.1.73 కోట్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అనంతపురం పోలీసులు నెలరోజులపాటు శ్రమించి.. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల్లో గాలించి.. ఐదుగురు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టుచేశారు. ఆ వివరాలను అనంతపురం ఎస్పీ జగదీష్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని రాయదుర్గం మండలం వేపరాళ్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరసింహప్ప.. ఫేస్‌బుక్‌లో కనిపించిన ఇన్వెస్ట్‌మెంట్ యాడ్‌కు ఆకర్షితుడయ్యారు. దానిపై క్లిక్ చేయగానే కాంబోడియా నుంచి నడుస్తున్న వాట్సప్ గ్రూప్‌లో చేరిపోయాడు. ఈ గ్రూప్ వేదికగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చంటూ సైబర్ నేరగాళ్లు వల విసిరారు. నమ్మిన టెకీ 'వీఐపీ66 బజాజ్ ఇన్వెస్ట్‌మెంట్', 'కె26జిరోడహా మార్కెట్ ఇన్‌సైట్స్' వంటి ఫేక్ యాప్స్‌ను ఫాలో అవుతూ తొలుత రూ.12లక్షల పెట్టుబడి పెట్టారు. కొన్ని రోజుల్లోనే రూ.5.50లక్షల లాభం వచ్చిందని చెప్పిన సైబర్ నేరగాళ్లు.. విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారు. భారీగా ఆదాయం వస్తుండడంతో నరసింహప్ప ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి మే 14 వరకూ విడతలవారీగా రూ.1,73,99,333 జమ చేశారు. పెట్టుబడి, లాభం కలిపి రూ.3.40 కోట్లు అయిందని, ఆ మొత్తం విత్‌డ్రా చేసుకోవాలంటే ట్యాక్స్, బ్రోకరేజీ కింద 40 శాతం డబ్బులు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు చెప్పారు. దీంతో టెకీకి అనుమానం వచ్చి జూన్ 18న రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ జగదీష్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఢిల్లీ, పుణె, సూరత్, మధ్యప్రదేశ్, పట్నా, బిహార్, ఒడిసా, బెంగళూరు, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో నెల రోజులపాటు వేట కొనసాగించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా పలుప్రాంతాల్లో 13 ఫేక్ అకౌంట్లు సృష్టించి బాధితుడి నుంచి సొమ్ము లాగేసినట్లు గుర్తించారు. సైబర్ నేరగాళ్ల కోసం అన్వేషణ మొదలెట్టిన పోలీసులు ఫేక్ ఖాతాల కూపీ లాగారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ బ్యాంకు మేనేజర్ వడ్లమూడి ఫణికుమార్ ద్వారా తెరిచిన ఫేక్ బ్యాంకు ఖాతాలను కొంగతి కృష్ణ ద్వారా కోదండరామ దుర్గసాయి ప్రసాద్ సేకరించాడు. వాటిని ఢిల్లీలోని శ్యాంజీ, ధర్మేంద్ర సింగ్‌కు పంపాడు. వీరు ఢిల్లీ కేంద్రంగా ఇంటర్నెట్ బ్యాంకింగ్ యాక్సిస్ ద్వారా ఫేక్ అకౌంట్లలోకి డబ్బు లావాదేవీలు చేశారు. ఆ డబ్బును క్రిప్టో కరెన్సీ ద్వారా దేశం దాటించేందుకు సిద్ధపడినట్లు గుర్తించారు. వెస్ట్ ఢిల్లీ తిలక్ నగర్‌కు చెందిన భావనేష్ గోయల్ అలియాస్ శ్యామ్‌జీ (48), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేంద్ర సింగ్(43), హైదరాబాద్ ఐడీఏ జీడిమెట్లకు చెందిన కోదండరామ దుర్గాసాయి ప్రసాద్(32), ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన కొంగతి కృష్ణ(43), వడ్లమూడి ఫణికుమార్(39)ను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.41.20 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, ఒక కారు, 20 ఏటీఎం కార్డులు, 15 సిమ్‌కార్డులు, 5 బ్యాంకు పాస్‌పుస్తకాలు, 10 చెక్ బుక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ప్రైవేట్ బ్యాంకు మేనేజర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ జగదీష్ ప్రకటించారు.

మీరు కడతామంటే.. మేం అడ్డుకొంటాం

» లోకేశ్ వ్యాఖ్యలపై రేవంత్ స్పందించరా?: హరీశ్ రావు



హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): "నిబంధనలకు విరుద్ధంగా.. తెలంగాణకు అన్యాయం జరిగేలా.. మీరు బనకచర్ల ప్రాజెక్టును కట్టితీరతామంటే.. మేం అడ్డుకొని తీరతాం" అని మాజీమంత్రి హరీశ్ రావు ఏపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బలం, రేవంత్‌రెడ్డి అండచూసుకొని.. కేంద్రం అనుమతులు సాధిస్తాం.. బనకచర్ల కట్టితీరతామని.. ఏపీ మంత్రి నారా లోకేశ్ తెగింపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఏపీలో అధికారం, కేంద్రం మద్దతు ఉందని ఏదిపడితే అది మాట్లాడటం తగదని పేర్కొన్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని, సీఎం, మంత్రులు ఎవరూ ఖండించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చేసుకున్న లోపాయికారి ఒప్పందంవల్లే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. చంద్రబాబుకు తన గురుదక్షిణ చెల్లించడంతోపాటు ఢిల్లీ మెప్పుకోసం ప్రయత్నిస్తున్న రేవంత్‌కు రాష్ట్ర ప్రయోజనాలు పట్టడంలేదని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యం అని, బనకచర్ల ప్రాజెక్టును ఆపేవరకు పోరాడతామని, అవసరమైతే.. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్తుందని చెప్పారు. తెలంగాణ హక్కులకు ఇబ్బంది కలగకుండా ఏపీలో ప్రాజెక్టులు కట్టుకుంటే అభ్యంతరం లేదన్నారు. పార్లమెంటులో వాయిదా తీర్మానం ఇచ్చి బనకచర్లపై నిలదీయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై లోకేశ్‌కు అవగాహన లేదని, అందుకే అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతుల్లేవని లోకేశ్ చెప్పడం శుద్ధ అబద్ధమని.. కేంద్రం పరిధిలోని 11 రకాల అనుమతులు పొందామని, అది కొత్త ప్రాజెక్టు కాదని, ప్రాణహితలో అంతర్భాగం కాబట్టి.. రాష్ట్ర పునర్విభజన చట్టం వర్తించదని కేంద్రం స్పష్టంగా పేర్కొందని చెప్పారు. కాళేశ్వరాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు కేంద్రానికి ఏడు ఉత్తరాలు రాశారని వెల్లడించారు. తాము ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నామని మాట్లాడటం సరికాదన్నారు. గతంలో బాబ్లీ, ఆల్మట్టి ప్రాజెక్టుల గురించి చంద్రబాబు కొట్లాడారని, అప్పుడు కూడా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టినట్లేనా? అని ఆయన నిలదీశారు.

వరదలతో ఏపీకి ఏటా వేల కోట్ల నష్టం

» అందులో వాటా కావాలని బీఆర్ఎస్ అడగదేం?

» ప్రాంతీయ విద్వేషాలు రగిల్చే యత్నం: మంత్రి నిమ్మల



అమరావతి/పాలకొల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.2వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్ల వరకూ నష్టం వాటిల్లుతోందని, ఈ నష్టంలో వాటా ఎందుకు అడగడం లేదని బీఆర్ఎస్ నేతలను మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శుక్రవారం రాత్రి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం- బనకచర్ల అనుసంధానంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలోని అంతర్గత రాజకీయ వైరాలను ఏపీపై రుద్దవద్దని కోరారు. సముద్రంలోకి వృథాగా పోయే గోదావరి జలాలను వినియోగించుకుంటే తప్పేంటని ఆ పార్టీ నాయకుడు హరీశ్‌రావును నిమ్మల నిలదీశారు. పోలవరం- బనకచర్ల అనుసంధానంతో ఎగువ రాష్ట్రాలకు వచ్చే నష్టమేంటని ప్రశ్నించారు. 1975 నుంచి గత 50 ఏళ్లలో 1,53,000 టీఎంసీల జలాలు సముద్రంలోకి వృథాగా పోయాయని వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే 600 టీఎంసీలు వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టు వద్దకు వచ్చిన వరద జలాలను వినియోగించుకోకపోతే నేరుగా సముద్రంలోకి వెళ్లిపోతాయని చెప్పారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు పోలవరం-బనకచర్ల అనుసంధానం దోహదపడుతుందని తెలిపారు. త్వరలో తెలంగాణలో స్థానిక ఎన్నికలు ఉండటంతో ప్రాంతీయ విద్వేషాలు రగిల్చేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదమ్ముల్లాంటి తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికారు. కాళేశ్వరం, సీతారామసాగరం వంటి అనేక ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండానే నిర్మించుకుందని గుర్తుచేశారు. ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్న పోలవరం- బనకచర్లపై రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమను గోదావరి జలాలతో రతనాల సీమ చేస్తానని అధికారంలో ఉన్నప్పుడు చెప్పిన కేసీఆర్ నేడు మాట మార్చడం సమంజసమేనా అని నిమ్మల ప్రశ్నించారు.

'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డుకు

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

అమరావతి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డులకు టీచర్లను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. అదేవిధంగా అవార్డులకు సంబంధించిన విధివిధానాలపై మార్గదర్శకాలు జారీ చేసింది. సెప్టెంబరు 5న నిర్వహించే గురుపూజోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన టీచర్లకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకులాలు, కేజీబీవీలు, డైట్ కాలేజీలు, ఏపీ గురుకులాల మేనేజ్‌మెంట్లలోని టీచర్లకు ఈ అవార్డులు ఇస్తారు. ఈసారి మూడు విధానాల్లో ఉత్తమ టీచర్లను ఎంపిక చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ సూచించిన 14 కేటగిరీల్లో సాధించిన ఫలితాల ఆధారంగా టీచర్లు వ్యక్తిగతంగా అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోని ఉపాధ్యాయుల పేరును ఐదుగురు టీచర్లు అవార్డు కోసం సిఫారసు చేయవచ్చు. ఆగస్టు 1 నుంచి 8 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ నెల 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 25న తుది జాబితా ఖరారు చేస్తారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*

నవ్య
కుటుంబ కదంబం
శనివారం 2 ఆగస్టు 2025

మేకప్

పోకడలతో పోటీ పడేలా



మేకప్ వేసుకునే విధానంలో కాలానుగుణమైనా మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. ఫ్యాషన్ మాదిరిగానే మేకప్‌లో చోటుచేసుకునే మార్పులను ఎప్పటికప్పుడు అనుసరించగలిగితే అందరి కళ్లూ మన వైపే ఉంటాయి. అందుకోసం పాటించవలసిన నియమాలు ఇవే!

కనుబొమలను సన్నగా తీర్చిదిద్దే పోకడ పునరావృతమైంది. అయితే నిపుణుల సహాయంతో ఏ ముఖాకృతికి ఎలాంటి కనుబొమలు నప్పుతాయో తెలుసుకుని, వారి సహాయంతో కనుబొమలను విల్లుల్లా తీర్చిదిద్దుకుని నలుగురినీ ఆకట్టుకోవచ్చు. అలాగే కనుబొమలను దిద్దుకోవడం కోసం నలుపు రంగుకు బదులుగా ముదురు గోధుమ రంగు ఐబ్రో పెన్సిల్ ఎంచుకోవాలి.

ఐషాడో ఇలా...

డ్రెస్ రంగుకు నప్పేలా అదే రంగు ఐషాడో ఎంచుకునే రోజులు పోయాయి. ప్రత్యేకంగా కనిపించేలా చేసే 'పేల్ బ్లూ పెర్ల్', 'స్మోకీ నేవీ' రంగులు వాడుకలోకొచ్చాయి. వీటిలో దేన్ని ఎంచుకున్నా, కనురెప్పలు ఎబ్బెట్టుగా కనిపించకుండా ఐలైనర్‌లో కలిసిపోయేలా ఐషాడోను పూసుకోవాలి. కనురెప్పలు దించినా, లేపినా కంటి అందం చెక్కుచెదరకుండా ఉండేలా చూసుకోవాలి.

లిప్ లైనర్‌తో...

పెదవులకు లిప్‌స్టిక్ పులిమేసుకునే రోజులు పోయి, లైనర్ మీద దృష్టిని పెంచే రోజులొచ్చాయి. లైనర్‌తో పెదవులను అంచులను తీర్చిదిద్ది, పలుచగా లిప్‌స్టిక్ అద్దుకోవడమే తాజా పోకడ. అయితే ఎంచుకునే లిప్ లైనర్ వీలైనంత ముదురు రంగులో ఉండేలా చూసుకోవాలి. పెదవుల అంచుల దగ్గరి నుంచి మొదలుపెట్టి, మధ్య వరకూ లైనర్ గీసుకుని, లేత గులాబీ, పీచ్ రంగు లిప్‌స్టిక్ పెదవులకు పలుచగా అద్దుకోవాలి.

గోళ్లకు సింగారం

నెయిల్ ఆర్ట్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. డ్రెస్‌తో మ్యాచ్ అయ్యే రంగులతో పాటు, డిజైన్‌ను కూడా మ్యాచ్ చేసుకోవడం తాజా పోకడ. ఇందుకోసం క్రిస్టల్స్, బీడ్స్, చమ్కీలను ఎంచుకోవచ్చు.

చమ్కీ చమక్కు

ఐషాడో, లిప్ కలర్, బ్లష్. వీటన్నిట్లో మెరుపు కలిసి ఉంటే అదొక అదనపు హంగు అవుతుంది. పార్టీలు, పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో, ఈవెంట్లలో ఇలాంటి మేకప్‌ను ఎంచుకుంటే మెరుపులు మెరిపించవచ్చు. ఈ ట్రెండ్‌కు ఆదరణ ఎప్పటికీ ఉండేదే!



"రెండు దేశాలు... రెండు సంస్కృతులు... కానీ అందరినీ కలిపేది విజ్ఞానం మాత్రమే" అని నమ్ముతారు చైత్రారావు. ఈ వారం అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా', భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' సంయుక్తంగా అభివృద్ధి చేసిన నైసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమయింది. ఈ ప్రాజెక్టుకు చైత్రారావు డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. గత 18 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు ప్రతి అడుగులోనూ ఆమె కీలక భూమిక పోషిస్తున్నారు. నైసార్ ప్రయోగం విజయవంతయిన తర్వాత- ఆ ప్రాజెక్టులోని సాంకేతిక అంశాల గురించి వివరించారు.

దేశాలు వేరైనా అందరం ఒకటే!

'వందేమాతరం' అంటూ ముగించిన చైత్రారావు ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలోని చిన్న పల్లెటూరు నుంచి వచ్చిన చైత్రారావు ప్రస్థానాన్ని జాగ్రత్తగా గమనిస్తే- అపరిమితమైన ఓర్పు, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస, తాను అనుకున్న లక్ష్యాలను ఎలాగైనా సాధించే పట్టుదల కనిపిస్తాయి. "నేను శివమొగ్గ జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో పుట్టి పెరిగాను. మాకు బెంగుళూరు దగ్గరనే ఉండేది. నేను స్కూల్లో చదివే రోజుల్లో 'ఇస్రో'కు నాలుగైదు సార్లు వెళ్లాను. అది నాకు వేరే ప్రపంచంలా అనిపించింది. పెద్దయిన తర్వాత ఎలాగైనా 'ఇస్రో'లో పని చేయాలనుకొనేదాన్ని. కానీ అంగారకుడిపైకి 'ఇస్రో' పంపిన 'మామ్' ఉపగ్రహం టీమ్‌లో పని చేస్తానని కలలో కూడా అనుకోలేదు. నా ప్రస్థానంలో నాకు తోడుగా నిలిచిన నా కుటుంబానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను" అని చైత్రారావు గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

వడివడిగా ఎదుగుతూ...

ఇస్రోలో యువ శాస్త్రవేత్తగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన చైత్రారావు అనేక ప్రయోగాలలో కీలకమైన పాత్ర పోషించారు. అంగారకుడికి కక్ష్యలోకి వెళ్లి... అక్కడ ఆ గ్రహం ఆనుపానులు కనిపెట్టడానికి ప్రయోగించిన 'మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్)'లో ఆమె కీలకమైన పాత్ర పోషించారు. 'మామ్'లో మొత్తం 90 మంది శాస్త్రవేత్తలు పనిచేస్తే- దానిలో 20 మంది మహిళలే! వీరందరూ వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చినవారు. వేర్వేరు వృత్తి నైపుణ్యాలు ఉన్నవారు. అయినా అందరూ కలిసికట్టుగా ఒక బృందంగా పనిచేసి విజయం సాధించారు. "మామ్ ప్రయోగానికి ముందు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి వచ్చేది. అందరం విపరీతమైన ఒత్తిడిలో ఉండేవాళ్లం. అయినా విజయం సాధించాలనే లక్ష్యంతోనే పని చేసేవాళ్లం" అంటారు చైత్రారావు. ఆ సమయంలోనే ఆమె బృందం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో కలిసి పని చేశారు. "ఆయన మాటలు ఎప్పుడూ చాలా స్ఫూర్తిదాయకంగా ఉండేవి. ఏవైనా సమస్యలు చెబితే వాటి పరిష్కారాల కోసం ఆయన కూడా ప్రయత్నించేవారు. మాకు తోడుగా ఉండేవారు" అని అబ్దుల్ కలాంతో తమ అనుభవాలను చెబుతారు చైత్రారావు. బహుశా ఆ సమయంలో అందరితో కలిసి పని చేసిన అనుభవం నైసార్ ఉపగ్రహ అభివృద్ధిలో, నిర్మాణంలో పనికివచ్చింది. ఈ ఉపగ్రహ డిజైన్, రాడార్ల లాంటి వివిధ భాగాల తయారీ అమెరికాలో జరిగింది. దీనికోసం చైత్రారావు, ఆమె బృందం 'నాసా' శాస్త్రవేత్తలతో కలిసి... గత ఏడాదంతా అక్కడ పనిచేయాల్సి వచ్చింది. "అది కూడా ఒక మరచిపోలేని అనుభవం" అంటారు చైత్రారావు. "నాసా వేరు. ఇస్రో వేరు అనే భావన ఎన్నడూ రాలేదు. దేశాలు వేర్వేరు కావచ్చు. కానీ అందరం ఒకటే! అందరం అంతరిక్ష సమాజానికి చెందినవాళ్లమే అనిపించింది" అంటారామె! ఇప్పటివరకూ మన దేశానికి అంతరిక్ష రంగంలో ఎంతో కీర్తి తెచ్చిపెట్టిన చైత్రారావు మరిన్ని విజయాలను సాధించాలని కోరుకుందాం.

వంటిల్లు

వావ్... వాక్కాయ

ఒకవైపు ఎర్రగా మరోవైపు తెల్లగా లేదంటే ఆకుపచ్చగా ఉండే వాక్కాయలను ఇష్టపడనివారు ఉండరు. ఇవి పుల్లగా కాస్త వగరుతో నోరూరించేలా ఉంటాయి. పిల్లలు ఇష్టంగా తినే తియ్యని చెర్రీలను ఈ వాక్కాయలతోనే తయారు చేస్తారు. బేకరీ ఐటెమ్స్‌లో, స్వీట్ పాన్‌కు జతగా కూడా ఈ చెర్రీలను చూస్తూ ఉంటాం. ఇలాంటి వాక్కాయలతో తయారుచేసే కమ్మని రుచులు మీకోసం...



వాక్కాయ పులిహోర



కావాల్సిన పదార్థాలు

బియ్యం- రెండు కప్పులు, నూనె- అయిదు చెంచాలు, పసుపు- అర చెంచా, వాక్కాయలు- 25, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పల్లీలు- నాలుగు చెంచాలు, పచ్చి శనగపప్పు- రెండు చెంచాలు, మినప్పప్పు- రెండు చెంచాలు, జీడిపప్పు- కొద్దిగా, ఇంగువ- చిటికెడు, పచ్చిమిర్చి- అయిదు, ఎండు మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉప్పు- ఒక చెంచా

తయారీ విధానం

- ముందుగా బియ్యాన్ని కడిగి తగినన్ని నీళ్లు పోసి ఒక చెంచా నూనె, పావు చెంచా పసుపు వేసి పొడిపొడిగా ఉండేలా అన్నం వండుకోవాలి. ఈ అన్నాన్ని ఒక కంచంలో వేసి చల్లారనివ్వాలి. వాక్కాయలను శుభ్రంగా కడిగి మధ్యకు కోసి లోపలి గింజలను తీసివేయాలి. మిక్సీలో వాక్కాయ ముక్కలు, మూడు పచ్చి మిర్చి, అర చెంచా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ముందుగా పల్లీలు వేసి దోరగా వేపి పళ్లెంలోకి తీయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, పావు చెంచా పసుపు, ఇంగువ, ఎండు మిర్చి, పచ్చిశనగపప్పు, మినప్పప్పు, జీడిపప్పు, రెండు మధ్యకు చీల్చిన పచ్చి మిర్చి, కరివేపాకు వేసి దోరగా వేపాలి. తరవాత వాక్కాయల పేస్టు వేసి బాగా కలిపి నూనె పైకి తేలే వరకూ వేయించాలి. తరవాత ఇందులో చల్లారిన అన్నం, అర చెంచా ఉప్పు, వేయించిన పల్లీలు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఇలా తయారుచేసుకున్న వాక్కాయ పులిహోరను వేడిగా తింటే బాగుంటుంది. చల్లారాక కూడా రుచిగానే ఉంటుంది.

చిట్కాలు

- వాక్కాయ ముక్కలను పేస్టు చేయకుండా తాలింపులో వేసుకుని కూడా పులిహోర తయారు చేసుకోవచ్చు.
- ఈ వాక్కాయ పులిహోరలో కొద్దిగా ఆవపిండి లేదా నువ్వుల పొడి కలిపితే మరింత రుచిగా ఉంటుంది.

వాక్కాయ చికెన్



కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు- అర కేజీ, వాక్కాయలు- పావు కేజీ, ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిర్చి- మూడు, నూనె- మూడు చెంచాలు, పసుపు- పావు చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, కారం- మూడు చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

- వాక్కాయలు, చికెన్ ముక్కలను విడివిడిగా నీళ్లతో శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. వాక్కాయలను మధ్యకు కోసి లోపలి గింజలను తీసివేయాలి. ఒక ఉల్లిపాయను సన్నగా తరగాలి. మరోదాన్ని నాలుగు బద్దలుగా కోయాలి. మిక్సీలో వాక్కాయ ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేసి గిన్నెలోకి తీయాలి. అలాగే మిక్సీలో పచ్చిమిర్చి, ఉల్లిపాయ బద్దలు వేసి పేస్టులా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి-ఉల్లిపాయ పేస్టు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి దోరగా వేపాలి. తరవాత చికెన్ ముక్కలు, కారం వేసి కలపాలి. గిన్నెమీద మూత పెట్టి పావుగంటసేపు మగ్గించాలి. మధ్యమధ్యలో మూత తీసి కలుపుతూ ఉండాలి. తరవాత ధనియాల పొడి వేసి కలిపి ఒక గ్లాసు నీళ్లు పోసి మూతపెట్టి అయిదు నిమిషాలు ఉడికించాలి. తరవాత వాక్కాయల పేస్టు, ఉప్పు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత గరం మసాలా, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న వాక్కాయ చికెన్ వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

- చికెన్ ముక్కలను మరీ మెత్తగా ఉడికించకూడదు.
- గ్రేవీ చిక్కగా కావాలనుకుంటే అర చెంచా కార్న్‌ఫ్లోర్‌ను పావు కప్పు నీళ్లలో కలిపి... ఉడుకుతున్న కూరమీద చిలకరించాలి.

వాక్కాయలను తినడం వల్ల మూత్రనాళాలు శుభ్రపడతాయి. మూత్రపిండాల్లో రాళ్లు కరిగిపోతాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. వాక్కాయల రసం తాగితే గుండె జబ్బులు మాయమవుతాయి. హార్మోన్లు సమతుల్యంగా పనిచేస్తాయి. పెప్టిక్ అల్సర్ తగ్గుతుంది. ఊపిరితిత్తులు, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి.

వాక్కాయలతో ఊరగాయ



కావాల్సిన పదార్థాలు

తాజా వాక్కాయలు- పావు కిలో, కారం- నాలుగు చెంచాలు, ఉప్పు- మూడు చెంచాలు, ఆవపిండి- అర చెంచా, మెంతి పిండి- పావు చెంచా, పసుపు- పావు చెంచా, నూనె- అర కప్పు, వెల్లుల్లి రెబ్బలు- పది

తయారీ విధానం

- వాక్కాయలను ఉప్పు నీళ్లలో పది నిమిషాలు నానబెట్టాలి. తరవాత మంచినీళ్లు పోసి బాగా రుద్ది కడగాలి. వీటిని పొడిగుడ్డతో శుభ్రంగా తుడవాలి. వాటిని మధ్యకు కోసి గింజలు తీసివేయాలి. ఒక్కో వాక్కాయను పొడవుగా నాలుగు ముక్కలుగా కోయాలి.
- ఒక వెడల్పాటి గిన్నెలో వాక్కాయ ముక్కలు, కారం, ఉప్పు, పసుపు, ఆవపిండి, మెంతిపిండి, వెల్లుల్లి రెబ్బలు వేసి బాగా కలపాలి. తరవాత నూనె పోసి కలపాలి. మూత పెట్టి మూడు రోజులు ఊరనివ్వాలి. తరవాత మరోసారి ఊరగాయను బాగా కలిపి గాజు సీసాలో లేదంటే జాడీలో భద్రపరచుకోవాలి. ఇది ఆర్నెల్లు నిల్వ ఉంటుంది. వేడి అన్నం, ఉప్మా, దోశ, వడల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

- వాక్కాయలను కోసేటప్పుడు వాటికి ఏమాత్రం తడి ఉండకూడదు. చాకు, గిన్నె కూడా పొడిగా ఉండాలి.
- నువ్వుల నూనె లేదా పల్లీల నూనె వేసుకోవచ్చు. ఈ ఊరగాయ మీద నూనె తేలుతూ ఉండాలి.
- రాళ్ల ఉప్పును పొడి చేసి వేస్తే ఊరగాయ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

వాక్కాయల్లో అత్యధికంగా సి విటమిన్, ఐరన్, పీచుపదార్థాలు ఉంటాయి. వాక్కాయలను తరచూ తినడం వల్ల శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్య పెరుగుతుంది. రక్తహీనత, స్కర్వీ, డయేరియా, ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు తగ్గుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం నిగారింపును సంతరించుకుంటుంది.

పిల్లలకు పోషకాహారం...

పిల్లలకు ఆహారం తినిపించడం అనేది తల్లిదండ్రులకు ఒక సవాల్ అనే చెప్పాలి. వాళ్లు తినేది కొద్ది మాత్రమే అయినప్పటికీ అందులోనే పోషకాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు ఎలాంటి ఆహారాన్ని ఏ విధంగా పెట్టాలో తెలుసుకుందాం..

- పెరిగే పిల్లలకు ఎక్కువగా పిండిపదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు అవసరమవుతాయి. కాబట్టి వాళ్లు తినే ఆహారంలో అన్నం, చపాతీ, పరాట, పప్పు, పనీర్, గుడ్లు, మాంసం, నెయ్యి, గింజలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూడాలి. వంటకాల్లో ఉప్పు, కారం, మసాలా పొడులు, ఆవాలు, జీలకర్ర , ధనియాలు, పసుపు లాంటివి తగుమాత్రంలో వాడుతూ ఉండాలి.
- పిల్లలకు ఆహారం మీద ఆసక్తి కలిగేలా మాట్లాడుతూ తినిపించాలి. ఒకేసారి ఎక్కువగా కాకుండా కొద్దికొద్దిగా పెడుతూ ఉండాలి. దీనివల్ల పిల్లలో జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- కొంతమంది పిల్లలు భోజనం కంటే అల్పాహారాన్నే ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. అలాంటప్పుడు పిల్లలకు చిరుధాన్యాలతో తయారుచేసిన చిరుతిండ్లు, కూరగాయల చిప్స్, గ్రిల్ చేసిన కూరగాయల ముక్కలు పెట్టవచ్చు. కూరగాయలు ఉడికించిన నీళ్లతో సూప్ తయారు చేసి తాగించవచ్చు. మొలకెత్తిన శనగలు, పెసలతో గుగ్గిళ్లు చేసి తినిపించవచ్చు. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్ పెట్టవచ్చు.
- కొంచెం పెద్ద పిల్లల ముందు రకరకాల కూరగాయలను ఉంచి వాటి గురించి వివరిస్తూ ఉండాలి. పిల్లలకు ఇష్టమైన కూరలు, పండ్లు ఏవో అడిగి తెలుసుకోవాలి. కూరగాయలను తరిగేటప్పుడు వాటిని వండేటప్పుడు పిల్లల సహాయం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ వంటకాల మీద ఆసక్తి కలిగి పిల్లలు ఇష్టంగా తింటారు.
- బడికి వెళ్లే పిల్లలకు రుచిగా ఉండేలా ఆహారపదార్థాలు తయారు చేయాలి. చూడడానికి ఆకర్షణీయంగా ఉండేలా బాక్సుల్లో సర్దాలి. పిల్లలకు స్వయంగా భోజనం చేయడం నేర్పించాలి. తోటి పిల్లలతో పంచుకుని తినడాన్ని ప్రోత్సహించాలి. రాత్రి సమయంలో పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలి.




భోజనకుతూహలం

అలసటకు విరుగుడు అవిసె ఆకుల టీ

'భోజన కుతూహలం' గ్రంథంలో అవిసె మొక్క గురించి విశేషంగా ప్రస్తావించారు. చిక్కుడు జాతికి చెందిన ఈ మొక్క ఆకులకు.. గింజలకు అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ మొక్క మొగ్గలు పక్షి ఆకారంలో ఉంటాయి. అందువల్ల ఇంగ్లీషు వారు ఈ మొక్కను హమ్మింగ్ బర్డ్ వెజిటబుల్ అని కూడా పిలుస్తారు. ఈ మధ్యకాలంలో అవిసె గింజల నూనెను వాడమని అనేక మంది వైద్య నిపుణులు సిఫారసు చేస్తున్నారు. అంతే కాదు.. అగస్త్య రసాయనం అనే ఆయుర్వేద ఔషధం ఈ ఆకులతోనే తయారవుతుంది. దీనిని అనేక వ్యాధుల నివారణ కోసం ఉపయోగిస్తారు. ఈ మొక్కకు ఉన్న ఔషధ గుణాల గురించి తెలుసుకుందాం.

- అవిసె మొక్క ఆకులతో కూర, పప్పు, పచ్చడి చేసుకొని క్రమం తప్పకుండా తింటే తీవ్రమైన మైగ్రేన్ కూడా తగ్గుతుంది. రెటీనా సమస్యలకు ఇది మంచి మందు. 'భావప్రకాశ' గ్రంథంలో ఈ మొక్క ఆకులు కంటి సమస్యలన్నింటినీ తగ్గిస్తాయని పేర్కొన్నారు.
- ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారు ఈ మొక్క పువ్వులను ముద్దగా నూరి తలకు పట్టిస్తే ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది.
- ఈ మొక్క నీరసాన్ని తగ్గించి తక్షణమే శక్తిని ఇస్తుంది. బాగా అలసిపోయినప్పుడు అవిసె ఆకులతో టీ బాగా పనిచేస్తుంది.
- వైరల్ జ్వరాలు వచ్చినప్పుడు- ఈ ఆకులను నీటిలో వేసి బాగా మరిగించి.. ఆ కషాయంలో తేనె కలిపి తాగితే మంచి ఫలితాలు లభిస్తాయి.
- అవిసె ఆకులు శరీరంలోని విషదోషాలను పోగొడతాయి. ఈ ఆకుల కషాయం వాతాన్ని.. పైత్యాన్ని అదుపు చేస్తుంది.
- కడుపులో నులిపురుగులకు ఈ మొక్క ఆకులు మంచి విరుగుడు. అవిసె ఆకుల రసాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే ప్రేగులు శక్తిమంతమవుతాయి. అమీబియాసిస్ వంటి వ్యాధులున్నవారికి మంచిది.



- గంగరాజు అరుణాదేవి

చూయింగ్ గమ్ అంటుకుందా..?

దుస్తులకు చూయింగ్ గమ్ అంటుకుంటే ఒక పట్టాన వదలదు. దీన్ని చిన్న చిట్కాలతో సులువుగా తొలగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ చిట్కాలు...

- చూయింగ్ గమ్ అంటుకున్న డ్రెస్‌ను వేడి నీళ్లలో ముంచాలి. తరవాత ఆ ప్రదేశంలో పాత టూత్ బ్రష్‌తో రుద్దితే సమస్య తీరుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో రెండు చెంచాల వెనిగర్ వేసి వేడిచేయాలి. ఈ వేడి వెనిగర్‌ని చూయింగ్ గమ్ అంటిన చోట వేయాలి. రెండు నిమిషాల తరవాత డ్రెస్ నుంచి చూయింగ్ గమ్ విడిపోతుంది.



- దుస్తులకు అంటుకున్న చూయింగ్ గమ్ మీద ఒక ఐస్‌ముక్కను పెట్టాలి. కొద్దిసేపటి తరవాత చేత్తో తీసేస్తే గమ్ వచ్చేస్తుంది.
- ఇస్త్రీ చేసే టేబుల్ మీద ఒక కాగితాన్ని ఉంచాలి. దీనిపై చూయింగ్ గమ్ అంటుకున్న భాగం కిందికి వచ్చేలా డ్రెస్‌ను పరచాలి. పైన చిన్న చేతి రుమాలు వేసి దాని మీద ఇస్త్రీ చేయాలి. వేడికి కరిగి చూయిగ్ గమ్ కాగితానికి అతుక్కుంటుంది.
- చూయింగ్ గమ్ అంటుకున్న చోట కొద్దిగా హెయిర్ స్ప్రే చిలకరించాలి. తరవాత చేత్తో తీయడానికి ప్రయత్నిస్తే కొద్దికొద్దిగా గమ్ వచ్చేస్తుంది. మరోసారి హెయిర్‌స్ప్రే చల్లితే పూర్తిగా తీసేయవచ్చు.
- కొద్దిగా షాంపూ లేదా సర్ఫ్ నీళ్లు చల్లి బ్రష్‌తో రుద్దినా కూడా దుస్తులకు అంటిన చూయింగ్ గమ్ వదిలిపోతుంది.